APTEL/26/A4813



# శ్రీ వార్త

జాతీయ తెలుగు దినపత్రిక

కొత్త ఆలోచన.. కొత్త వార్త




సంపుటి : 01 సంచిక :55 ఎడిటర్.: కూరేటి సతీష్ పేజిలు : 08, వెల రూ. 2రూ/ బుధవారం - 02 - సెప్టెంబర్ - 2026

Published From : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad

## ఇరాన్ అధ్యక్షుడితో ప్రధాని మోదీ కీలక భేటీ

- ఇరాన్ అధ్యకక్షుడు పెజెష్కియాన్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమావేశమయ్యారు.
- కిర్గిస్థాన్‌లో జరుగుతున్న షాంఘై కో-ఆపరేషన్ సదస్సు సందర్భంగా వారిద్దరు భేటీ అయ్యారు.



బిష్కెక్: ఇరాన్ అధ్యకక్షుడు పెజెష్కియాన్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమావేశమయ్యారు. కిర్గిస్థాన్‌లో జరుగుతున్న షాంఘై కో-ఆపరేషన్ సదస్సు సందర్భంగా వారిద్దరు భేటీ అయ్యారు. రెండేళ్ల తర్వాత ఇద్దరు నేతలు మిగతా 2లో

## అమెరికాలో పెను విధ్వంసం.. వరదల్లో 20 మంది గల్లంతు!

- అమెరికాలోని ప్రసిద్ధ గ్రాండ్ కేనియన్ నేషనల్ పార్క్‌లో ఆకస్మిక వరదలు బీభత్సం సృష్టించాయి.
- కేవలం అరగంటలో కురిసిన భారీ వర్షంతో ఉప్పొంగిన వరద ప్రవాహానికి భారీ బండరాళ్లు, ఇనుప నిర్మాణాలు, ఇతర శిథిలాలు కొట్టుకుపోయాయి.



అమెరికాలోని ప్రసిద్ధ గ్రాండ్ కేనియన్ నేషనల్ పార్క్‌లో ఆకస్మిక వరదలు బీభత్సం సృష్టించాయి. కేవలం అరగంటలో కురిసిన భారీ వర్షంతో ఉప్పొంగిన వరద ప్రవాహానికి భారీ బండరాళ్లు, ఇనుప నిర్మాణాలు, ఇతర శిథిలాలు కొట్టుకుపోయాయి. మిగతా 2లో

## తెలంగాణలో తొలిసారిగా కవచ్ ప్రాజెక్ట్‌ను అమలు చేస్తున్నాం




- ★తెలంగాణ రాష్ట్రంలోని రైల్వేల అభివృద్ధికి అంకితభావంతో తాము పనిచేస్తున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు.
- ★కొత్త రైల్వే ట్రాక్‌లు, వాటిని ఉన్నతీకరణ చేసే విధంగా పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.
- ★మహబూబ్‌నగర్ జిల్లాలో ఆధునికీకరణ పనులు కొనసాగుతున్న రైల్వేస్టేషన్ పనులను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ పరిశీలించారు.

తెలంగాణ రాష్ట్రంలోని రైల్వేల అభివృద్ధికి అంకితభావంతో తాము పనిచేస్తున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కొత్త రైల్వే ట్రాక్‌లు, వాటిని ఉన్నతీకరణ చేసే విధంగా మిగతా 2లో

- ➤మూడు దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభం
- ➤నాడు పునాది వేసిన తానే నేడు ప్రారంభించడం అదృష్టమన్న సీఎం చంద్రబాబు
- ➤గత ప్రభుత్వం ఫేక్ ప్రారంభోత్సవంతో ప్రజలను మోసం చేసిందని తీవ్ర విమర్శ
- ➤2028 నాటికి రెండో దశ పూర్తి చేస్తామని, మార్కాపురం జిల్లా ఇస్తామని హామీ
- ➤నదుల అనుసంధానంతోనే దేశంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారమన్న ముఖ్యమంత్రి
- ➤జగన్ హయాంలో వెలిగొండ ప్రాజెక్ట్‌కు గ్రహణం పట్టింది: సీఎం చంద్రబాబు
- ➤ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల మూడు దశాబ్దాల కలను సాకారం చేస్తూ, కరవు నేలపై కృష్ణమ్మ పరుగులకు శ్రీకారం చుడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను జాతికి అంకితం చేశారు.
- ➤నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలను విడుదల చేసి, ఈ చారిత్రక ఘట్టానికి నాంది పలికారు.

### వెలిగొండ ప్రాజెక్టు జాతికి అంకితం చేశామని

# డ్రామా ఆడారు

**వాళ్లు కూడా అంతే సంతోషంగా ఉండాలి**



ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల మూడు దశాబ్దాల కలను సాకారం చేస్తూ, కరవు నేలపై కృష్ణమ్మ పరుగులకు శ్రీకారం చుడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను జాతికి అంకితం చేశారు. నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలను విడుదల చేసి, ఈ చారిత్రక ఘట్టానికి నాంది పలికారు. ఈ సందర్భంగా మిగతా 2లో

## "కరోనా కాలంలోనూ వైఎస్ జగన్ వెలిగొండ పనులను ఆపలేదు"




- ▶▶కరోనా కాలంలో కూడా వెలిగొండ ప్రాజెక్టు పనులను వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆపలేదని మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ తెలిపారు.
- ▶▶వెలిగొండ ప్రాజెక్టు ఘనత వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదేనని చెప్పారు.

నెల్లూరు: కరోనా కాలంలో కూడా వెలిగొండ ప్రాజెక్టు పనులను వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆపలేదని మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ తెలిపారు. మిగతా 2లో

## భావితరాలకు ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన, పచ్చని భవిష్యత్తును అందించడం అందరి బాధ్యత



- ❊33శాతం పచ్చదనం తప్పనిసరి
- ❊ఏపీ ఆర్థిక పురోగతికి పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.
- ❊రాష్ట్రంలోని అన్ని పరిశ్రమలు పర్యావరణ నిబంధనలను తు.చ. తప్పక పాటించాలని స్పష్టం చేశారు.
- ❊కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి పరిశ్రమ తన ప్రాంగణంలో కనీసం 33 శాతం పచ్చదనాన్ని అభివృద్ధి చేసి, సంరక్షించే బాధ్యతను చేపట్టాలని పిలుపునిచ్చారు.

ఏపీ ఆర్థిక పురోగతికి పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. రాష్ట్రంలోని అన్ని పరిశ్రమలు పర్యావరణ నిబంధనలను తు.చ. తప్పక పాటించాలని స్పష్టం చేశారు. కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి పరిశ్రమ తన ప్రాంగణంలో కనీసం 33 శాతం పచ్చదనాన్ని అభివృద్ధి చేసి, సంరక్షించే బాధ్యతను చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి పారిశ్రామికవేత్త మిగతా 2లో

# ముసారాం బ్రిడ్జిని ప్రారంభించిన సీఎం రేవంత్

**మూసారం బాగ్ బ్రిడ్జిని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు.**

- ★ఈ కార్యక్రమంలో సీఎంతో పాటు ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, కాలేరు వెంకటేష్, శ్రీ గణేష్, నవీన్ యాదవ్, బలాల తదితరులు పాల్గొన్నారు.
- ★మూసీవరదలతో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఈ కొత్త బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టారు.
- ★మూసారాంబాగ్ హైలెవల్ బ్రిడ్జిని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు.
- ★ఈ బ్రిడ్జిని రూ.52 కోట్ల వ్యయంతో 400 మీటర్ల పొడవుతో నిర్మించగా.. సీఎం నేడు (సోమవారం) ప్రారంభోత్సవం చేశారు.
- ★మూసీ నదిలో లక్షా యాభై వేల క్యూసెక్కుల వరద వచ్చినా ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా పటిష్ఠంగా దీనిని నిర్మించారు.




మూసారం బాగ్ బ్రిడ్జిని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. సోమవారం అంబర్‌పేటలో సీఎం రేవంత్ దీనిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఎంతో పాటు ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, కాలేరు వెంకటేష్, శ్రీ గణేష్, నవీన్ యాదవ్, బలాల తదితరులు పాల్గొన్నారు. మూసీవరదలతో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఈ కొత్త బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టారు. లక్ష 50 వేల క్యూసెక్కుల వరద నీటిని తట్టుకునేలా బ్రిడ్జిని నిర్మించారు. మిగతా 2లో

## 'పుట్టింటి నుంచే బయటకు పంపారు'



- ⌘బీఆర్ఎస్ సస్పెన్షన్‌పై భావోద్వేగానికి గురైన కవిత
- ⌘సభలో కన్నీటి పర్యంతమైన కవిత
- ⌘"కవిత సీఎం" అంటూ కార్యకర్తల నినాదాలు
- ⌘కొత్త పార్టీ పెట్టడానికి కారణాలు వివరించిన కవిత
- ⌘తీహార్ జైలుకు పంపిన వారికి ఎన్నికల్లో సమాధానమిస్తామని ప్రతిన

బీఆర్ఎస్ నుంచి తనను సస్పెండ్ చేయడంపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత భావోద్వేగానికి గురయ్యారు. పార్టీ కోసం తనను జైలుకు పంపారని పెద్ద నాయకులే చెప్పారని గుర్తు చేశారు. ఆ తర్వాత అదే పార్టీ నుంచి తనను బయటకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. "నాతో ఎందుకు ఇలా చేయాలి?" మిగతా 2లో

## శిలాఫలకమే మీది.. సంకల్పం, సమగ్ర నిర్మాణం వైఎస్సార్‌ది

**వెలిగొండలో చంద్రబాబు క్రెడిట్ చోరీపై వైఎస్ జగన్ ధ్వజం**

- వెలిగొండకు ప్రాణం 37.587 కిలోమీటర్ల జంట సొరంగాలు
- కీలక జంట సొరంగాలు పూర్తి చేసిన ఘనత మా ప్రభుత్వానిదే
- ఇప్పుడు జరుగుతున్నది.. మీ క్రెడిట్ చోరీనే బాబూ
- మీరు, మీ అనుకూల మీడియా ఎంతగా చరిత్రను వక్రీకరించినా వాస్తవాలు మారవు
- ప్రచార ఆర్భాటాన్ని పక్కన పెట్టి.. నల్లమలసాగర్‌ను నింపి, రైతులకు సాగునీరు ఇవ్వాలి



వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ చరిత్రను మార్చేలా కొన్నాళ్లుగా సీఎం చంద్రబాబు చేస్తున్న ప్రచారం, ఎల్లో మీడియా చేస్తున్న హడావుడి.. క్రెడిట్ చోరీ యత్నాలపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర విస్మయం వ్యక్తం చేశారు. మిగతా 2లో

## తెలంగాణకు తీరని ద్రోహం

### - మన ప్రాజెక్టులు ఎండిపోతున్నాయ్



- కృష్ణా నీటి దోపిడీపై సీఎం రేవంత్ మౌనం
- కేఆర్ఎంబీ ప్రేక్షకపాత్ర
- తక్షణమే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించాలి
- వెలిగొండకు కృష్ణా జలాల తరలింపుపై రేవంత్ ప్రభుత్వంపై హరీశ్ రావు విమర్శలు
- తెలంగాణ ప్రాజెక్టులు ఎండిపోతున్నా ఏపీకి నీళ్లు ఇస్తున్నారని ఆరోపణ

వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మిగతా 2లో

## రెండు దశల్లో నిర్మాణం.. 2028 నాటికి తొలి దశ పూర్తి

**విశాఖకు ఏఐజీ.. రూ.2,000 కోట్లతో వెయ్యి పడకల హాస్పిటల్..**

- విశాఖలో ఏఐజీ హాస్పిటల్ నిర్మాణానికి మంత్రి లోకేశ్ శంకుస్థాపన
- వెలిగొండపై మాటల యుద్ధం.. జగన్ కు లోకేశ్ కౌంటర్
- వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం... టీడీపీ, వైసీపీ విమర్శల పర్వం
- నీళ్లు లేకుండానే జగన్ ప్రాజెక్టును ప్రారంభించారంటూ లోకేశ్ ఎద్దేవా
- తొలి దశ పూర్తి చేసి నల్లమల సాగర్‌లోకి నీటిని విడుదల చేసిన చంద్రబాబు



ఉమ్మడి ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతంతో పాటు నెల్లూరు, కడప జిల్లాల్లోని పలు వెనుకబడిన ప్రాంతాల దశాబ్దాల కలను సాకారం చేసే వెలిగొండ ప్రాజెక్టు, మిగతా 2లో

శ్రీ వార్త
జాతీయ తెలుగు దినపత్రిక
కొత్త ఆలోచన.. కొత్త వార్త



## ఇరాన్ అధ్యక్షుడితో ప్రధాని మోదీ కీలక భేటీ

సమావేశం కావడం ఇదే తొలిసారి. మోదీ-పెజెష్కియాన్ ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు.సోమవారం సాయంత్రం రష్యా అధ్యకక్షుడు పుతిన్‌తో కూడా మోదీ సమావేశం కానున్నారు. కిర్గిజిస్థాన్ అధ్యక్షుడు సదిర్ జపరోవ్ ఆహ్వానం మేరకు 6వ ప్రపంచ నోమాడ్ క్రీడల అధికారిక ప్రారంభ వేడుకలో పుతిన్ ఆయన పాల్గొంటారు.అర్మేనియా ప్రధాని నికోల్ పాషిన్యాన్‌తో కూడా మోదీ సమావేశమయ్యారు. "బిష్కెక్‌లో జరుగుతున్న ఎస్‌సీఓ సదస్సు సందర్భంగా అర్మేనియా ప్రధాని నికోల్ పాషిన్యాన్‌తో సమావేశం జరిగింది. రక్షణ, ఐటీ, అంతరిక్షం, విద్య, ఔషధాలు తదితర రంగాల్లో భారత్--అర్మేనియా సహకారం మరింత పెరగనుంది. రానున్న రోజుల్లో వాణిజ్యం, పెట్టుబడుల సంబంధాలను మరింత బలోపేతం చేస్తామని కూడా మేము విశ్వసిస్తున్నాం" అని మోదీ తెలిపారు.కాగా, కిర్గిజిస్థాన్ రక్షణ అధికారులు, కిర్గిజ్ రిపబ్లిక్ మహిళా కాంగ్రెస్ ప్రతినిధులు సోమవారం ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన విషయాన్ని మీడియాకు తెలిపారు. భారత్--కిర్గిజిస్థాన్ మధ్య పెరుగుతున్న రక్షణ సంబంధాలను అధికారులు ప్రత్యేకంగా ప్రస్తావించారు. కిర్గిజిస్థాన్ రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన కెప్టెన్ తాలైబెక్ మాట్లాడుతూ.. "ప్రధాని మోదీని కలవడం మాకు జీవితంలో ఒక్కసారే వచ్చే అవకాశం. ఆయన ఇక్కడ కిర్గిజిస్థాన్‌కు రావడం గొప్ప విషయం" అని అన్నారు.కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో ప్రధాని నరేంద్ర మోదీ భేటీ అయ్యారు. షాంఘై సహకార సంస్థ (ఎస్సీవో) సదస్సు సందర్భంగా ఇరువురు నేతలు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఫిబ్రవరిలో ఇరాన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత మోదీ, పెజెష్కియాన్ ముఖాముఖిగా సమావేశం కావడం ఇదే తొలిసారి.ఇరువురు నేతలు ఏ అంశాలపై చర్చించారనే విషయం పూర్తిగా వెల్లడికాలేదు. అయితే హర్మూజ్ జలసంధిపై ఇరాన్ విధించిన దిగ్బంధం చర్చల్లో ప్రస్తావనకు వచ్చి ఉండొచ్చని తెలుస్తోంది. కిర్గిజిస్థాన్ పర్యటన తొలి దశలో మోదీతో పెజెష్కియాన్ సమావేశమై చర్చలు జరిపినట్లు భారత్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయం తెలిపింది.బిష్కెక్ బయలుదేరే ముందు పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ యుద్ధాన్ని కోరుకోవడం లేదని చెప్పారు. అయితే తమపై జరిగే దాడులకు బలంగా, దృఢంగా స్పందిస్తామని స్పష్టం చేశారు. తమ ప్రాంతంలో అస్థిరత అన్ని దేశాలకు నష్టమేనని అన్నారు. ఆర్థిక, భద్రతా లక్ష్యాల కోసం దేశాల మధ్య సహకారం అవసరమని పేర్కొన్నారు.అర్మేనియా ప్రధాని నికోల్ పషిన్యాన్‌తోనూ మోదీ భేటీ అయ్యారు. రక్షణ, ఆర్థికం, ఔషధాలు, సైన్స్ అండ్ టెక్నాలజీ, సంస్కృతి, విద్య రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పెంచే అంశాలపై చర్చించారు. పశ్చిమాసియాలో పరిస్థితితో పాటు ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై అభిప్రాయాలు పంచుకున్నారు. అర్మేనియాతో సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు భారత్ సిద్ధంగా ఉందని మోదీ తెలిపారు.తర్వాత రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో మోదీ భేటీ కానున్నారు. కిర్గిజిస్థాన్ అధ్యక్షుడు సదిర్ జపరోవ్ ఆహ్వానం మేరకు ఆరో ప్రపంచ నోమాడ్ గేమ్స్ ప్రారంభోత్సవంలోనూ మోదీ పాల్గొననున్నారు.

## అమెరికాలో పెను విధ్వంసం.. వరదల్లో 20 మంది గల్లంతు!

ఈ ఘటనలో 20 మందికి పైగా గల్లంతైనట్లు సమాచారం. అధికారులు గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టడంతో పాటు, ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని హెలికాప్టర్ల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. మధ్యాహ్నం సుమారు 2.30 గంటలకు బ్రైట్ ఏంజెల్ క్రీక్‌లో ఒక్కసారిగా వరద ఉధృతి పెరిగింది. ఆ నీరు కొలరాడో నదిలోకి దూసుకెళ్లడంతో మార్గంలోని ఫుట్‌బ్రిడ్జ్‌లు ధ్వంసమయ్యాయి. వరద ప్రవాహం కారణంగా అక్కడి భౌగోళిక స్వరూపమే మారిపోయినట్లు అధికారులు తెలిపారు. కొన్ని వీడియోల్లో కొత్తగా నదీ ప్రవాహం ఏర్పడినట్లు కనిపిస్తోంది. నేషనల్ వెదర్ సర్వీస్ ప్రకారం.. కేవలం 30 నిమిషాల్లో భారీ వర్షపాతం నమోదైంది. గ్రాండ్ కేనియన్ ప్రాంతంలో భూభాగం చాలా నిటారుగా ఉండటంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశం లేకుండా ఒక్కసారిగా దిగువకు ప్రవహించింది. దీంతో వరద వేగం అనూహ్యంగా పెరిగింది.వరదల అనంతరం ఫాంటమ్ రాంచ్ నుంచి ఇప్పటివరకు 62 మందిని హెలికాప్టర్ల ద్వారా తరలించినట్లు నేషనల్ పార్క్ సర్వీస్ వెల్లడించింది. ఈ ఘటనలో ఇప్పటివరకు ఎలాంటి మరణాలు లేదా గాయాలు నమోదైనట్లు అధికారులు చెప్పలేదు. అయితే 20 మందికి పైగా వ్యక్తుల ఆచూకీ తెలియకపోవడంతో ఆందోళన కొనసాగుతోంది.

## భావితరాలకు ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన, పచ్చని భవిష్యత్తును అందించడం అందరి బాధ్యత

దీనిని ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించి ముందుకు తీసుకెళ్లాలన్నారు.పరిశ్రమల పరిసరాల్లో మొక్కలు నాటడం వల్ల వాయు కాలుష్యాన్ని నియంత్రించడంతో పాటు వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించవచ్చని డిప్యూటీ సీఎం తెలిపారు. భావితరాలకు ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన, పచ్చని భవిష్యత్తును అందించడం అందరి బాధ్యతన్నారు. అభివృద్ధి, ప్రకృతి పరిరక్షణలను సమాంతరంగా ముందుకు తీసుకువెళ్లినప్పుడే స్థిరమైన ప్రగతి సాధ్యమవుతుందని అన్నారు. పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా సమాజానికి, ప్రకృతికి, రాబోయే తరాలకు విలువైన భవిష్యత్తును అందించగలమని పేర్కొన్నారు. ఏపీవ్యాప్తంగా ఉన్న అన్ని రకాల పరిశ్రమలు 33 శాతం పచ్చదనం నిబంధనను కచ్చితంగా అమలు చేసేలా కాలుష్య నియంత్రణ మండలి, ఏపీ-గ్రీన్ సంస్థలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పవన్ ఆదేశించారు. 2047 నాటికి రాష్ట్ర భూభాగంలో 50 శాతం పచ్చదనాన్ని సాధించాలన్న మహత్తర సంకల్పంలో పారిశ్రామిక వర్గాలు చురుకుగా భాగస్వాములు కావాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

## 'పుట్టింటి నుంచే బయటకు పంపారు'

అంటూ కన్నీటి పర్యంతమయ్యారు.నిజామాబాద్‌లో నిర్వహించిన తన పార్టీ పాంచజన్య సభలో కవిత మాట్లాడారు. సొంతంగా పార్టీ పెట్టిన తర్వాత తొలిసారి నిజామాబాద్ గడ్డపై అడుగుపెట్టిన ఆమె.. బీఆర్ఎస్ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. కన్నీళ్లు పెట్టుకున్నంత మాత్రాన తాను పిరికిదాన్ని కాదన్నారు. అవి బాధ, ఆవేశంతో వచ్చిన కన్నీళ్లని చెప్పారు.కవిత బోరున విలపించడంతో సభలో ఉన్న మహిళలు సైతం కంటతడి పెట్టుకున్నారు. కార్యకర్తలు "కవిత సీఎం.. సీఎం" అంటూ నినాదాలతో ప్రాంగణాన్ని హోరెత్తించారు.తెలంగాణలో ఇంకా ఎన్నో మంచి పనులు చేయాల్సి ఉందని కవిత చెప్పారు. అందుకే కొత్త పార్టీ పెట్టానన్నారు. తనను పుట్టింటి నుంచి బయటకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఆర్నెల్లు జైలులో ఉండి వచ్చినప్పుడు పుట్టినిల్లు ఆదరించలేదన్నారు. అదే సమయంలో తన అత్తమామలు ఒక్క మాట కూడా అనకుండా కడుపులో పెట్టుకుని కన్నబిడ్డలా చూసుకున్నారని చెప్పారు.ఏ తప్పూ చేయని తనను తీహార్ జైలుకు పంపిన వారికి ఎన్నికల్లో గెలుపుతో సమాధానం చెబుతానన్నారు. రాష్ట్ర సమస్యల పరిష్కారానికి కొత్త రాజకీయ శక్తి అవసరమని పేర్కొన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టుతో నిజామాబాద్ జిల్లాలో ఒక్క ఎకరానికైనా నీళ్లు వచ్చాయా? అని ప్రశ్నించారు. దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన వారిని నిలదీసేందుకు బీఆర్ఎస్ ఎందుకు వెనక్కి తగ్గుతోందని ప్రశ్నించారు. తాను నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డనని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన అభ్యర్థులను ఆదరించి గెలిపించాలని ప్రజలను కోరారు.

## తెలంగాణలో తొలిసారిగా కవచ్ ప్రాజెక్ట్‌ను అమలు చేస్తున్నాం

పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఆధునికీకరణ పనులు కొనసాగుతున్న రైల్వేస్టేషన్ పనులను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ పరిశీలించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. మహబూబ్‌నగర్‌ను రైల్వేహబ్‌గా మారుస్తున్నామని వెల్లడించారు. 5 వందేభారత్ రైళ్లు కేంద్రం తెలంగాణకు ఇచ్చిందని ప్రస్తావించారు .పదేళ్లలో 100 కొత్త రైళ్లు తెలంగాణలో అందుబాటులోకి తీసుకువచ్చామని వెల్లడించారు.తెలంగాణలో 42 రైల్వేస్టేషన్లను ఏకకాలంలో అభివృద్ధి చేస్తున్నామని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మౌలిక వసతులకు పెద్దపీట వేస్తున్నామని చెప్పుకొచ్చారు. 2014కు ముందు రైల్వేస్టేషన్లు అధ్వానంగా ఉండేవని.. కాని నేడు మోదీ హయాంలో పరిస్థితి మారిందని తెలిపారు. ప్రయాణికులు భాగస్వామ్యులయితే స్వచ్ఛస్టేషన్లు సాధ్యమవుతాయని వివరించారు. రైల్వేస్టేషన్లు ఏయిర్‌పోర్టు స్థాయిలో ఉండాలన్నదే ప్రధానమంత్రి నరేంద్రమోదీ లక్ష్యమని ఉద్ఘాటించారు.2014కు ముందు ఉమ్మడి రాష్ట్రంలో రూ.886 కోట్ల రైల్వేబడ్జెట్ ఉంటే 2026-27 బడ్జెట్‌లో తెలంగాణకే రూ.5454 కోట్లు కేటాయించిందని కిషన్‌రెడ్డి తెలిపారు. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి తెలంగాణలో రైల్వే రంగం నిర్లక్ష్యానికి గురయ్యిందని అన్నారు. దేశంలో 7 బుల్లెట్ ట్రైన్ ప్రవేశపెడితే.. తెలంగాణకు మూడు ఇచ్చామని.. ఇది రైల్వేరంగంలో సువర్ణాధ్యాయమని నొక్కిచెప్పారు రూ.5 లక్షల కోట్లతో బుల్లెట్ ట్రైన్స్ అందుబాటులోకి తీసుకువస్తున్నామని స్పష్టం చేశారు. ప్రమాదాలు జరగకుండా దేశంలోనే తొలిసారిగా కవచ్ ప్రాజెక్ట్‌ను తెలంగాణలో ప్రయోగాత్మకంగా అమలు చేయబోతున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## "కరోనా కాలంలోనూ వైఎస్ జగన్ వెలిగొండ పనులను ఆపలేదు"

వెలిగొండ ప్రాజెక్టు ఘనత వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదేనని చెప్పారు. వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 30.5 కిలోమీటర్ల టన్నెల్స్ పూర్తి చేశారని అనన్నారు. వెలిగొండ ప్రాజెక్టు రెండు టన్నెల్స్ పొడవు 37 కిలోమీటర్లని వివరించారు. "వెలుగొండ ప్రాజెక్ట్ నేనే ప్రారంభించా, నేనే పూర్తి చేశా అని చంద్రబాబు క్రెడిట్ చోరికి పాల్పడ్డాడు. 1996 లో శంకుస్థాపన చేసి ఎనిమిది ఏళ్లు సీఎంగా వున్న చంద్రబాబు ఒక తట్ట మట్టి ఎత్తిన దాఖలాలు లేవు. మొత్తం ప్రాజెక్ట్ వర్క్ లో 37.6 కి.లో సొరంగాలు తవ్వకాలు జరిపి పూర్తి చేసిన ఘనత వైఎస్ఆర్, జగన్ ది. 53.8 టీఎంసీ గల డ్యామ్ 87% శాతం నిర్మాణం వైఎస్ఆర్, జగన్ లే పూర్తి చేశారు. చంద్రబాబు పాలనలో రోజుకి 2.4 మీటర్ల పని మాత్రమే జరిగిదే. జగన్ హయాంలో కరోనా పరిస్థితిలో కూడా రోజుకు 4.5 మీటర్లు పనులు జరిగివే. 2024 జనవరిలో రెండు టనల్స్, హెడ్ రెగులేటర్స్ పూర్తి చేసి జగన్ ప్రారంభించారు. అదానీ డేటా సెంటర్ పేరు మార్చి నా క్రెడిట్ అనడం, విమానాశ్రయాల క్రెడిట్ ను దోచుకోవడం ఇంకా ఎన్ని దారుణాలకు పాల్పడుతాడు. రాష్ట్రంలో నేడు మా హయాంలో జరిగి దాదాపు పూర్తి కావచ్చని అన్ని పనుల తాలూకా క్రెడిట్ చోరికి పాల్పడుతున్నారు. మార్కాపురంలో మెడికల్ కాలేజ్, ఆసుపత్రి ప్రారంభాన్ని అడ్డుకుని నేడు మార్కాపురాన్ని నేనే అభివృద్ధి చేశా అనడం హాస్యాస్పదం. మాగుంట శ్రీనివాసుల రెడ్డి తన స్థాయి దిగజారి జగన్ మోహన్ రోడ్డుపై విమర్శలు చేయడం దారుణం.బీదా రవిచంద్ర మీకు చిత్త శుద్ధి వుంటే నెల్లూరు రైతాంగం గురించి ఆలోచన చేస్తే బాగుంటుంది. ఎన్టీఆర్ కాలం నాటి రాజకీయాలు మాట్లాడటం మానీ వెన్నుపోటు చంద్రబాబు రాజకీయంపై స్పందించండి. మీ నాయకుడు చంద్రబాబు బీసిలకు ఎందుకు రాజ్యాంగబద్ధ పదవులు ఇవ్వలేక పోయారు మొదట సమాధానం చెప్పాలి. సోమశిల అప్రాన్ పనులు నేను మంత్రిగా వున్న సమయంలో టెండర్లు పిలిచి 20% పైగా పనులు చేశాం.

# ముసారాం బ్రిడ్జిని ప్రారంభించిన సీఎం రేవంత్

దీని ప్రారంభంతో ఇక వర్షాకాలంలో వాహనదారులకు ఇక్కట్లు తప్పనున్నాయి.మూసారాంబాగ్ హైలెవల్ బ్రిడ్జిని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ బ్రిడ్జిని రూ.52 కోట్ల వ్యయంతో 400 మీటర్ల పొడవుతో నిర్మించగా.. సీఎం నేడు (సోమవారం) ప్రారంభోత్సవం చేశారు. మూసీ నదిలో లక్షా యాభై వేల క్యూసెక్కుల వరద వచ్చినా ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా పటిష్ఠంగా దీనిని నిర్మించారు. ఈ బ్రిడ్జితో అంబర్‌పేట, మూసారాంబాగ్ ప్రాంతాలకు ప్రయాణాలు సులభం కానున్నాయి.ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎంపీలు అసదుద్దీన్ ఒవైసీ, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, శ్రీ గణేశ్, నవీన్ యాదవ్, మల్‌రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎంపీ మధు యాష్కీ, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.హైదరాబాద్ నగరంలో మౌలిక వసతుల కల్పనలో భాగంగా మూసీ నదిపై నూతనంగా నిర్మించిన ముసారాంబాగ్ హైలెవెల్ బ్రిడ్జిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించి జాతికి అంకితం చేశారు. రూ.52 కోట్ల వ్యయంతో 400 మీటర్ల పొడవున జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్మించిన ఈ బ్రిడ్జి అందుబాటులోకి రావడంతో స్థానిక ప్రజల నిరీక్షణకు తెరపడింది. వర్షాకాలంలో మూసీ నది ఉప్పొంగినప్పుడలా పాత వంతెన నీటమునిగి తీవ్ర ట్రాఫిక్ స్తంభన ఎదురయ్యేది. భవిష్యత్తులో ఎంతటి భారీ వరదలు వచ్చినా రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఈ హైలెవెల్ బ్రిడ్జిని ప్రత్యేక ఇంజినీరింగ్ ప్రమాణాలతో రూపొందించారు. ఈ బ్రిడ్జి ప్రారంభంతో ముసారాంబాగ్, అంబర్పేట్, మలక్పేట్, చదర్ ఘాట్ పరిసర ప్రాంతాల ప్రజలకు గంటల తరబడి ఎదురయ్యే ట్రాఫిక్ కష్టాల నుంచి శాశ్వత ఉపశమనం లభించనుంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలతో పాటు హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తదితర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు .హైదరాబాద్ నగర వాసులకు నీటి కొరత తీర్చేలా రాష్ట్ర ప్రభుత్వం మూసీ నది పునరుజ్జీవనంలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుంచి ఘన్‌పూర్ వరకు నీటిని తరలించేందుకు రెండు భారీ పైప్‌లైన్ల నిర్మాణానికి సంబంధించిన ప్రాజెక్టుకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ రెండు పైప్‌లైన్లలో ఒక్కో పైప్‌లైన్ దాదాపు 10 టీఎంసీల నీటిని తరలించే సామర్థ్యం కలిగి ఉంటుందని పేర్కొంది. కాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవనంలో ప్రాజెక్టులో భాగంగా మూసీ పునరుజ్జీవనంతోపాటు హైదరాబాద్ మహా నగరానికి తాగునీటి సమస్యను పరిష్కరించడానికి మల్లన్నసాగర్ నుంచి 20టీఎంసీల నీటిని గోదావరి తాగునీటి ప్రాజెక్టు 2,3 దశల ద్వారా తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ పనులకు సంబంధించిన టెండర్లను ఆహ్వానిస్తూ జలమండలి గతంలోనే నోటిఫికేషన్ జారీచేసింది. హైబ్రిడ్ యాన్యుటీ విధానంలో రూ.5383.67కోట్లతో రెండు ప్యాకేజీలుగా పనులు చేపట్టాలని నోటిఫికేషన్?లో జలమండలి పేర్కొన్నది. 2,3 దశలకు సంబంధించిన పైపులైన్ లను రెండు వరుసలుగా వేయనున్నారు. మొదటి ప్యాకేజీలో మల్లన్నసాగర్ నుంచి ఘన్ పూర్ వరకు, రెండో ప్యాకేజీలో ఘన్ పూర్ నుంచి ఉస్మాన్ సాగర్ వరకు పనులు చేపట్టనున్నారు. ఈ రెండు ప్యాకేజీల్లో పైపులైన్, పంపింగ్, నిర్మాణంతోపాటు టెస్టింగ్, కమిషనింగ్ వంటి కార్యక్రమాలను అన్నింటిని కలిపి ప్రాజెక్టు విలువ అంచనా వేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వం మంగళవారంతో (సెప్టెంబర్ 1నాటికి) వెయ్యి రోజుల మైలురాయిని పూర్తిచేసుకుంటోంది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలనను అందించడం, సంక్షేమానికి, సామాజిక న్యాయానికి పెద్దపీట వేయడం.. రైతు, యువజన, మహిళా శ్రేయస్సుకు ప్రాధాన్యం ఇస్తూ.. రాష్ట్ర సంపదను పెంచడమే లక్ష్యంగా ప్రజాపాలన దూసుకుపోతోందని ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తీసుకుని రావడంలో, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు నిర్మించడంలో ఈ వెయ్యి రోజుల పాలన కొత్త అధ్యాయాన్ని నమోదు చేసిందని ఆదివారం ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. సంక్షేమ పథకాల అమలుతో పాటు వ్యవసాయం, మహిళా సాధికారత, విద్య, వైద్యం, ఉద్యోగ కల్పన, సామాజిక న్యాయం, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలపై ఈ కాలంలో ప్రధానంగా దృష్టి సారించినట్టు ప్రకటించింది.

# వెలిగొండ ప్రాజెక్టు జాతికి అంకితం చేశామని డ్రామా ఆడారు

ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ, తన రాజకీయ జీవితంలో ఇదొక మరపురాని రోజని, మాట ఇచ్చి నిలబెట్టుకు న్నానన్న సంతృప్తితో గుండె ఆనందంతో నిండిపో యిందని భావోద్వేగంగా అన్నారు. 1996 మార్చి 5న ముఖ్యమంత్రిగా ఇదే ప్రాజెక్టుకు తాను పునాదిరాయి వేసిన క్షణాలను గుర్తుచేసుకున్న చంద్రబాబు, సరిగ్గా 30 ఏళ్ల తర్వాత మళ్లీ ముఖ్యమంత్రిగా 2026 ఆగస్టు 31న దీనిని ప్రారంభించడం భగవంతుడు తనకు ఇచ్చిన అరుదైన అవకాశంగా అభివర్ణించారు. "పునాది వేశాను, ప్రాజెక్టు పూర్తి చేశాను, కృష్ణమ్మను తెచ్చాను, కరవును తరిమి కొడుతున్నాను. మాట ఇచ్చాను, నిలబెట్టుకున్నాను. ఈ ప్రాంత ప్రజల కళ్లలో ఆనందం చూస్తుంటే మాటలు పెగలడం లేదు. ఇది నా అదృష్టం" అని చంద్రబాబు అన్నారు.ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు, ఊళ్లు త్యాగం చేసిన 11 గ్రామాల నిర్వాసిత ప్రజలకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని, వారి త్యాగం లక్షల మంది జీవితాల్లో వెలుగులు నింపుతుందని కొనియాడారు. వెలిగొండ అంటే కరవుపై గెలుపు, రైతు భవిష్యత్తుకు నమ్మకం, ఫ్లోరైడ్ కష్టాలకు ముగింపు అని ఆయన అభివర్ణించారు.గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వెలిగొండ ప్రాజెక్టుకు గ్రహణం పట్టిందని, 2024 ఎన్నికలతో ఆ గ్రహణం వీడిందని చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "గత ప్రభుత్వం కేవలం 2.77 శాతం పనులు చేసి, విలువైన కాలాన్ని గాలికొదిలేసింది. ఎన్నికలకు నెల ముందు రూ.4,500 కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టి, ప్రాజెక్టును జాతికి అంకితం చేశామని డ్రామా ఆడింది. ఇది సిగ్గులేనితనం కాదా? కరవు ప్రాంత రైతులతో ఆడుకోవడానికి మానవత్వం ఉందా?" అని ఆయన ప్రశ్నించారు. సొరంగంలో ఇరుక్కుపోయిన టన్నెల్ బోరింగ్ మిషన్‌ను తాను స్వయంగా రంగంలోకి దిగి తొలగించానని చంద్రబాబు వెల్లడించారు. ఆ తర్వాత, ఇంకా పనులు మిగిలి ఉండగానే సొరంగాలు మొత్తం తిరిగివచ్చానని, ప్రాజెక్టు సిద్ధంగా ఉందని చెప్పిన ఆనాటి ఫేక్ ముఖ్యమంత్రిని ఏమనాలో మార్కాపురం ప్రజలే ఆలోచించాలని అన్నారు. తన హయాంలోనే ప్రాజెక్టుకు 50 శాతానికి పైగా నిధులు ఖర్చు చేశామని, వాస్తవాలు చరిత్రలో నిలిచిపోతాయని, ఫేక్ మాటలతో ప్రజలను ఎవరూ మోసం చేయలేరని చంద్రబాబు స్పష్టం చేశారు.ప్రాజెక్టుతో లబ్ధి పొందే రైతులు ఎంత సంతోషంగా ఉంటారో, త్యాగాలు చేసిన నిర్వాసితులు కూడా అంతే సంతోషంగా ఉండాలన్నదే తన ఆకాంక్ష అని ముఖ్యమంత్రి అన్నారు. నిర్వాసితులకు ఇప్పటికే రూ.768 కోట్లు అందించామని, త్వరలోనే మిగిలిన రూ.165 కోట్లు, రూ.169 కోట్లు కూడా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కటాఫ్ డేట్ సమస్యతో నష్టపోయిన వారికి అదనంగా రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు. ఏ ఒక్క నిర్వాసితుడు ఇబ్బంది పడకుండా ఆదుకోవడం తమ ప్రభుత్వ సిద్ధాంతమని ఆయన పునరుద్ఘాటించారు.ఎల్ నినో ప్రభావంతో ఎగువన జలాశయాల్లో నీళ్లు లేకపోయినా, కనీసం తాగునీటి అవసరాల కోసం 10.7 టీఎంసీల నీటిని నల్లమల సాగర్‌కు తీసుకొస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ఈ నీటితో మొదటి విడతలో 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందుతుందని వివరించారు. ప్రాజెక్టు పూర్తిగా పూర్తయితే ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 30 మండలాల్లో 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 23 లక్షల మందికి తాగునీరు అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఈ ప్రాజెక్టుతో పశ్చిమ ప్రకాశం తలరాత మారుతుందని, ఫ్లోరైడ్ అనే పదం గత చరిత్రగా మిగిలిపోతుందని భరోసా ఇచ్చారు.దేశంలో నీటి సమస్యకు నదుల అనుసంధానమే ఏకైక పరిష్కారమని, అది ప్రధాని నరేంద్ర మోదీతోనే సాధ్యమని చంద్రబాబు అన్నారు. 2027 మార్చి నాటికి పోలవరాన్ని పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని, వచ్చే కృష్ణా పుష్కరాలను మార్కాపురంలోనూ వైభవంగా జరుపుకోబోతున్నామని ప్రకటించారు. గోదావరి-కావేరి నదుల అనుసంధానంతో దక్షిణ భారతదేశంలోని నీటి యుద్ధాలకు ముగింపు పలకవచ్చని, ఆ దిశగా కేంద్రంతో చర్చలు సాగుతున్నాయని తెలిపారు. రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలో 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పశ్చిమ ప్రకాశం ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేస్తామని మాట ఇచ్చామని, ఆ మాట నిలబెట్టుకున్నామని స్పష్టం చేశారు. మార్కాపురాన్ని రూ.లక్ష కోట్ల గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌లో భాగం చేశామని, 2028 నాటికి వెలిగొండ రెండో దశను కూడా పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సభకు ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి చంద్రబాబుకు ఘన స్వాగతం పలికారు.వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 2019లో అధికారంలోకి రావడంతో వెలిగొండ ప్రాజెక్ట్‌కు గ్రహణం పట్టిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు (న్రూ జవీ జష్ఠ్రుఅతీఖుఎబ చీఱఅబ) విమర్శించారు. 2024లో కూటమి రాకతో గ్రహణం వీడిందని తెలిపారు. ఈరోజు (సోమవారం) మార్కాపురం జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటించారు. వెలిగొండ ప్రాజెక్ట్ ఫేజ్-1 ప్రారంభించి, జాతికి అంకితం చేశారు. కృష్ణా నీటికి జలహారతి, పైలాన్‌ను ఆవిష్కరించారు. నల్లమలసాగర్‌కు నీటిని విడుదల చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. గొడ్డలి పార్టీ హయాంలో విలువైన ఈ ప్రాజెక్ట్ నిర్మాణ కాలాన్ని గాలికొదిలేశారని ధ్వజమెత్తారు. నిర్వాసితుల కోసం జీవో ఇచ్చి అరకొర చెల్లింపులతో మోసం చేశారని ఆగ్రహించారు. ఏపీ సార్వత్రిక ఎన్నికల కంటే ఒక్క నెల ముందు ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి జాతికి అంకితం చేస్తున్నట్లుగా జగన్ డ్రామాలు ఆడారని మండిపడ్డారు.రూ.4 వేల కోట్ల పనులను పెండింగ్‌లో ఉంచుకుని ఈ ప్రాజెక్ట్‌ను జాతికి అంకితం చేసిన సిగ్గులేని గొడ్డలి పార్టీని ఏమనాలని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు.

# శిలాఫలకమే మీది.. సంకల్పం, సమగ్ర నిర్మాణం వైఎస్సార్‌ది

వెలిగొండ ప్రాజెక్టు చరిత్ర చాలా స్పష్టం.. శిలాఫలకం మాత్రమే మీది.. సంకల్పం, సమగ్ర నిర్మాణం వైఎస్సార్ గారిది.. కీలక జంట సొరంగాలు పూర్తి చేసిన ఘనత మా ప్రభుత్వానిది.. ఇప్పుడు జరుగుతున్నది మీ క్రెడిట్ చోరీ' అంటూ సీఎం చంద్రబాబుపై ధ్వజమెత్తారు. మీరు, మీ అనుకూల మీడియా ఎంతగా చరిత్రను వక్రీకరించినా వాస్తవాలు మారవు.. మీ మీడియాలో మీకు భజన చేయించుకున్నంత మాత్రాన నిజాలను దాచలేరంటూ సీఎం చంద్రబాబుకు చురకలంటించారు. నిర్వాసితులకు పూర్తి స్థాయిలో పరిహారం చెల్లించి పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రచార ఆర్భాటాన్ని పక్కన పెట్టి.. నల్లమలసాగర్‌ను నింపి.. రైతులకు సాగునీరు, ఫ్లోరైడ్ బాధిత ప్రాంతాలకు రక్షిత మంచినీరు అందించాలని హితవు పలికారు. పెద్దదోర్నాల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. మార్కాపురం ప్రభుత్వ మెడికల్ కాలేజీని ప్రభుత్వ రంగంలో పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ తన 'ఎక్స్' ఖాతాలో వైఎస్ జగన్ ఆదివారం పోస్టు చేశారు. అందులో ఆయన ఏమన్నారంటే..నాన్నగారి స్వప్నమైన వెలిగొండ ప్రాజెక్టు సాకారం కావడం ఎంతో సంతోషంగా ఉంది. ఆ మహాయజ్ఞంలో భాగస్వామిని కావడం.. మా ప్రభుత్వ హయాంలో అత్యంత క్లిష్టమైన జంట సొరంగాలను పూర్తిచేసి జాతికి అంకితం చేయడం.. ఇవాళ వాటి ద్వారా కృష్ణా జలాలు ప్రవహించడం నాకు ఎంతో సంతృప్తినిస్తోంది. రక్షిత మంచినీరు లేక ఫ్లోరోసిస్‌తో బాధపడుతున్న లక్షలాది కుటుంబాలకు, సాగునీటి కోసం ఎదురు చూస్తున్న రైతులకు వెలిగొండ ఒక సంజీవని. కానీ వెలిగొండపై చంద్రబాబు, ఆయన ఎల్లో మీడియా చేస్తున్న హడావుడి చూస్తే ఆశ్చర్యమేస్తోంది. కొన్ని రోజులుగా చేస్తున్నవన్నీ వెలిగొండ నిర్మాణ చరిత్రను మార్చే పబ్లిసిటీ ఫీట్లు, క్రెడిట్ చోరీ ప్రయత్నాలే. చంద్రబాబు గారూ వెలిగొండ చరిత్ర చాలా స్పష్టం. శిలాఫలకం మాత్రమే మీది. సంకల్పం, సమగ్ర నిర్మాణం వైఎస్సార్ గారిది.. కీలక జంట సొరంగాల పూర్తి ఘనత మా ప్రభుత్వానిది.. ఇప్పుడు జరుగుతున్నది మీ క్రెడిట్ చోరీ.చంద్రబాబు గారూ మీరు, మీ అనుకూల మీడియా ఎంతగా చరిత్రను వక్రీకరించినా వాస్తవాలు మారవు. మీ మీడియాలో మీకు భజన చేయించుకున్నంత మాత్రాన నిజాలను దాచలేరు. 1996లో హడావుడిగా, అప్పట్లో ఎన్నికల ముందు శంకుస్థాపన రాయి వేసి చేతులు దులుపుకొన్నారు. ఆ తర్వాత 2004 వరకూ ఎనిమిదేళ్లు అధికారంలో ఉన్నా ప్రాజెక్టును ఒక్క అడుగూ ముందుకు తీసుకెళ్లలేదు. ఆ ఎనిమిదేళ్లలో మీరు ఖర్చు చేసింది కేవలం రూ.10 లక్షలు. అదీ శంకుస్థాపన, సభ ఏర్పాట్లకే. వెలిగొండపై మీ చిత్తశుద్ధి ఏమిటో ఈ ఒక్క వాస్తవమే చెబుతోంది.వైఎస్సార్ గారు ముఖ్యమంత్రి అయ్యాక జలయజ్ఞంలో భాగంగా వెలిగొండకు సమగ్ర రూపమిచ్చారు. జంట సొరంగాలు, నల్లమలసాగర్, మూడు డ్యామ్‌లు, ఫీడర్ ఛానల్, ప్రధాన కాలువల నిర్మాణాన్ని చేపట్టి ప్రాజెక్టును సాకారం చేశారు. వెలిగొండకు ప్రాణం 37.587 కిలోమీటర్ల జంట సొరంగాలు. అవి లేకపోతే కృష్ణా జలాలు రావు. వైఎస్సార్ గారు ప్రారంభించిన నిర్మాణ దశలో 20.333 కిలోమీటర్లు పూర్తయ్యాయి. 2014--19 మధ్య మీ హయాంలో జరిగింది కేవలం 6.686 కిలోమీటర్లు. ఒక్క సొరంగానికి కూడా బ్రేక్‌త్రూ సాధించలేకపోయారు. మా ప్రభుత్వ హయాంలో కరోనా, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటూనే మిగిలిన అత్యంత క్లిష్టమైన 10.568 కిలోమీటర్ల తవ్వకాన్ని పూర్తి చేశాం. టన్నెల్--1ను 2021 జనవరిలో, టన్నెల్--2ను 2024 జనవరిలో పూర్తిచేశాం.

# రెండు దశల్లో నిర్మాణం.. 2028 నాటికి తొలి దశ పూర్తి

ఇప్పుడు తెలుగుదేశం, వైసీపీల మధ్య తీవ్ర రాజకీయ వివాదానికి కేంద్రంగా మారింది. మంత్రి నారా లోకేశ్.. వైసీపీ అధినేత జగన్ ను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు చేశారు. ఇవాళ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేయడం తెలిసిందే.నారా లోకేశ్ తన ఎక్స్ ఖాతాలో, "ఆ విజువల్స్‌ను దగ్గరగా చూడండి" అంటూ కొన్ని ఫోటోలను పోస్ట్ చేశారు. "2024లో వైఎస్ జగన్ చరిత్ర సృష్టించారు. నీళ్లు లేని ఒక నీటిపారుదల ప్రాజెక్టును ప్రారంభించారు. ఇలాంటి ఫేక్ ప్రారంభోత్సవం వైసీపీకే సాధ్యం!" అని ఎద్దేవా చేశారు. జగన్ ప్రభుత్వం 2024 మార్చిలో సొరంగాలు పూర్తి చేసిన సందర్భంగా నీటి ప్రవాహం లేకుండానే ప్రారంభోత్సవం జరిపిందని, ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం నిజంగా నీటిని విడుదల చేసిందని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు.కాగా, జగన్ నిన్న ఒక సుదీర్ఘ పోస్ట్‌లో వెలిగొండ ప్రాజెక్టు ఘనత తన తండ్రి వైఎస్ రాజశేఖర రెడ్డిది, తన ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. కీలకమైన సొరంగాల పనులను తమ ప్రభుత్వమే పూర్తి చేసిందని, టీడీపీ హయాంలో పనులు నెమ్మదిగా సాగాయని విమర్శించారు. ఈ పోస్టుకు కౌంటర్‌గానే లోకేశ్ తాజా విమర్శలు చేశారు.సోమవారం ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను ప్రారంభించి, నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలను విడుదల చేశారు. తొలి విడతగా 10.7 టీఎంసీల నీటిని విడుదల చేయడంతో, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని కరవు, ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు చెందిన సుమారు 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందనుంది.ఆంధ్రప్రదేశ్ వైద్య రంగంలో మరో కీలక ముందడుగు పడింది. ఆసియాలోనే ప్రసిద్ధి గాంచిన ఏఐజీ (ఏఐజీ) హాస్పిటల్స్ ఇప్పుడు విశాఖపట్నంలో కొలువుదీరనుంది. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ మెగా హాస్పిటల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. విశాఖ ఆనందపురం మండలం ఎండాడ వద్ద ఏఐజీ హాస్పిటల్స్ ఛైర్మన్, ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ డి. నాగేశ్వర్ రెడ్డితో కలిసి మంత్రి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు.విశాఖలో నెలకొల్పనున్న ఈ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కోసం ఏఐజీ యాజమాన్యం ఐదేళ్లలో దశలవారీగా రూ.2,000 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనుంది. నిర్మాణం పూర్తయితే వెయ్యి పడకల సామర్థ్యంతో ఇది ఉత్తరాంధ్రలోనే అతిపెద్ద వైద్య కేంద్రాల్లో ఒకటిగా నిలవనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 9,000 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఇది ఈ ప్రాంత ఆర్థికాభివృద్ధికి కూడా దోహదపడగలదని అంచనా వేస్తున్నారు.హాస్పిటల్ నిర్మాణాన్ని రెండు దశల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మొదటి దశలో 650 పడకల సామర్థ్యంతో 2028 అక్టోబర్ నాటికి సేవలు ప్రారంభించాలని భావిస్తున్నారు. మిగిలిన 350 పడకలతో రెండో దశను ఆ తర్వాత రెండేళ్లలో పూర్తి చేస్తారు. మొత్తం 9 ఎకరాల విస్తీర్ణంలో హాస్పిటల్ క్యాంపస్, 2.5 ఎకరాల్లో నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఏఐజీ తరహాలోనే ఇక్కడ కూడా 8 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్, 50కి పైగా వైద్య విభాగాలతో ప్రపంచ స్థాయి సేవలు అందించనున్నారు. కేవలం వైద్య సేవలే కాకుండా ఒకేచోట శిక్షణ, పరిశోధన, రోగులు మరియు వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సదుపాయాలతో ఒక సంపూర్ణ హెల్త్ కేర్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేయనున్నారు. శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి లోకేశ్‌కు ఏఐజీ హాస్పిటల్స్ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు.

# తెలంగాణకు తీరని ద్రోహం - మన ప్రాజెక్టులు ఎండిపోతున్నాయ్

అక్రమంగా తరలిస్తుంటే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చోద్యం చూస్తున్నారని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీష్ రావు ధ్వజమెత్తారు. ఏపీ అడ్డగోలుగా నీటి దోపిడీకి పాల్పడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం నోరు మెదపకపోవడం తెలంగాణ రైతాంగానికి ద్రోహం చేయడమేనని మండిపడ్డారు. ఈ మేరకు 'ఎ క్స్' వేదికగా ప్రకటన విడుదల చేశారు. ఆ పోస్టులో రాష్ట్ర ప్రభుత్వం, కేఆర్ఎంబీ తీరును ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. నీటి కేటాయింపులు లేకున్నా వరద జలాలు రాకున్నా.. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఏపీ ప్రభుత్వం బేసిన్ దాటి కృష్ణా జలాలను యథేచ్ఛగా తరలిస్తుంటే సీఎం రేవంత్ రెడ్డి చోద్యం చూస్తూ తెలంగాణకు తీరని ద్రోహం చేస్తున్నారన్నారు. ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో సాగునీటి కష్టాలు తీవ్రమవుతుంటే మరోవైపు ఏపీ ప్రభుత్వం తెలంగాణ నీటి హక్కులపై దండెత్తి కృష్ణా జలాలను అడ్డగోలుగా తరలిస్తోందని ఆరోపించారు. కృష్ణా బేసిన్‌లో భాగమైన బీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు నీళ్ల లేక ఆయకట్టులు ఎండిపోతుంటే మరోవైపు బేసిన్‌తో సంబంధం లేని ప్రాంతాలకు ఏపీ నిబంధనలు ఉల్లంఘిస్తూ యథేచ్ఛగా నీటిని తరలిస్తోందన్నారు. మాల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు, నాగార్జునసాగర్ కుడి కాల్వ.. ఇప్పుడు వెలిగొండ.. ఇలా తెలంగాణ వాటా నీటిని ఏపీ తరలిస్తున్నా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడం లేదని ఆయన ప్రశ్నించారు. రంగారెడ్డి, పాలమూరు, నల్లగొండ సహా తెలంగాణ రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం తీరని ద్రోహం చేస్తున్నదన్నారు. తెలంగాణకు దక్కాల్సిన కృష్ణా నీళ్లను మన పొలాలకు మళ్లించాల్సిన సీఎం రేవంత్ రెడ్డి.. ఏపీకి పరోక్షంగా ఎందుకు సహకరిస్తున్నారని నిలదీశారు. ప్రాజెక్టుల నిర్వహణ, నీటి వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) సైతం పట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గమన్నారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన సంస్థే ప్రేక్షకపాత్ర పోషిస్తే రాష్ట్ర నీటి హక్కులను ఎవరు కాపాడాలి అని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దీనిపై వెంటనే స్పందించాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు. కేఆర్ఎంబీపై ఒత్తిడి తెచ్చి తెలంగాణలోని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను నింపి, ఆయకట్టుకు నీటి సరఫరా జరిగేలా చూడాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో సాగునీటి ఎద్దడి ఏర్పడి భీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వంటి ప్రాజెక్టులు ఎండిపోతుంటే, ఏపీ మాత్రం నిబంధనలకు విరుద్ధంగా నీటిని తరలించుకుపోవడం తెలంగాణ రైతాంగ హక్కులపై దాడి చేయడమేనని మండిపడ్డారు.ఇప్పటికే మల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు ద్వారా తెలంగాణ వాటా నీటిని ఏపీ తరలించుకుపోయిందని, ఇప్పుడు వెలిగొండ వంతు వచ్చిందని ఆయన పేర్కొన్నారు. పాలమూరు, రంగారెడ్డి, నల్గొండ ప్రాంత ఆయకట్టుకు నీరందించడంలో విఫలమైన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, ఏపీ చర్యలపై ఎందుకు మౌనం వహిస్తోందని ప్రశ్నించారు.

APTEL/26/A4813
శ్రీ వార్త
జాతీయ తెలుగు దినపత్రిక
కొత్త ఆలోచన.. కొత్త వార్త



## అభివృద్ధి లక్ష్యంగా వేకువ జామునే పరిసరాల పరిశుభ్రత



ఘంటసాల, శ్రీవార్త న్యూస్ : మండల పరిధిలోని శ్రీకాకుళం గ్రామ పంచాయతీ సెక్రటరీ నాగ నాంచారమ్మ ఆధ్వర్యంలో గ్రామాభివృద్ధి లక్ష్యంగా డోర్ టు డోర్ కార్యక్రమం విజయవంతంగా మంగళవారం నిర్వహించారు. వేకువ జామున చెత్త చెదవారము పరిసరాల పరిశుభ్రత మీద అవగాహన కల్పించి, గ్రామ పరిశుభ్రత వాతావరణ కాలుష్యం లేకుండా వీధి వీధికి తిరుగుతూ అందరూ పరిశుభ్రంగా వాతావరణాన్ని కాలుష్యం లేకుండా చేసుకుని పరిసరాల పరిశుభ్రత కొరకు పాటుపడాలని సెక్రటరీ నాగ నాంచారమ్మ తెలిపారు. అందరికీ అందుబాటులో ఉండి గ్రామ అభివృద్ధి కొరకు పాటుపడాలన్నది పంచాయితీ ఉద్దేశం అని సెక్రటరీ నాగ నాంచారమ్మ తెలియజేశారు. రాష్ట్ర జనసేన నాయకులు కొండవీటి కృష్ణమూర్తి, కొండ బాబురావు తదితర నాయకులు పాల్గొన్నారు. ముందుగా జనసేన రాష్ట్ర నాయకులు కొండవీటి కృష్ణమూర్తి పెన్షన్లు పంపిణీ చేశారు

## ఘన వీడ్కోలు అందుకున్న గంగాధర్‌రావు



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్: ఎక్సైజ్ శాఖలో సాధారణ ఎస్సై స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగి సూపరింటెండెంట్‌గా పదవీ విరమణ పొందిన గంగాధర్‌రావుకు ఘన వీడ్కోలు లభించింది. కృష్ణాజిల్లా ఎక్సైజ్ శాఖలో ఆయన 43 సంవత్సరాలు నిర్వహించిన సుదీర్ఘ సేవలను గుర్తుచేసుకుంటూ సిబ్బంది సోమవారం సన్మాన సభ నిర్వహించారు.ఎక్సైజ్ శాఖలో ఎస్ఐగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించిన గంగాధర్‌రావు, విధి నిర్వహణలో అంకితభావం, క్రమశిక్షణతో బాధ్యతలు నిర్వర్తిస్తూ ఉన్నత పదవులను అధిరోహించారు. చివరకు ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు నిర్వర్తించి పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా సహచర అధికారులు, సిబ్బంది ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. విధి పట్ల నిబద్ధతతో పనిచేస్తూ శాఖ అభివృద్ధికి, ప్రభుత్వ ఆదాయ పరిరక్షణకు ఆయన అందించిన సేవలను కొనియాడారు. సుదీర్ఘకాలం తమతో కలిసి పనిచేసిన అధికారి పదవీ విరమణ పొందడం బాధాకరమైనప్పటికీ, ఆయన సేవా ప్రస్థానం తమకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.పదవీ విరమణ అనంతరం గంగాధర్‌రావు కుటుంబ సభ్యులతో ఆయురారోగ్యాలతో, ఆనందంగా ప్రశాంత జీవితం గడపాలని ఆకాంక్షిస్తూ సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ టి శ్రీనివాసరావు విజయవాడ, కృష్ణాజిల్లా డిస్టిక్ ప్రొహిబిషనరీ ఆఫీసర్ ఎస్. శ్రీనివాసరావు, కృష్ణా జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులపై కత్తితో దాడి చేసిన గంజాయి నిందితుడు

### ఆత్మరక్షణలో కాల్పులు జరిపిన పోలీసులు...జిల్లా ఎస్పీ



పెనమలూరు శ్రీవార్త న్యూస్: తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో పోలీసులపై కత్తితో దాడి చేసి పరారైన గంజాయి నిందితుడిని కృష్ణా జిల్లా పోలీసులు అరెస్ట్ చేసే క్రమంలో ఆత్మరక్షణ కోసం కాల్పులు జరిపినట్లు జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు తెలిపారు. మంగళవారం పెనమలూరు పీఎస్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు.ది.31.08.2026 న యర్నగూడెం వద్ద హైవే పెట్రోలింగ్ లో ఉన్న కానిస్టేబుల్ వి.వెంకటేశ్వరరావుపై నలుగురు గంజాయి నిందితులు కత్తితో దాడి చేసి పరారయ్యారని, ఆయనకు మూత్రపిండాలు, ప్రేగులు, ఛాతీ భాగంలో తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు.సాంకేతిక ఆధారాలతో ప్రధాన నిందితుడు పెనమలూరుకు చెందిన అక్కిదాసరి అవినద్ అని గుర్తించి, ది.01.09.2026 తెల్లవారుజామున కంకిపాడు మాణికొండ వద్ద పోలీసులు పట్టుకునే యత్నం చేయగా, నిందితుడు గన్నవరం పీసీ-982 దేవిశెట్టి శ్రీనుపై కత్తితో దాడి చేసి, సీఐ వాహనాన్ని ధ్వంసం చేశాడని చెప్పారు. హెచ్చరిక కాల్పులు జరిపినా లెక్కచేయకపోవడంతో ఆత్మరక్షణలో కంకిపాడు సీఐ మోకాలి దిగువ భాగంలో కాల్పులు జరిపి నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.గాయపడిన ఇద్దరినీ కంకిపాడు సీహెచ్ సీ కి, అనంతరం అవినద్ ను విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. కంకిపాడులో క్రైం నెం.198/2026 కింద కేసు నమోదు చేశామని, పరారీలో ఉన్న మిగిలిన ముగ్గురి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు కొనసాగుతోందని, పోలీసుల ప్రాణాలకు ముప్పు కలిగిస్తే ఉపేక్షించబోమని ఎస్పీ హెచ్చరించారు.

## గంజాయి నిందితుడి కత్తి దాడిలో గాయపడిన కానిస్టేబుల్‌ను పరామర్శించిన జిల్లా ఎస్పీ



కంకిపాడు శ్రీ వార్త న్యూస్: విధి నిర్వహణలో గాయపడిన కానిస్టేబుల్‌ను కృష్ణా జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు,పరామర్శించారు. తూర్పుగోదావరి జిల్లా ఎర్నగూడెం వద్ద గంజాయి రవాణాను అడ్డుకునే క్రమంలో పోలీసులపై దాడి చేసి పరారైన నిందితుడిని కంకిపాడు పరిసర ప్రాంతాల్లో గుర్తించి అదుపులోకి తీసుకునే యత్నంలో నిందితుడు కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో గాయపడిన కానిస్టేబుల్ ప్రస్తుతం కంకిపాడు సిహెచ్ హెల్త్ సెంటర్ లో చికిత్స పొందుతున్నారు.విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ సంబంధిత అధికారులతో కలిసి ఆసుపత్రిని సందర్శించారు. చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ ఆరోగ్య పరిస్థితిని స్వయంగా అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వైద్యులతో మాట్లాడి అందుతున్న చికిత్స, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయా, మెరుగైన వైద్యం కోసం ఉన్నత వైద్య కేంద్రానికి తరలించాల్సిన అవసరం ఉందా అనే అంశాలపై చర్చించారు.



కానిస్టేబుల్ కు ఎటువంటి లోటుపాట్లు లేకుండా వైద్యం అందేలా చూడాలని, ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. విధి నిర్వహణలో గాయపడిన సిబ్బందికి పోలీసు శాఖ అన్ని విధాలా అండగా ఉంటుందని, అవసరమైన వైద్య సహాయం, సంక్షేమ పరమైన సహకారం అందిస్తామని కానిస్టేబుల్ కు భరోసా ఇచ్చారు.అనంతరం ఎస్పీ ఘటనా స్థలాన్ని స్వయంగా సందర్శించి, ఘటన జరిగిన తీరు, నిందితుడి కదలికలు, పోలీసుల చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేసు దర్యాప్తు పురోగతిపై సమీక్షించారు.

## దార్శనిక నాయకుడు సీఎం చంద్రబాబు విక్కుర్తి రాంబాబు



అవనిగడ్డ సెప్టెంబర్ 1శ్రీవార్త : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు మొదటిసారి బాధ్యతలు స్వీకరించిన రోజైన సెప్టెంబర్ 1న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పయనంలో ఒక నూతన శకం ప్రారంభమైందని టీడీపీ నాయకులు విక్కుర్తి రాంబాబు పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు తొలిసారి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన శుభసందర్భాన్ని పురస్కరించుకుని అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలోని తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ ఆశయాలను, చంద్రబాబు నాయుడి సమర్థవంతమైన నాయకత్వాన్ని స్మరించుకుంటూ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుని సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు,తెలుగుదేశం పార్టీ అవనిగడ్డ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు,బచ్చు రఘునాథ్ ప్రసాద్,న్యాయవాది విక్కుర్తి రామకృష్ణ,పులిగడ్డ చంద్ర,అవనిగడ్డ ప్రకాశం,కొల్లూరి ఇమ్మనేయల్, దాసినేని శ్రీనివాసరావు,బండే రాఘవ,లుక్కా పీచ్చాయ్య,బడే సుబ్బారావు,రేపల్లె ఈశ్వరరావు, మొఘల్ మురాద్ బెగ్,లింగం బాబురావు,చెన్ను బాబురావు,కమ్మిలి సుబ్రమణ్యం,నారేపాలెం శివరామకృష్ణ,నాగిడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## పామర్రుకు 'ధనలక్ష్మి' పండగ.. డీపీఓ ఆకస్మిక తనిఖీతో కలకలలాడిన పట్టణం!

జిల్లా పంచాయతీ అధికారి ఎ.ధనలక్ష్మి రాకతో ఒక్కరాత్రిలో మారిన పామర్రు మేజర్ పంచాయతీ రూపురేఖలు.

తనిఖీ భయంతో వీధుల్లో బ్లీచింగ్, సున్నాల అలంకరణల హడావుడి.

ప్రజల వెటకారం:

"రోజూ ఉన్నతాధికారులు వస్తే మా ఊరు ఎప్పుడూ పండగలాగే ఉంటుంది!



పామర్రు శ్రీ వార్త న్యూస్: కృష్ణా జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి మంగళవారం నిర్వహించిన ఆకస్మిక తనిఖీ తో పామర్రు మేజర్ పంచాయతీకి ఒక్కసారిగా 'పండగ' శోభ వచ్చేసింది. గత కొన్ని నెలలుగా చెత్త కుప్పలతో, అస్తవ్యస్త పారిశుధ్యంతో దర్శనమిచ్చిన ప్రధాన రహదారులు, ఈరోజు ఉదయానికి బ్లీచింగ్ పౌడర్, సున్నాల అలంకరణలతో కలకలలాడాయి. ఉన్నతాధికారిణి ధనలక్ష్మి కళ్లగప్పేందుకు పంచాయతీ యంత్రాంగం యుద్ధప్రాతిపదికన చేపట్టిన ఈ కంటితుడుపు పారిశుధ్య హడావుడిని చూసి స్థానిక ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

సంపూర్ణ పారిశుద్ధ్య అమలకు ఆదేశాలు

పామర్రు పట్టణంలో సంపూర్ణ పారిశుద్ద్ ప ను లకు డిపిఓ ధనలక్ష్మి ప్రత్యేక ఆదేశాలు ఇచ్చారు. దీనిలో భాగంగా ప్రస్తుతం ఉన్న క్లాప్ మిత్రల (హరిత రాయబారులు )సంఖ్యను మరో 23 మందిని పెంచాలని స్పష్టంగా ఆదేశించారు.దీంతో గ్రామంలో తడి చెత్త పొడి చెత్త ఈ హరిత రాయబారులు సేకరించి నిర్ణయిత సమయానికి డంపింగ్ యార్డ్ కు తరలించి చెత్త నుండి సంపద సృష్టించేందుకు అవసరమైన మార్గాలను హామీ వివరించారు.

త్రాగునీటిపైపు లీకులను తక్షణమే అరికట్టే విధంగా చర్యలు తీసుకునేందుకు లని హెచ్చరించారు.

20 వార్డుల్లో వీధుల్లో పంచాయతీ వీధిలైట్లు సక్రమంగా వెలిగే విధంగా చూడాలని సూచనలు చేసారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో ఎంపీడీవో కే జ్యోతి,డిప్యూటీ ఎంపీడీవో బొమ్మసాని వెంకట సుబ్బారావు, కార్యదర్శి బొల్లంపల్లి వెంకటేశ్వరరావు, సానిటరీ ఇన్స్పెక్టర్ కే సుధాకర్, సచివాలయ కార్యదర్శులు నేరుసు నరేష్ బోసు తిరుమల ఉమా ప్రతాప్, జూనియర్ అసిస్టెంట్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

"ఆహా ఏమి విచిత్రం! నిన్నటివరకు అడిగినా పట్టించుకోని అధికారులు, ఈరోజు డీపీఓ ధనలక్ష్మి మేడం వస్తున్నారని ఇంతలా పరుగులు పెట్టారు. ప్రతిరోజు జిల్లా ఉన్నతాధికారులు ఇలాగే పామర్రు తనిఖీకి వస్తే, మా గ్రామానికి నిత్యం పండగ వచ్చిన మాదిరిగా ఎంత పరిశుభ్రంగా ఉంటుందో కదా!" అని స్థానికులు వెటకారం చేస్తున్నారు. ఏది ఏమైనా, అధికారులు చూపే ఈ తాత్కాలిక ముస్తాబులను నమ్ముకుండా... అంతర్గత వార్డుల్లో ఉన్న అసలైన సమస్యలను, డ్రైనేజీ లీకేజీలను, షెడ్లకే పరిమితమైన 6 కొత్త రిక్షాల వ్యవహారాన్ని డీపీఓ ధనలక్ష్మి నిశితంగా పరిశీలించి కఠిన చర్యలు తీసుకోవడం పట్ల పామర్రు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు..



## పెన్షన్ల పంపిణీలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శం



అవనిగడ్డ సెప్టెంబర్ 1 శ్రీవార్త : పేదలకు పెన్షన్ల పంపిణీలో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని తెలుగుదేశం పార్టీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం అవనిగడ్డలో టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకొని, కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, డ్వాక్రా సంఘాల బలోపేతం వంటి పథకాల ద్వారా మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. ప్రతి పేద కుటుంబానికి అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ద్వారా ప్రభుత్వం తమకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని, జీవనోపాధికి ధైర్యాన్ని అందిస్తోందని లబ్ధిదారులు తెలిపారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి, టీడీపీ నాయకులకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విక్కుర్తి రాంబాబు,తెలుగుదేశం పార్టీ అవనిగడ్డ మండలం అధ్యక్షులు యాసం చిట్టి బాబు,దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు,మాచవరపు ఆదినారాయణ,పార్టీ నాయకులు బండే రాఘవ,లుక్కా పిచ్చయ్య,పులిగడ్డ చంద్ర,లుక్కా శ్రీను,బడే సుబ్బారావు,మొఘల్ మురాద్,రాజులపాటి తాండవ తదితరులు పాల్గొన్నారు,

## ఘంటసాలకు విజయవాడ డిప్యూటీ డైరెక్టర్ బి అన్వాషాహ్





ఘంటసాల, శ్రీవార్త న్యూస్: ఘంటసాల గ్రామానికి మినిస్ట్రీ ఆఫ్ టెక్స్టైల్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వీవర్ససర్వీస్ సెంటర్ విజయవాడ డిప్యూటీ డైరెక్టర్ బి అన్వాషాహ్ నూతనముగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఘంటసాల కు విచ్చేసి ఘంటసాల గ్రామంలో చేనేత కార్మికుల స్థితిగతులపై విశ్లేషణ చేసి పరిశీలించి గతంలో జరిగిన ట్రైన్ ప్రోగ్రామ్స్ వర్క్ షెడ్ లో నిర్మాణం వంటివి వంటివి పరిశీలించి సంతృప్తి చెంది తదనంతరం ఘంటసాల గ్రామంలో బౌద్ధ క్షేత్రాన్ని సందర్శించినారు రాష్ట్ర చేనేత నాయకులు అందే జగదీష్, వీవర్ సర్వీస్ సెంటర్ సూపరిండెంట్ సజ్జ ఢిల్లీ బాబు, టెక్నికల్ సూపర్డెంట్ యు పఠాక్ సందర్శించినారు నూతనముగా డిప్యూటీ డైరెక్టర్గా బాధ్యతలు స్వీకరించి ఘంటసాల విచ్చేసిన డిప్యూటీ డైరెక్టర్ ను అందె జగదీష్ స్వగృహం నందు దృశ్యాలువాతొ సత్కరించి అభినందించారు

## గుర్రపు చెరువుకు త్రాగునీటి విడుదల



అవనిగడ్డ సెప్టెంబర్ 1 శ్రీవార్త : గ్రామంలోని మంచినీటి చెరువు గుర్రపు చెరువుకు పంచాయతీ అధికారులు త్రాగునీటిని విడుదల చేశారు. ముందుగా చెరువును వెల్లవేసి బ్లీచింగుతో శుభ్రం చేయించారు. మంగళవారం చెరువును నీటితో నింపే కార్యక్రమం ప్రారంభించారు. ఈ పనులను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పరిశీలించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి పెనుమూడి సాయిబాబు, తహసీల్దార్ బీ.అంకాలు, ఆర్ఐ బచ్చు బాలాజీ, పంచాయతీ ఈఓ తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## చర్చి నిర్మాణానికి అనుమతులు ఎవరిచ్చారు



అవనిగడ్డ సెప్టెంబర్ 1 శ్రీవార్త : అవనిగడ్డ శివారు మూడో వార్డు ఏరియాలో అశ్వరావు పాలెం రోడ్డు లోని పంట పొలాల మధ్య భారీ నిర్మాణం చేపడుతున్నారు. దాన్ని నిమిత్తం దానికి సంబంధించిన అనుమతులు ఎవరిచ్చారు ఏ విధంగా ఇచ్చారని విహెచ్పి. బిజెపి నేతలు ప్రశ్నించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ ఆ నిర్మాణంలో చర్చి కోసం ఏర్పాటు చేస్తున్నట్లు పలువురు రైతులు అనుమానం వ్యక్తం చేస్తూ బిజెపి నాయకులకు తెలిపారు అన్నారు. సంబంధిత కట్టడానికి అనుమతులు మేము ఇవ్వలేదని పంచాయతీ అధికారులు తెలియజేశారని వడనా మొద్దనా నుండి అనుమతులు తీసుకున్నారు లేదు తెలియని పరిస్థితి నెలకొందని ఈ కట్టడానికి ప్రజలలో వ్యతిరేకత వచ్చిన రైతులకు ఏ విధమైన ఇబ్బందులు కలిగిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. వెంటనే సంబంధిత అధికారులు కట్టడాలను పరిశీలించి తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు ఏడుకొండలు బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు అధ్యక్షులు భోగాది చంద్రశేఖర్ బిజెపి కిషన్ మోర్చా జిల్లా కార్యదర్శి భూపతి సుబ్రమణ్యం ఎస్సీ మోక్ష నాయకులు మెరుగు రణధీర్ దొంగల వెంకటగిరి విహెచ్పి ప్రఖండ అధ్యక్షులు కమ్మిలి సుబ్రహ్మణ్యం ప్రఖండ ఉపాధ్యక్షులు మానేపల్లి విజయ్ కుమార్ అవనిగడ్డ కండ విహెచ్పి అధ్యక్షుడు గరికిపాటి హరిప్రసాద్ బచ్చు శ్రీరామ్ మూర్తి లతోపాటు పలువురు పాల్గొన్నారు,

## కృష్ణా యూనివర్సిటీలో విద్యార్థుల సమస్యలపై వీసీకి వినతి

### పరిష్కరిస్తామని హామీ



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్: కృష్ణా విశ్వవిద్యాలయంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై ఆంధ్రప్రదేశ్ విద్యార్థి జేఏసీ ఏపీఎస్ఎఫ్ నాయకులు వైస్ ఛాన్సలర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యార్థులు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలపై స్పందించిన ఏపీఎస్ఎఫ్ నాయకత్వం మంగళవారం కృష్ణా యూనివర్సిటీ వీసీని కలిసింది. ఏపీఎస్ఎఫ్ కృష్ణా యూనివర్సిటీ అధ్యక్షులు ఐనాల శ్రీనివాసరావు వీసీతో విద్యార్థుల సమస్యలపై చర్చించి, వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు. దీనిపై వీసీ సానుకూలంగా స్పందించి, తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే ఎటువంటి పోరాటానికైనా ఏపీఎస్ఎఫ్ సిద్ధంగా ఉంటుందని ఆ సంస్థ ప్రకటించింది.

## ఉత్తరాంధ్ర సాగునీటి ముఖచిత్రంపై సువర్ణాక్షర సంతకం పోలవరం ఎడమ కాలువ

### సుమారు నాలుగు లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించిన అపర భగీరథుడు నారా చంద్రబాబు



ఆంధ్రప్రదేశ్ శ్రీ వార్త న్యూస్: పోలవరం ఎడమ కాలువ జల హారతి కార్యక్రమం నిర్వహణపై అధికారులు నాయకులతో మంత్రి కొల్లు రవీంద్ర సమీక్ష ఉత్తరాంధ్ర సాగునీటి ముఖచిత్రాన్ని మార్చే ప్రతిష్టాత్మక పోలవరం ఎడమ ప్రధాన కాలువ నిర్మాణం పూర్తయిన నేపథ్యంలో పాయకరావుపేటలో జలహారతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర హోమ్ మంత్రి వంగలపూడి అనిత, వాసంశెట్టి సుభాష్, కొలుసు పార్థసారథితో కలిసి అధికారులు, పార్టీ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జలహారతి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు తరలిరానున్న నేపథ్యంలో జన సమీకరణ, సభా ఏర్పాట్లు, తాగునీరు, ఆహారం సరఫరా తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. సభకు హాజరయ్యే ప్రజలు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా తాగునీరు, ఆహారం వంటి మౌలిక సదుపాయాల్లో ఎలాంటి లోటు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.అనంతరం పి.ఎల్.పురం వద్ద ఏర్పాటు చేస్తున్న సభా వేదికను మంత్రులు పరిశీలించారు. వేదిక, ర్యాంప్, గ్యాలరీలు తదితర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా ఉత్తరాంధ్ర జిల్లాల్లో సుమారు 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు ప్రజల తాగునీటి అవసరాలు కూడా తీరనున్నాయని తెలిపారు. అపర భగీరథుడిలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అహర్నిశలు శ్రమించి పోలవరం ఎడమ కాలువ పనులను పూర్తి చేయించి ప్రారంభోత్సవం నిర్వహించుకోవడం హర్షణీయమన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ ఉత్తరాంధ్ర రైతాంగానికి కొత్త ఆశలు కల్పిస్తుందని, ఈ ప్రాజెక్టు ప్రాంత వ్యవసాయ రంగానికి మరింత ఊతమిస్తుందని తెలిపారు.



కాలువ వద్ద మంత్రుల సంబరాలు

పోలవరం ఎడమ ప్రధాన కాలువ పూర్తయిన సందర్భంగా పాయకరావుపేటలో మంత్రులు, నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. కాలువ వద్ద టపాసులు కాల్చి, స్కై లాంతర్లు వెలిగించి ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర ప్రజల సాగునీటి, తాగునీటి అవసరాలను తీర్చే దిశగా పోలవరం ఎడమ కాలువ కీలక మైలురాయిగా నిలుస్తుంది. కాలువ పనులను పూర్తి చేసి ఉత్తరాంధ్రకు జలభరోసా కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి మంత్రి కొల్లు రవీంద్ర ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కో-ఆర్డినేటర్ బెందాళం అశోక్, బడేటి రాధాకృష్ణ, కూన రవికుమార్, వరుపుల సత్యప్రభ,అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు, ప్రగడ నాగేశ్వరరావు, దాడి రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

వార్త
జాతీయ తెలుగు దినపత్రిక
బుధవారం - 02 - సెప్టెంబర్ - 2026

# ఒక కొత్త రక్కసి.. ఇదొక మహా ప్రళయం!




మానవ మేధస్సుకు మరణశాసనం రాయడానికి ఒక కొత్త రక్కసి పుట్టుకొచ్చింది. దాని పేరు 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్'... క్లుప్తంగా 'ఏఐ'...కంప్యూటర్లు వచ్చాయి, ఇంటర్నెట్ వచ్చింది, స్మార్ట్‌ఫోన్లు వచ్చాయి... ప్రపంచం మారింది. కానీ ఇప్పుడు వస్తున్న ఏఐ ఆ మార్పు లాంటిది కాదు. ఇది మానవ జాతి ఉనికినే, శ్రమనే, ఉపాధినే నిలువునా మింగేసే ఒక మహా ప్రళయం. టెక్నాలజీ పెరుగుతోంది... కానీ మనుషులు తరిగిపోతున్నారు. లాభాలు కురుస్తున్నాయి... కానీ ఉపాధి మాయమవుతుంది. విశ్వవిఖ్యాత శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ ఒక సందర్భంలో చాలా స్పష్టంగా హెచ్చరించారు: "పూర్తి స్థాయి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అభివృద్ధి చెందితే... అది మానవ జాతి అంతానికే నాంది కాగలదు. అది మనుషులను అధిగమించి, తనను తాను రీ-డిజైన్ చేసుకుంటూ వెళ్తుంది. మితమైన జీవ పరిణామం ఉన్న మనుషులు దానితో పోటీ పడలేరని" ఇవాళ హాకింగ్ అన్న మాటలు అక్షరసత్యం అవుతున్నాయి. యంత్రం మనిషికి సాయం చేయాలి... కానీ మనుషులనే నామరూపాలు లేకుండా తుడిచేస్తుంటే, ప్రపంచ దేశాల పాలకులు ఎందుకు గుడ్డివాళ్లుగా మిగిలిపోయారు? కోట్లాది మంది ఉద్యోగాలకు ముప్పు వాటిల్లుతుంటే ఆ కుటుంబాల పరిస్థితి ఏంటి? అసలు కొనుగోలు శక్తి లేని సమాజంలో ఏఐ కంపెనీలు లాభాలు ఎలా ఆర్జిస్తాయి? ఈ ప్రాథమిక ఆర్థిక సూత్రం కార్పొరేట్ శక్తులకు, పాలకులకు ఎందుకు అర్థం కావడం లేదు? ఏఐతో మానవ వనరులకు పెను ముప్పు వాటిల్లుతుందనేది ఇవాళ ఊహ కాదు... కళ్ల ముందు కనిపిస్తున్న పచ్చి నిజం. మరి ఈ నిజం మన కంటికి కనిపిస్తున్నప్పుడు, ప్రపంచ దేశాలను ఏలుతున్న పాలకుల కళ్లకు ఎందుకు కనిపించడం లేదు? అమెరికా అధ్యక్షుడి నుంచి భారత ప్రధాని వరకు, యూరప్ దేశాల నేతల నుంచి ఆసియా పాలకుల వరకు... అందరూ ఏఐ సదస్సుల్లో పాల్గొంటూ, టెక్నాలజీని పొగుడుతూ కాలం గడుపుతున్నారు తప్ప, దాని వల్ల రాబోయే సామాజిక వినాశనాన్ని ఎందుకు అడ్డుకోవడం లేదు? విఖ్యాత ఫ్రెంచ్ తత్వవేత్త జీన్-జాక్వెస్ రూసో ఒక మాట అన్నారు: "ప్రజలు శాసనాలు చేసే పాలకులను ఎన్నుకుంటారు... కానీ ఆ పాలకులు ప్రజలను కాక, ధనవంతుల ప్రయోజనాలను రక్షించడానికి చట్టాలు చేస్తారు. " ఇవాళ ప్రపంచ పాలకుల పరిస్థితి సరిగ్గా అలాగే ఉంది. ఏఐ వల్ల సమాజంలో నిరుద్యోగం పెరిగి, నేరాలు ఎక్కువై, అనేక దుష్పరిణామాలు సంభవిస్తాయని తెలిసి కూడా పాలకులు ఎందుకు మౌనంగా ఉన్నారు? ఎందుకంటే, పాలకులకు ఎన్నికల వెనుక, వారి అధికార పీఠాల వెనుక ఈ భారీ టెక్ కార్పొరేట్ కంపెనీల లాబీయింగ్ ఉంది. మైక్రోసాఫ్ట్, గూగుల్, మెటా, ఓపెన్ ఏఐ వంటి సంస్థల లాభాల కోసం ప్రపంచ జనాభాలో సగానికి పైగా ఉన్న శ్రమజీవుల జీవితాలను బలిపీఠం ఎక్కిస్తున్నారు. అంతర్జాతీయ నివేదికల ప్రకారం... ప్రపంచవ్యాప్తంగా దాదాపు 60 శాతం ఉద్యోగాలు ఏఐ వల్ల ప్రభావితం కానున్నాయి. అంటే సగానికి పైగా మానవ వనరులు పనికిరాకుండా పోతాయి. ఈ మానవ వనరులను తుడిచిపెట్టడానికి ప్రపంచ ప్రసిద్ధి చెందిన టెక్ కంపెనీలు ఎంతెంత మొత్తాన్ని పెట్టుబడులుగా తగలేస్తున్నాయో తెలిస్తే మనం విస్తుపోవాల్సిందే. మైక్రోసాఫ్ట్, గూగుల్, మెటా, అమెజాన్ వంటి సంస్థలు కేవలం ఏఐ డేటా సెంటర్లు, చిప్‌ల కోసమే ఏడాదికి వందల బిలియన్ డాలర్లను... అంటే భారతీయ కరెన్సీలో లక్షల కోట్ల రూపాయలను నీళ్లప్రాయంగా ఖర్చు చేస్తున్నాయి. ఒక్క మైక్రోసాఫ్ట్ సంస్థే ఓపెన్ ఏఐ భాగస్వామ్యంతో వంద బిలియన్ డాలర్ల వ్యయంతో 'స్టార్‌గేట్' అనే భారీ ఏఐ సూపర్ కంప్యూటర్ ప్రాజెక్ట్‌కు తెరలేపింది. గూగుల్, మెటా సంస్థలు తమ సంప్రదాయ వ్యాపారాలను పక్కనబెట్టి, కేవలం ఏఐ మౌలిక సదుపాయాల కోసమే తమ వార్షిక మూలధన వ్యయాన్ని 40 బిలియన్ డాలర్లకు పైగా పెంచేసాయి. మానవాళి ఆకలిని తీర్చడానికి, పేదరికాన్ని నిర్మూలించడానికి పైసా విదల్చని ఈ కార్పొరేట్ శక్తులు... మనుషుల ఉద్యోగాలను ఊడబీకడానికి మాత్రం అక్షరాలా లక్షల కోట్లను తగలేస్తున్నాయి. మరి ఒక దేశానికి అత్యంత కీలకమైన మానవ వనరులను ఈ విధంగా విచ్ఛిన్నం చేస్తుంటే, సమాజంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతాయి. ఆకలి కేకలు ఎక్కువైతే తిరుగుబాట్లు వస్తాయి. ఇంతటి భయానక దుష్పరిణామాలు పొంచి ఉన్నా, పాలకులు కేవలం టెక్నాలజీ భ్రమల్లో బతుకుతుండటం ఈ శతాబ్దపు అతిపెద్ద విషాదం. ఏఐ పేరుతో, ఆటోమేషన్ పేరుతో కంపెనీలు సింపుల్‌గా ఒక ప్రెస్ నోట్ వదులుతున్నాయి... "మేము ఖర్చులు తగ్గించుకుంటున్నాం... ఉద్యోగులను తొలగిస్తున్నాం" అని. కానీ, ఆ లే ఆఫ్ లేఖ వెనుక ఉన్న ఒక కుటుంబం ఏమైపోవాలి? ఆ ఉద్యోగి నమ్ముకున్న తల్లిదండ్రులు, చదువుకుంటున్న పిల్లలు, కట్టాల్సిన ఇళ్ల లోన్లు, కార్ లోన్లు, రేపటి పూట అహారం... వీటన్నిటికీ సమాధానం ఎవరు చెబుతారు? ఈ నేపథ్యంలోనే వాంచన నగరమైన వాటికన్ నుండి పోప్ లూథర్ ౧×ం తన చారిత్రాత్మక పత్రం "మాగ్నిఫికా హ్యూమానిటాస్" ద్వారా ప్రపంచాన్ని తీవ్రంగా హెచ్చరించారు. సాంకేతికత వేగాన్ని, సమర్థతను మాత్రమే కొలమానంగా తీసుకోకూడదని, కార్మికుడి గౌరవాన్ని, సమాజంలో పాల్గొనే హక్కును గౌరవించాలని స్పష్టం చేశారు. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ పేరుతో జరుగుతున్న "నూతన బానిసత్వాన్ని" పోప్ తీవ్రంగా ఖండించారు. కేవలం టెక్నాలజీ ప్రవాహం నిరంతరాయంగా సాగడం కోసం దారుణమైన పరిస్థితుల్లో ఖనిజాలను వెలికితీస్తూ, డేటా లేబిలింగ్ చేస్తూ శ్రమిస్తున్న అట్టడుగు వర్గాల శారీరక శ్రమను, వారి గాయాలను ప్రపంచ కార్పొరేట్ శక్తులు విస్మరిస్తున్నాయని నిలదీశారు. ప్రముఖ సామాజిక తత్వవేత్త, రచయిత యువల్ నోవా హరారి తన హెచ్చరికలో ఒక భయంకరమైన పదాన్ని వాడారు. ఏఐ వల్ల భవిష్యత్తులో సమాజంలో "యూస్‌లెస్ క్లాస్" అంటే 'అనవసరమైన శ్రమ జీవుల వర్గం' ఒకటి తయారవుతుందని అన్నారు. అంటే మనుషులకు ఉద్యోగాలే లేకపోవడమే కాదు, అసలు వారు ఆర్థిక వ్యవస్థకు 'అనవసరమైన వారిగా' మారిపోయే ప్రమాదం ఉంది. కానీ ఇవాళ కార్పొరేట్ శక్తులకు సమాజం అంటే మనుషులు కాదు... వారి లాభాల బ్యాలెన్స్ షీట్లు మాత్రమే! సొంత లాభం కోసం పొరుగువాని పొట్ట కొట్టడమే ఏఐ కంపెనీల ఏకైక లక్ష్యంగా మారింది. ఒక్కో ఉద్యోగం పోయినప్పుడు కేవలం ఒక వ్యక్తి మాత్రమే రోడ్డున పడటం లేదు, ఆ వ్యక్తిని నమ్ముకున్న ఒక కుటుంబం నిలువునా కూలిపోతోంది. విద్యావంతులైన యువత, రాత్రి పగలు కష్టపడి చదివి నైపుణ్యాలు సంపాదించుకున్న టెక్ నిపుణులు... ఇవాళ ఏఐ టూల్స్ కారణంగా క్షణాల్లో ఉద్యోగాలు కోల్పోతున్నారు. ఆ కుటుంబాల ఆక్రందనలు, ఆ తల్లిదండ్రుల కన్నీళ్లు పాలకులకు వినిపించడం లేదా? ఏఐ తీసుకొచ్చిన ఈ కృత్రిమ మేధస్సు వల్ల మనుషుల జీవితాల్లో సహజమైన ఆనందం కరువైపోతోంది. నిరాశ, నిస్పృహలతో యువత ప్రాణాలు తీసుకుంటుంటే, ఈ టెక్నాలజీ ప్రగతి సాధించినట్లు ఎలా అనుకుంటాం? ఇప్పుడు ఒక ప్రాథమిక ఆర్థిక శాస్త్ర ప్రశ్నను మనం పాలకుల ముందు, ఏఐ కంపెనీల ముందు ఉంచాలి. మానవ వనరులే సర్వస్వం అనుకుంటే... ఏఐ కారణంగా ఆ మానవ వనరుల ఉపాధి దెబ్బతిని, వారి ఆదాయాలు పడిపోతే, సమాజంలో కొనుగోలు శక్తి ఏమైపోవాలి? ఆర్థిక శాస్త్ర పితామహుడు ఆడమ్ స్మిత్ తన 'వెల్త్ ఆఫ్ నేషన్స్'లో స్పష్టంగా చెప్పారు. "ఏ సమాజంలోనైనా మెజారిటీ ప్రజలు పేదరికంలో, బాధల్లో ఉంటే ఆ సమాజం ఎప్పటికీ వర్ధిల్లదు. వినియోగదారుడి డిమాండ్ మాత్రమే మార్కెట్‌ను నడిపిస్తుంది అని" పెట్టుబడిదారీ విధానంలో ఒక పెద్ద లోపం ఉంది... దాన్ని ఈ ఏఐ కంపెనీలు పూర్తిగా మర్చిపోయాయి. మనుషులకు ఉద్యోగాలు లేకపోతే వారికి జీతాలు రావు. జీతాలు రాకపోతే వారి ఆదాయం సున్నా అవుతుంది. ఆదాయం లేనప్పుడు మనుషులు కేవలం తినడానికి తిండి మాత్రమే కొనుక్కుంటారు తప్ప... కార్లు, బైకులు, బట్టలు, ఫోన్లు, విలాసవంతమైన వస్తువులు ఏవీ కొనలేరు. అంటే అన్ని రంగాలు తిరోగమనంలో పడతాయి. రియల్ ఎస్టేట్ కూలిపోతుంది, ఆటోమొబైల్ రంగం దెబ్బతింటుంది, మాన్యుఫ్యాక్చరింగ్ సెక్టార్ పడిపోతుంది. మరి సమాజంలో వినియోగమే లేనప్పుడు, మార్కెట్ మొత్తం తిరోగమనంలో పడినప్పుడు... ఈ ఏఐ కంపెనీలకి ఆదాయం ఎక్కడి నుంచి వస్తుంది? వందల బిలియన్ డాలర్లు తగలేసి వారు తయారు చేసిన సాఫ్ట్‌వేర్లను, టూల్స్‌ను కొనే నాథుడు ఎవరు ఉంటారు? మనుషుల పొట్ట కొట్టి, వారి ఆదాయాన్ని లాగేసుకుని... కార్పొరేట్ సంస్థలు ఎవరికి తమ ఉత్పత్తులను అమ్ముకుంటాయి? రోబోలు రోబోలకి అమ్ముకుంటాయా? సాఫ్ట్‌వేర్లు సాఫ్ట్‌వేర్లతో వ్యాపారం చేస్తాయా? ఎంతటి మూర్ఖత్వం! మానవ వనరుల వినాశనం అంటే అది చివరకు ఏఐ కంపెనీల వినాశనానికే దారితీస్తుందనే కనీస లాజిక్‌ను ఇటు కంపెనీలు, అటు పాలకులు ఎలా మర్చిపోయారు? సరే... అంతా ఏఐ అనుకుందాం. పొద్దున లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ప్రతి పనికీ ఏఐ టూల్స్ వాడదాం. కానీ ఉచితంగా ఏదీ రాదు కదా! ప్రతి ఏఐ సాఫ్ట్‌వేర్‌కు, ప్రతి యాప్‌కు సబ్‌స్క్రిప్షన్ ఫీజు కట్టాలి, డబ్బు చెల్లించాలి. మరి సాధారణ ప్రజల దగ్గర వ్యాపారాలు లేనప్పుడు, ఉద్యోగాలు లేనప్పుడు... వినియోగదారులు ఆ ఏఐ కంపెనీలకి డబ్బు ఎలా చెల్లిస్తారు? ప్రముఖ ఆర్థికవేత్త జాన్ మేనార్డ్ కీన్స్ ఆర్థిక మాంద్యం సమయంలో ఒక అద్భుతమైన సూత్రాన్ని ప్రతిపాదించారు. ప్రభుత్వాలు ప్రజల చేతుల్లో డబ్బు పెట్టాలి, అప్పుడే మార్కెట్లో డిమాండ్ పెరుగుతుంది, ఆర్థిక వ్యవస్థ బతుకుతుంది. కానీ ఇవాళ ఏఐ చేస్తున్నది దీనికి రివర్స్. ప్రజల చేతుల్లో ఉన్న డబ్బును లాగేసుకుంటోంది. చిన్న చిన్న వ్యాపారాలు, స్వయం ఉపాధి రంగాలు ఏఐ చేతుల్లోకి వెళ్ళిపోతున్నాయి. ఒక చిన్న డిజైనర్, ఒక చిన్న అకౌంటెంట్, ఒక చిన్న లీగల్ అడ్వైజర్... వీరంతా ఇవాళ ఉపాధి కోల్పోతున్నారు. మరి సమాజంలో చలామణీ అయ్యే డబ్బు మొత్తం నలుగురైదుగురు టెక్ బిలియనీర్ల అకౌంట్లలోకి వెళ్ళిపోతే... మార్కెట్లో లిక్విడిటీ ఏమైపోవాలి? వ్యాపారాలు లేని సమాజంలో వినియోగదారుడు ఏఐ సేవలను వాడుకోవడానికి డబ్బులు ఎక్కడి నుంచి తెస్తాడు? ఇది కేవలం ఆర్థిక సంక్షోభం కాదు... సమాజాన్ని ఆత్మహత్యల వైపు నడిపించే ఒక దుర్మార్గపు వ్యూహం. ఇప్పటికే ఏఐ పేరుతో ప్రపంచవ్యాప్తంగా వేలాది మందిని, భారతదేశంలో కూడా లక్షలాది మంది టెక్ నిపుణులను కంపెనీలు లే ఆఫ్స్ పేరుతో నికృష్టంగా రోడ్డున పడేశారు. ఏ తప్పు చేయని టెక్ నిపుణులు ఇవాళ నిరాశలో మునిగిపోయారు. మరి ఈ విద్యావంతులు, బుద్ధిజీవులు, సాంకేతిక పరిజ్ఞానం ఉన్న యువత... ఉద్యోగాలు లేక, వేరే వ్యాపకాలకు దిగితే సమాజానికి ఎంత పెద్ద నష్టం జరుగుతుందో పాలకులు ఎందుకు గ్రహించడం లేదు? మహాత్మా గాంధీ ఒక అద్భుతమైన మాట చెప్పారు. "పని లేని మేధస్సు... సాతాను కర్మాగారం. నైతికత లేని విజ్ఞానం సమాజానికి తీవ్రమైన హాని చేస్తుందని" ఒక మేధావికి, ఒక సాంకేతిక నిపుణుడికి సరైన పని కల్పించకపోతే... ఆ మేధస్సు వినాశనానికి దారితీసే అవకాశం ఉంది. సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలు, సమాజంలో అశాంతి పెరగడానికి ఈ నిరుద్యోగమే కారణం కాదా? చదువుకున్న యువత సమాజంపై కక్ష పెంచుకునేలా పాలకులు ఎందుకు ప్రవర్తిస్తున్నారు? వారు వేరే అసాంఘిక వ్యాపకాలకు దిగితే, సమాజంలో శాంతిభద్రతలు క్షీణిస్తే... ఆ నష్టాన్ని ప్రభుత్వాలు భరించగలవా? లే ఆఫ్స్ అనేవి కేవలం కంపెనీల అంతర్గత విషయం కాదు... అవి సమాజ పునాదులను కదిలించే సామాజిక విపత్తులు. దీనిని పాలకులు గుర్తించకపోవడం వారి మేధో దివాలాకోరుతనానికి నిదర్శనం. ఇక అన్నిటికంటే భయంకరమైన అంశం... భవిష్యత్తు తరాల పరిస్థితి ఏంటి? ప్రతి చిన్న విషయానికి, హోంవర్క్ దగ్గర నుంచి రీసెర్చ్ వరకు అన్నిటికీ ఏఐ టూల్స్ వాడేస్తుంటే... భవిష్యత్తు తరాలు పూర్తిగా తమ సొంత ఆలోచనా శక్తిని, సృజనాత్మకతను కోల్పోయి, టెక్నాలజీకి బానిసలయ్యే ప్రమాదం ఉంది కదా! ఆ విషయం ఈ పాలకులకు ఎందుకు పట్టడం లేదు? సిలికాన్ వ్యాలీ సృష్టించిన ఈ సాంకేతిక ఏకరూపత వెనుక బైబిల్ లోని "టవర్ ఆఫ్ బాబెల్" నాటి అహంకారం దాగి ఉందని పోప్ లూథర్ హెచ్చరించారు. మానవాళి ఒకే సాంకేతిక భాషతో దైవత్వాన్ని సవాలు చేయాలని చూస్తే అది తీవ్రమైన విచ్ఛిన్నానికే దారితీస్తుంది. పైగా, బాల్య దశలో సాంకేతిక పరిజ్ఞానానికి మితిమీరి గురికావడం వల్ల నిద్రలేమి, ఏకాగ్రత లోపించడం, మానసిక బంధాలు తెగిపోవడం వంటి భయంకరమైన మానసిక రుగ్మతలు ఉత్పన్నమవుతున్నాయని వైద్య పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. ప్రఖ్యాత శాస్త్రవేత్త అల్బర్ట్ ఐన్‌స్టీన్ ఒకచోట హెచ్చరించారు. సాంకేతికత మన మానవ సంబంధాలను, మానవ మేధస్సును దాటి వెళ్ళిపోయిన రోజు... ప్రపంచం కేవలం మూర్ఖుల తరంతో నిండిపోతుందని. ఇవాళ ఐన్‌స్టీన్ అన్న ఆ మూర్ఖుల తరం కళ్లముందే తయారవుతోంది. మనుషులు ఆలోచించడం మానేస్తున్నారు. మెదడుకు పని పెట్టడం లేదు. కంపెనీలు కేవలం ప్రస్తుత లాభాలను చూసుకుని మురిసిపోతున్నాయి... కానీ రేపు పొద్దున, భవిష్యత్ తరాల నుంచి సరికొత్త మానవ మేధస్సు, సరికొత్త సాంకేతిక ఆవిష్కరణలు రాకపోతే... టెక్నాలజీ అక్కడితో ఆగిపోదా? ఏఐ అనేది మనిషి సృష్టించిన డేటా ఆధారంగానే పనిచేస్తుంది. మరి మనుషులే కొత్తగా ఆలోచించడం మానేస్తే... ఏఐకి కొత్త డేటా ఎక్కడి నుంచి వస్తుంది? టెక్నాలజీ అక్కడితో స్తంభించిపోదా? మానవ మేధస్సు లేని రోజున ఏ సాంకేతికత అయినా ఒక జడపదార్థం మాత్రమే అవుతుంది. అసలు సమాజ శ్రేయస్సును కాంక్షించని ఈ ఏఐ కార్పొరేట్ కంపెనీల కూటమికి ప్రభుత్వాలు ఎందుకు అంతగా ప్రాధాన్యత ఇస్తున్నాయి? దేశంలో పేదరికం ఉంది, తాగునీటి కొరత ఉంది, వైద్య సదుపాయాలు లేవు... వీటన్నిటినీ వదిలేసి, ఏఐ రీసెర్చ్ సెంటర్ల కోసం, గ్లోబల్ టెక్ సదస్సుల కోసం వందల కోట్ల ప్రజా ధనాన్ని ప్రభుత్వాలు ఎందుకు తగలేస్తున్నాయి? ప్రముఖ ఆర్థికవేత్త నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్ ఒక అద్భుతమైన సందేశాన్ని ఇచ్చారు. "అభివృద్ధి అంటే కేవలం సాంకేతికత లేదా మార్కెట్ విస్తరణ కాదు... మానవ సామర్థ్యాలను, వారి జీవన ప్రమాణాలను పెంపొందించడమే అసలైన అభివృద్ధి అని" కానీ ఇవాళ ప్రభుత్వాలు అమర్త్యసేన్ మాటలను తుంగలో తొక్కాయి. సామాన్య ప్రజల శ్రేయస్సును కాదని, కేవలం కొద్దిమంది టెక్ దిగ్గజాల ప్రయోజనాల కోసమే పాలసీలు మారుస్తున్నాయి. నైపుణ్యం ఉన్న టెక్ నిపుణుల అభిప్రాయాలను, వారి ఆందోళనలను కనీసం పట్టించుకోవడం లేదు. ప్రభుత్వాల ఈ కార్పొరేట్ అనుకూల విధానాలు మారకపోతే... చరిత్ర పాలకులను క్షమించదు. టెక్నాలజీ అనేది మనిషి జీవితాన్ని సుఖమయం చేయడానికి రావాలి కానీ... మనిషి జీవితాన్నే శూన్యం చేయడానికి కాదు. పోప్ లూథర్ తన సందేశం ముగింపులో అన్నట్లు, మనుషులు ఎంత బలహీనులైనా, పరిమితులు ఉన్నవారైనా... మనిషి స్థానాన్ని, వారి సామర్థ్యాన్ని, ముఖ్యంగా ప్రేమానురాగాలను ఏ యంత్రమూ భర్తీ చేయలేదు, భర్తీ చేయకూడదు. నైపుణ్యం ఉన్న మానవ వనరులే ఏ దేశానికైనా అసలైన బలం. ఆ బలాన్ని బలహీనతగా మార్చే ఏ సాంకేతికత అయినా సమాజానికి ప్రమాదకరమే. ఇప్పటికైనా ప్రపంచ పాలకులు, మన దేశ పాలకులు కళ్ళు తెరవాలి. ఏఐ పేరుతో జరుగుతున్న ఈ మానవ వనరుల వినాశనాన్ని, కార్పొరేట్ అత్యాశను అడ్డుకోవడానికి కఠినమైన నియంత్రణ చట్టాలు తీసుకురావాలి. లేకపోతే... రేపు పొద్దున రోబోలు రాజ్యమేలుతుంటాయి, మనుషులు ఆకలితో అలమటిస్తుంటారు. ఆ రోజున పాలకులారా... చరిత్ర మిమ్మల్ని క్షమించదు!

ఇప్పటికే ఏఐ పేరుతో ప్రపంచవ్యాప్తంగా వేలాది మందిని, భారతదేశంలో కూడా లక్షలాది మంది టెక్ నిపుణులను కంపెనీలు లే ఆఫ్స్ పేరుతో నికృష్టంగా రోడ్డున పడేశారు. ఏ తప్పు చేయని టెక్ నిపుణులు ఇవాళ నిరాశలో మునిగిపోయారు. మరి ఈ విద్యావంతులు, బుద్ధిజీవులు, సాంకేతిక పరిజ్ఞానం ఉన్న యువత... ఉద్యోగాలు లేక, వేరే వ్యాపకాలకు దిగితే సమాజానికి ఎంత పెద్ద నష్టం జరుగుతుందో పాలకులు ఎందుకు గ్రహించడం లేదు? మహాత్మా గాంధీ ఒక అద్భుతమైన మాట చెప్పారు. "పని లేని మేధస్సు... సాతాను కర్మాగారం. నైతికత లేని విజ్ఞానం సమాజానికి తీవ్రమైన హాని చేస్తుందని" ఒక మేధావికి, ఒక సాంకేతిక నిపుణుడికి సరైన పని కల్పించకపోతే... ఆ మేధస్సు వినాశనానికి దారితీసే అవకాశం ఉంది. సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలు, సమాజంలో అశాంతి పెరగడానికి ఈ నిరుద్యోగమే కారణం కాదా? చదువుకున్న యువత సమాజంపై కక్ష పెంచుకునేలా పాలకులు ఎందుకు ప్రవర్తిస్తున్నారు? వారు వేరే అసాంఘిక వ్యాపకాలకు దిగితే, సమాజంలో శాంతిభద్రతలు క్షీణిస్తే... ఆ నష్టాన్ని ప్రభుత్వాలు భరించగలవా? లే ఆఫ్స్ అనేవి కేవలం కంపెనీల అంతర్గత విషయం కాదు... అవి సమాజ పునాదులను కదిలించే సామాజిక విపత్తులు. దీనిని పాలకులు గుర్తించకపోవడం వారి మేధో దివాలాకోరుతనానికి నిదర్శనం. ఇక అన్నిటికంటే భయంకరమైన అంశం... భవిష్యత్తు తరాల పరిస్థితి ఏంటి? ప్రతి చిన్న విషయానికి, హోంవర్క్ దగ్గర నుంచి రీసెర్చ్ వరకు అన్నిటికీ ఏఐ టూల్స్ వాడేస్తుంటే... భవిష్యత్తు తరాలు పూర్తిగా తమ సొంత ఆలోచనా శక్తిని, సృజనాత్మకతను కోల్పోయి, టెక్నాలజీకి బానిసలయ్యే ప్రమాదం ఉంది కదా! ఆ విషయం ఈ పాలకులకు ఎందుకు పట్టడం లేదు? సిలికాన్ వ్యాలీ సృష్టించిన ఈ సాంకేతిక ఏకరూపత వెనుక బైబిల్ లోని "టవర్ ఆఫ్ బాబెల్" నాటి అహంకారం దాగి ఉందని పోప్ లూథర్ హెచ్చరించారు. మానవాళి ఒకే సాంకేతిక భాషతో దైవత్వాన్ని సవాలు చేయాలని చూస్తే అది తీవ్రమైన విచ్ఛిన్నానికే దారితీస్తుంది. పైగా, బాల్య దశలో సాంకేతిక పరిజ్ఞానానికి మితిమీరి గురికావడం వల్ల నిద్రలేమి, ఏకాగ్రత లోపించడం, మానసిక బంధాలు తెగిపోవడం వంటి భయంకరమైన మానసిక రుగ్మతలు ఉత్పన్నమవుతున్నాయని వైద్య పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. ప్రఖ్యాత శాస్త్రవేత్త అల్బర్ట్ ఐన్‌స్టీన్ ఒకచోట హెచ్చరించారు. సాంకేతికత మన మానవ సంబంధాలను, మానవ మేధస్సును దాటి వెళ్ళిపోయిన రోజు... ప్రపంచం కేవలం మూర్ఖుల తరంతో నిండిపోతుందని. ఇవాళ ఐన్‌స్టీన్ అన్న ఆ మూర్ఖుల తరం కళ్లముందే తయారవుతోంది. మనుషులు ఆలోచించడం మానేస్తున్నారు. మెదడుకు పని పెట్టడం లేదు. కంపెనీలు కేవలం ప్రస్తుత లాభాలను చూసుకుని మురిసిపోతున్నాయి... కానీ రేపు పొద్దున, భవిష్యత్ తరాల నుంచి సరికొత్త మానవ మేధస్సు, సరికొత్త సాంకేతిక ఆవిష్కరణలు రాకపోతే... టెక్నాలజీ అక్కడితో ఆగిపోదా? ఏఐ అనేది మనిషి సృష్టించిన డేటా ఆధారంగానే పనిచేస్తుంది. మరి మనుషులే కొత్తగా ఆలోచించడం మానేస్తే... ఏఐకి కొత్త డేటా ఎక్కడి నుంచి వస్తుంది? టెక్నాలజీ అక్కడితో స్తంభించిపోదా? మానవ మేధస్సు లేని రోజున ఏ సాంకేతికత అయినా ఒక జడపదార్థం మాత్రమే అవుతుంది. అసలు సమాజ శ్రేయస్సును కాంక్షించని ఈ ఏఐ కార్పొరేట్ కంపెనీల కూటమికి ప్రభుత్వాలు ఎందుకు అంతగా ప్రాధాన్యత ఇస్తున్నాయి? దేశంలో పేదరికం ఉంది, తాగునీటి కొరత ఉంది, వైద్య సదుపాయాలు లేవు... వీటన్నిటినీ వదిలేసి, ఏఐ రీసెర్చ్ సెంటర్ల కోసం, గ్లోబల్ టెక్ సదస్సుల కోసం వందల కోట్ల ప్రజా ధనాన్ని ప్రభుత్వాలు ఎందుకు తగలేస్తున్నాయి? ప్రముఖ ఆర్థికవేత్త నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్ ఒక అద్భుతమైన సందేశాన్ని ఇచ్చారు. "అభివృద్ధి అంటే కేవలం సాంకేతికత లేదా మార్కెట్ విస్తరణ కాదు... మానవ సామర్థ్యాలను, వారి జీవన ప్రమాణాలను పెంపొందించడమే అసలైన అభివృద్ధి అని" కానీ ఇవాళ ప్రభుత్వాలు అమర్త్యసేన్ మాటలను తుంగలో తొక్కాయి. సామాన్య ప్రజల శ్రేయస్సును కాదని, కేవలం కొద్దిమంది టెక్ దిగ్గజాల ప్రయోజనాల కోసమే పాలసీలు మారుస్తున్నాయి. నైపుణ్యం ఉన్న టెక్ నిపుణుల అభిప్రాయాలను, వారి ఆందోళనలను కనీసం పట్టించుకోవడం లేదు. ప్రభుత్వాల ఈ కార్పొరేట్ అనుకూల విధానాలు మారకపోతే... చరిత్ర పాలకులను క్షమించదు.

# సెమీకండక్టర్ దిగ్గజంగా భారత్!

- పదేళ్లలోరూ.14.25 లక్షల కోట్ల విలువే లక్ష్యం
- రూ.17.5 లక్షల కోట్ల పెట్టుబడులు కావాలి
- మూడో వంతు ప్రభుత్వమే సమకూర్చాలి
- నీతి ఆయోగ్ నివేదిక సూచన



న్యూఢిల్లీ: సెమీకండక్టర్ రంగంలో భారత్ కేవలం భాగస్వామ్యానికే పరిమితం కాకుండా దిగ్గజంగా ఎదగాలని, 2035 నాటికి 120--150 బిలియన్ డాలర్ల (రూ.14.25 లక్షల కోట్లు సుమారు) విలువైన సెమీకండక్టర్ వ్యాల్యూచైన్ నిర్మించుకోవడాన్ని లక్ష్యంగా పెట్టుకోవాలని నీతి ఆయోగ్ నివేదిక కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఇందుకు అవసరమైన పెట్టుబడుల్లో మూడింట ఒక వంతును ప్రభుత్వమే సమకూర్చడం ద్వారా యాంకర్ పాత్రను పోషించాలంటూ, తద్వారా ఇన్వెస్టర్లలో నమ్మకాన్ని కల్పించొచ్చని పేర్కొంది. 'భారత్ దేశ సెమీకండక్టర్ పరిశ్రమ భవిష్యత్' పేరుతో ఒక నివేదికను నీతి ఆయోగ్ రూపొందించింది. అంతర్జాతీయంగా పోటీనివ్వగలిగిన సెమీకండక్టర్ వ్యవస్థను దేశీయంగా నిర్మించుకునేందుకు 135--180 బిలియన్ డాలర్ల (రూ.17.10 లక్షల కోట్లు) పెట్టుబడులు వచ్చే దశాబ్ద కాలంలో అవసరమవుతాయని తెలిపింది. ముఖ్యంగా డిజైన్, ఫ్యాబ్రికేషన్, అత్యాధునిక ప్యాకేజింగ్, మేటీరియల్స్, అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఈ మేరకు పెట్టుబడులు కావాల్సి ఉంటుందని పేర్కొంది.

## దిగుమతులను తగ్గించుకోవాలి..

ప్రస్తుతం భారత్‌లో సెమీకండక్టర్ల డిమాండ్ వేగంగా పెరుగుతుండగా, ఇందులో 90 నుంచి 95 శాతం వరకు దిగుమతుల ద్వారానే తీర్చుకుంటున్నట్టు నీతి ఆయోగ్ నివేదిక తెలిపింది. దీనివల్ల భారీగా విదేశీ మారకద్రవ్యం తరలిపోవడమే కాకుండా, అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో అడ్డంకులు ఏర్పడినప్పుడు దేశ రక్షణ, డిజిటల్ రంగాలు ప్రమాదంలో పడే అవకాశం ఉంటుందని హెచ్చరించింది. 2035 నాటికి దేశీయ సెమీకండక్టర్ మార్కెట్ 200 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందన్న అంచనా వ్యక్తం చేస్తూ.. ఈ డిమాండ్‌ను దేశీయంగానే తీర్చుకునే విధంగా పరిశ్రమను నిర్మించుకోవాల్సిన అవసరాన్ని ప్రస్తావించింది. దేశీయంగా డిమాండ్ స్థాయిలో ఉత్పాదకత లేకపోవడాన్ని గొప్ప అవకాశంగా మలుచుకోవాలని సూచించింది.

## టెక్నాలజీలో స్వావలంబనతోనే వికసిత్ భారత్

బ్లాక్‌బాక్స్ సాంకేతికతల దిగుమతులపై ఆధారపడడం వికసిత్ భారత్ లక్ష్య సాధనకు పెద్ద అవరోధమని నీతి ఆయోగ్ వైస్‌చ ఐర్మన్ అశోక లాహిరి పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన దేశంగా భారత్ అవతరించేందుకు సాంకేతిక సౌర్వభౌమత్వం పునాది కావాలన్నారు. అది మౌలిక వసతుల నుంచే ఆరంభం కావాలన్నారు. సరికొత్త పరిశోధనలు, సొంత డిజైన్ల సృష్టి, దీర్ఘకాలిక పెట్టుబడులను ఆకర్షించే స్థిరమైన విధానాలు, అధునాతన ప్యాకేజింగ్ మరియు కాంపౌండ్ సెమీకండక్టర్ల ఉత్పత్తి, నైపుణ్యం కలిగిన మానవ వనరుల అభివృద్ధి అవసరమని ఈ నివేదిక సూచించింది. భారతదేశం కేవలం చిప్స్ వినియోగించే దేశంగా కాకుండా, ప్రపంచ సెమీకండక్టర్ సరఫరా వ్యవస్థలో ఒక తప్పనిసరి భాగస్వామిగా మారాలనే తమ సంకల్పాన్ని ఈ నివేదిక చాటిచెబుతున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నివేదిక విడుదల సందర్భంగా పేర్కొన్నారు. సెమీ కండక్టర్లకు సంబంధించి పూర్తి స్థాయి ఎకోసిస్టమ్‌ను (డిజైన్, నైపుణ్య వనరులు, మెటీరియల్స్, ఎక్విప్‌మెంట్, ఫ్యాబ్, ప్యాకేజింగ్) నిర్మించడంపై తాము దృష్టి పెట్టినట్టు కేంద్ర ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

# స్మార్ట్ గార్డెన్.. మట్టిలేకుండానే మినీ తోట!








మొక్కలకు నీళ్లు పోయడం నుంచి, పక్షులకు ఆహారం పెట్టడం వరకు... ఇప్పుడు ప్రకృతి పరిరక్షణ కూడా హైటెక్ అయిపోయింది! ఇంట్లోనే ఉంటూ తక్కువ కష్టంతో ఎక్కువ గ్రీనరీని ఎంజాయ్ చేయాలనుకునేవారి కోసం వచ్చేసిన సూపర్ నేచర్ గ్యాడ్జెట్స్ ఇవీ! రోబోటిక్ తోటమాలిఈ వేసవి ఎండల్లో మీరు మాత్రం హాయిగా రూమ్‌లోనో కూర్చుంటే, ఎవరైనా పైపు పట్టుకుని తోటలో నిలబడితే బాగుండు! అని అనుకుంటున్నారా! అందుకే మీ మొక్కలకు నీళ్లు పోసే బాధ్యతను మోయడానికి వచ్చేసింది ఈ సోలార్ స్మార్ట్ వైఫై స్ప్రింక్లర్ టైమర్! ఇది మీ గార్డెన్‌కు ఒక చిన్న డిజిటల్ తోటమాలి లాంటిది. దీనికి జీతం అక్కర్లేదు, కరెంట్ బిల్లుల తలనొప్పి లేదు, ఇందులోని సోలార్ ప్యానెల్‌తో ఎండలోనే ఆటోమేటిక్‌గా రీచార్జ్ అవుతుంది. పైగా మొబైల్ యాప్‌తో కనెక్ట్ చేసి ఎక్కడి నుంచైనా నీళ్లు ఎప్పుడు పట్టాలో కంట్రోల్ చేయొచ్చు. లేదంటే వాయిస్ కంట్రోల్‌తో సోఫాలో కూర్చునే 'అలెక్సా.. మొక్కలకు నీళ్లు పోయ్!' అని చెప్పేస్తే సరిపోతుంది. 'రెయిన్ డిలే' ఫీచర్‌తో 'వర్షం పడుతోంది కదా.. ఎందుకు మళ్లీ నీళ్లు!' అన్నట్టుగా ఆగిపోతుంది. ఐపీ65 వాటర్‌ప్రూఫ్ బాడీ, బలమైన బ్రాస్ ఇన్లెట్‌తో ఎండా వానలకు తట్టుకునే ఈ రోబోటిక్ తోటమాలి ధర రూ. 10,180 మాత్రమే!

## పక్షుల కోసం స్మార్ట్ హోటల్!

ఉదయం కిటికీ దగ్గరకు వచ్చే పిచ్చుకలు, చిన్న చిన్న పక్షులను దగ్గరగా చూడాలని అనిపిస్తుందా? అయితే మీ ఇంటికే చిన్న బర్డ్ థియేటర్‌లా మారిపోయే ఈ సోలార్ ఏఐ బర్డ్ ఫీడర్ మీ కోసం! ఇది కేవలం గింజలు పెట్టే పాత్ర మాత్రమే కాదు, పక్షుల ప్రపంచాన్ని మీ కళ్ల ముందుకు తీసుకొచ్చే స్మార్ట్ గాడ్జెట్. దీనిలో ఉన్న కెమెరా పక్షులు వచ్చి గింజలు తింటున్న ప్రతి క్యూట్ మూమెంట్‌ను క్యాప్చర్ చేస్తుంది. పైగా ఇందులో ఉన్న ఏఐ టెక్నాలజీ ఏ పక్షి వచ్చిందో కూడా గుర్తించగలదు. సోలార్ పవర్‌తో పనిచేయడం వల్ల బ్యాటరీల తలనొప్పి ఉండదు. వర్షం, ఎండలకు తట్టుకునే వెదర్‌ప్రూఫ్ మెటల్ బాడీతో తయారైన ఈ స్మార్ట్ ఫీడర్ ధర రూ. 7,000 మాత్రమే!

## మట్టిలేకుండానే మినీ తోట!

ఇంట్లోనే తాజా పుదీనా, తులసి లేదా చిన్న చిన్న కూరగాయలు పెంచుకోవాలని ఉందా? కానీ మట్టి, కుండీలు, రోజూ నీళ్లు పోసే టెన్షన్ వద్దనుకుంటున్నారా? అయితే ఈ హైడ్రోపోనిక్ గ్రోయింగ్ సిస్టమ్ మీ కోసం! ఇది మీ ఇంట్లోనే ఒక చిన్న స్మార్ట్ ఫార్మ్‌లా పనిచేస్తుంది. ఇందులో మొత్తం 12 ప్లాంటింగ్ స్టేషన్స్ ఉంటాయి. మట్టికి బదులుగా నీరు, పోషకాలు, ఎల్‌ఈడీ కాంతితో మొక్కలు వేగంగా పెరిగేలా చేస్తుంది. ఇందులో ఉన్న స్మార్ట్ ఎల్‌ఈడీ లైట్లు సూర్యరశ్మిలా పనిచేసి మొక్కలకు అవసరమైన కాంతిని ఇస్తాయి. 4.2 లీటర్ల పెద్ద వాటర్ ట్యాంక్, ఆటోమేటిక్ వాటర్ సర్క్యులేషన్ సిస్టమ్‌తో మొక్కలకు కావాల్సిన నీరు, ఆక్సిజన్ నిరంతరం అందుతాయి. లైట్ స్టాండ్ ఎత్తును కూడా మొక్కల పెరుగుదలకు తగ్గట్టు మార్చుకోవచ్చు. ధర రూ. 14,000 మాత్రమే!

శ్రీ వార్త జాతీయ తెలుగు దినపత్రిక

సంపాదకీయం

# స్పామ్ కాల్స్.. ఇక బ్లాక్!

## ఫిర్యాదుల అవసరం లేకుండానే నిషేధం

## స్పామ్ నంబర్‌గా టెల్కోలు గుర్తిస్తే చర్యలు

## కసరత్తు చేస్తున్న టెలికం నియంత్రణ సంస్థ

అవాంఛిత, మోసపూరిత కాల్స్, సందేశాలు ప్రపంచానికి సవాల్‌గా మారాయి. వ్యక్తుల భద్రతకు ముప్పుగా పరిణమించడంతోపాటు ఆర్థిక నష్టాలకూ ఇవి కారణం అవుతున్నాయి. మన దేశంలో 95% మంది మొబైల్ యూజర్లకు ప్రతిరోజూ స్పామ్ కాల్స్, సందేశాలు వెల్లువెత్తుతున్నాయంటే సమస్య తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో స్పామ్ కాల్స్‌కు చెక్ పెట్టేందుకు టెలికం నియంత్రణ సంస్థ (ట్రాయ్) సిద్ధమవుతోంది. కస్టమర్ అందుకున్న కాల్, మెసేజ్‌ను టెలికం కంపెనీ స్పామ్‌గా గుర్తిస్తే ఆ నంబర్‌ను బ్లాక్ లిస్టులోకి చేర్చాలని భావిస్తోంది. అలాగే అధికారిక ఫిర్యాదు లేకపోయినా స్పామ్ మెసేజ్‌లు పంపే మొబైల్ నంబర్‌ను డిస్‌కనెక్ట్ చేయాలన్న ప్రతిపాదనపై ట్రాయ్ కసరత్తు చేస్తోంది. టెలికం కంపెనీలతో ఈ మేరకు చర్చిస్తోంది. ప్రస్తుతం టెల్కోలు 10 రోజుల వ్యవధిలో ఐదు ప్రత్యేక ఫిర్యాదులను స్వీకరిస్తే స్పామర్‌పై చర్య తీసుకుంటున్నాయి. తాజా ప్రతిపాదన ప్రకారం ఒక నంబర్‌ను వరుసగా 10 రోజులపాటు అనుమానిత స్పామ్‌గా ఏఐ టెక్నాలజీ గుర్తిస్తే.. ఆ నంబర్‌కు వ్యతిరేకంగా ఎటువంటి ఫిర్యాదు లేకపోయినా కూడా చర్య తీసుకోవచ్చు. ఇది అమల్లోకి వస్తే స్పామ్ కాల్స్, మెసేజెస్ కట్టడికి టెలికం కంపెనీలు చేపడుతున్న చర్యలకు మరింత ఊతం ఇచి?చనట్టు అవుతుంది.

### రియల్ టైమ్‌లో విశ్లేషించి..

ప్రస్తుతం దేశంలో ఏదైనా అవాంఛిత సమాచారాన్ని స్పామ్‌గా గుర్తించడానికి నిర్దిష్ట నియమాలు లేవు. కాల్స్, సందేశాలు పంపినవారి రోజువారీ వినియోగ తీరు, కాల్స్ ఎంత సమయం మాట్లాడుతున్నారు, ఎన్ని సందేశాలు పంపిస్తున్నారు, ఎవరెవరికి, ఏ ప్రాంతంలో ఉన్నవారికి ఈ కాల్స్ చేస్తున్నారు వంటి అంశాలను టెల్కోలు ఉపయోగిస్తున్న ఏఐ సాంకేతికత రియల్ టైమ్‌లో విశ్లేషించి.. అవాంఛిత కాల్స్, మెసేజెస్‌ను గుర్తించి వినియోగదారులను అప్రమత్తం చేస్తున్నాయి. కాల్‌ను అంగీకరించడం లేదా తిరస్కరించడం అనేది కస్టమర్ నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుంది. అయితే అనుమానిత స్పామ్‌గా గుర్తించిన అనేక కాల్స్ నిజమైన కాలర్ల నుంచి వచి?చనవే ఉంటున్నాయి. వాటిలో గిగ్ వర్కర్లతోపాటు ఇతర వాణిజ్య సంస్థలు ఉన్నాయి.

### వ్యవస్థీకృతంగా మోసాలు..

2024 సెపట?టంబర్ నుంచి 2026 జనవరి మధ్య 7,100 కోట్ల స్పామ్ కాల్స్, 290 కోట్ల స్పామ్ సందేశాలను గుర్తించినట్లు ఎయిర్‌టెల్ ప్రకటించింది. 8 లక్షలకుపైగా మోసపూరిత లింక్స్‌ను బ్లాక్ చేసినట్లు వెల్లడించింది. సైబర్ నేరగాళ్లు ఆధునిక సాంకేతికతను ఉపయోగిస్తూ కాల్ సెంటర్లతో వ్యవస్థీకృతంగా మోసపూరిత కార్యకలాపాలు సాగిస్తున్నట్లు తెలిపింది. సైబర్ నేరగాళ్ల కారణంగా ప్రపంచవ్యాప్తంగా రూ. 92.7 లక్షల కోట్ల ఆర్థిక నష్టం వాటిల్లిందని భారతీ ఎయిర్‌టెల్ చీఫ్ రెగ్యులేటరీ ఆఫీసర్ రాహుల్ వాట్స్ వెల్లడించారు. 250కిపైగా కొలమానాలను పరిగణనలోకి తీసుకొని స్పామ్ కాల్స్, సందేశాలను గుర్తిస్తున్నట్టు చెప్పారు.

టెల్కోలు ఏఐ సొల్యూషన్స్ సాయంతో ప్రతి నెలా సుమారు 40 కోట్ల కాల్స్, సందేశాల ను అనుమానిత స్పామ్‌గా గుర్తిస్తున్నాయి.

నమోదు కాని టెలీమార్కెటర్ల నుంచి వస్తున్న వాటిలో 7.5 కోట్ల కాల్స్, ఎస్ఎంఎస్‌లు ప్రతిరోజూ బ్లాక్ అవుతున్నాయి.

స్పామర్లపై టెల్కోలకు రోజుకు సగటున 10,000 ఫిర్యాదులు మాత్రమే అందుతున్నాయని సమాచారం.

2025 ఫిబ్రవరిలో 1,16,213 స్పామ్ ఫిర్యాదులు టెల్కోలకు అందగా 2025 డి సెంబర్‌లో ఆ సంఖ్య 3,34,317కు చేరింది.

ఫిర్యాదులలో ఎక్కువ భాగం నమోదు కాని టెలిమార్కెటర్లపైనే ఉంటున్నాయి.

టెలిమార్కెటింగ్ కంపెనీల ప్రతినిధులు సాధారణంగా 10 అంకెల మొబైల్ నంబర్ ద్వారా కాల్స్ చేస్తున్నారు.

భారత్‌లో 116 కోట్ల మంది మొబైల్ సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. వారిలో అవాంఛిత కాల్స్‌ను నివారించేందుకు ట్రాయ్ తీసుకొచి?చనడు నాట్ డిస్టర్బ్ (డీఎన్‌డీ) సేవలను 22 కోట్ల మంది మాత్రమే ఎంపిక చేసుకున్నారు.

# డబ్బుఉందా? డెబిట్! లేదా క్రెడిట్!

భారత్‌లో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ మరో కీలక మలుపు తీసుకుంటోంది. అంతర్జాతీయ చెల్లింపుల దిగ్గజం వీసా త్వరలో భారత్‌లో ఒకే కార్డుతో అటు డెబిట్‌కి, ఇటు క్రెడిట్‌కి రెండు విధాలుగా ఉపయోగపడేలా 'డెబిట్--కమ్--క్రెడిట్ కార్డు'ను ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ఈ కొత్త విధానం వినియోగదారులకు సౌకర్యాన్ని పెంచడమే కాకుండా, దేశంలో క్రెడిట్ వినియోగాన్ని విస్తరించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

### యూపీఐ, డెబిట్, క్రెడిట్ కార్డులతో పోలిస్తే

ప్రస్తుతం భారత్‌లో యూపీఐ వేగంగా విస్తరిస్తున్నప్పటికీ, అది ప్రధానంగా బ్యాంక్ సేవింగ్స్ ఖాతా నుంచి నేరుగా డబ్బు కట్ అయ్యే విధానమే. డెబిట్ కార్డులు కూడా ఖాతాలో డబ్బు ఉంటేనే పనిచేస్తాయి. మరోవైపు, క్రెడిట్ కార్డులు సౌకర్యవంతమే అయినా వాటి వినియోగం డిజిటల్ రూపంలో,యూపీఐ చెల్లింపుల విషయంలో ఇంకా పరిమితంగానే ఉంది. ఈ నేపథ్యంలో వీసా తీసుకొస్తున్న కొత్త కార్డు యూపీఐతో అందే సౌలభ్యం, డెబిట్ కార్డుతో చేయగల నియంత్రణ, క్రెడిట్ కార్డు ఫ్లెక్సిబిలిటీ ఈ మూడింటినీ కలిపిన ఉపయోగకరమైన సాధనంగా మారనుందని విశ్లేషకులు అంటున్నారు.

బ్యాంకులు, వినియోగదారులకు లాభాలు

ఈ కొత్త విధానం ద్వారా బ్యాంకులు తమ రిస్క్ పాలసీలకు అనుగుణంగా క్రెడిట్ వినియోగాన్ని నియంత్రించగలుగుతాయి. వినియోగదారులకు మాత్రం ఒకటి కంటే ఎక్కువ కార్డులని ప్రతిచోటుకూ మోసుకెళ్లాల్సిన అవసరం ఉండదు. ముఖ్యంగా స్థిర ఆదాయం ఉన్నా క్రెడిట్ కార్డు లేని మధ్య తరగతి వర్గానికి ఇది ఉపయోగకరంగా మారే అవకాశం ఉంది.

ఆర్థిక వ్యవస్థపై ప్రభావం

నిపుణుల అంచనాల ప్రకారం, ఈ విధానం నగదు వినియోగాన్ని తగ్గించడంలో, టైర్--2, టైర్--3 నగరాల్లో కార్డు వినియోగాన్ని పెంచడంలో, ఫార్మల్ ఎకానమీని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. అయితే, అతిగా క్రెడిట్ వినియోగం వల్ల వినియోగదారుడు అప్పుల ఊబిలో కూరుకునే ప్రమాదం కూడా ఉందని, అందుకే ప్రజల్లో ఆర్థిక అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. వీసా ప్రతిపాదిస్తున్న ఈ డెబిట్--కమ్--క్రెడిట్ కార్డు భారత్ చెల్లింపుల వ్యవస్థను మరింత స్మార్ట్‌గా, ఫ్లెక్సిబుల్‌గా మార్చే విధానంగా పరిగణించవచ్చు. ఇది వినియోగదారుల సౌకర్యం, బ్యాంకులకు భద్రత ఈ రెండింటికీ మధ్య సమతుల్యత తీసుకురావచ్చని విశ్లేషకుల అభిప్రాయం.

కార్డు కాదు కాంబోప్యాక్

వీసా అభివృద్ధి చేసిన 'ఫ్లెక్సిబుల్ క్రెడెన్షియల్ (వీసా ఫ్లెక్స్) ' టెక్నాలజీ ఆధారంగా ఈ కార్డు పనిచేస్తుంది. 16 అంకెల ఒకే కార్డు నంబర్ ద్వారా కస్టమర్ లావాదేవీ చేసే సమయంలో అది అవసరాన్ని బట్టి డెబిట్‌గా లేదా క్రెడిట్‌గా వాడుకోవచ్చు. చెల్లింపు ఎలా జరగాలన్నది కస్టమర్ కొనుగోలు చేసే విలువ మొత్తం, లేదా వినియోగదారు ముందుగా ఎంచుకున్న సెట్టింగ్స్ ఆధారంగా ఆటోమేటిక్‌గా నిర్ణయమవుతుంది.ఉదాహరణకు, రోజువారీ చిన్న ఖర్చులు డెబిట్‌గా, పెద్ద కొనుగోళ్లు క్రెడిట్‌లో జరిగేలా ఈ కార్డును సెట్ చేసుకోవచ్చు.

### భారత్ ఎందుకు కీలక మార్కెట్?

భారత్‌లో క్రెడిట్ కార్డు వినియోగం అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే తక్కువ. అదే సమయంలో నగదు లావాదేవీల వాటా చాలా పెద్దది. ఈ పరిస్థితిలో ఒకే కార్డు ద్వారా డెబిట్--క్రెడిట్ సౌకర్యం ఇవ్వడం వల్ల డిజిటల్ చెల్లింపులు మరింత విస్తరించవచ్చని వీసా భావిస్తోంది.

# నిద్రలేమి.. మహిళల్లోనే ఎక్కువ!

## ఒత్తిడి, కుటుంబ బాధ్యతలే ఇందుకు కారణం

## ఈ సమస్యతో తగ్గుతున్న ఏకాగ్రత, పనితీరు

## రెస్‌మెడ్ 2026 గ్లోబల్ స్లీప్ సర్వేలో వెల్లడి



స్పెషల్ డెస్క్: మహిళల్లో నిద్రలేమి అనేది ఒక క్లిష్టమైన ప్రజారోగ్య సమస్యగా అవతరించింది. పురుషుల కంటే మహిళలే నిద్ర విషయంలో అధికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పెరుగుతున్న మానసిక ఒత్తిడి, కుటుంబ బాధ్యతల్లో అసమానత ఈ వ్యత్యాసానికి ప్రధాన కారణాలు. ఫలితంగా నేటి కాలంలో చాలామంది భారతీయ మహిళలకు నాణ్యమైన నిద్ర అందని ద్రాక్షలా మిగిలిపోతోంది. అమెరికాలోని కాలిఫోర్నియా కేంద్రంగా మెడికల్ డివైసెస్ తయారీలో ఉన్న రెస్‌మెడ్ ఇటీవల గ్లోబల్ స్లీప్ సర్వే--2026 నిర్వహించింది. భారత్‌తోపాటు అమెరికా, చైనా, యూకే, జర్మనీ, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, జపాన్, కొరియా, బ్రెజిల్, పోలండ్, సింగపూర్, మెక్సికో దేశాలకు చెందిన 30 వేల మంది పాలుపంచుకున్నారు. ఇందులో భారత్ నుంచి 5 వేల మంది ఉన్నారు. ఈ సర్వే ప్రకారం.. నిద్రలేమి సమస్యతో 38% మంది భారతీయ మహిళలు ఇబ్బందిపడుతున్నారు. పురుషుల విషయంలో ఈ సంఖ్య 29% మాత్రమే. వంట, ఇంటి పనులు; పిల్లలు, పెద్దల సంరక్షణ.. భారతీయ మహిళల భు జాలపై సహజంగా ఉండే భారం. ఇంటి నిర్వహణకు సంబంధించిన మానసిక ఒత్తిడి దీనికి అదనం. ఇక ఉద్యోగం చేసే మహిళలైతే అటు వృత్తి బాధ్యతలనూ మోయాల్సి వస్తోంది. భిన్నమైన ప్రభావం..: సామాజిక, మానసిక ఒత్తిళ్లు స్త్రీ పురుషులపై రాత్రి నిద్ర విషయంలో ఎలా భిన్నంగా ప్రభావం చూపుతాయో ఈ సర్వే ఫలితాలు వెల్లడిస్తున్నాయి. నిద్రాభంగం కావడానికి మానసిక ఒత్తిడి, ఆందోళనను ప్రధాన కారకాలుగా 42% మంది మహిళలు పేర్కొన్నారు. ఈ విషయంలో పురుషుల సంఖ్య 36% ఉంది. అంతేకాకుండా కుటుంబ బాధ్యతలు నిద్రకు ఆటంకం కలిగిస్తున్నాయని 39% మంది మహిళలు, 33% మంది పురుషులు చెబుతున్నారు. సుదీర్ఘమైన, ఆరోగ్యకరమైన జీవితానికి స్థిర, నాణ్యమైన నిద్ర అవసరమని ప్రపంచవ్యాప్తంగా 90% మంది గుర్తించారు. ఆహారం, వ్యాయామంతోపాటు నిద్రను అత్యంత ముఖ్యమైన అలవాటుగా 44% మంది భారతీయులు పరిగణిస్తున్నారు. అయినప్పటికీ 53% ప్రజలు వారానికి నాలుగు రాత్రులు లేదా అంతకంటే తక్కువ సమయం మాత్రమే నాణ్యమైన నిద్రను పొందుతున్నట్లు తెలిపారు. ఇది అవగాహనకు, వాస్తవానికి మధ్య పెరుగుతున్న భారీ అంతరాన్ని నొక్కి చెబుతోంది.

### వేరబుల్ టెక్నాలజీతో..

నిద్ర ప్రాముఖ్యతపై ప్రజల్లో అధిక అవగాహన ఉన్నప్పటికీ సమస్యలున్నవారు వైద్యపరంగా సాయం తీసుకోవడం లేదు. 78% మంది భారతీయులు నిద్ర సమస్యల పరిష్కారం కోసం వైద్యుడిని సంప్రదించడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ.. సాధారణ చెకప్‌లలో 69% మందికి మాత్రమే దీనికి సంబంధించిన పరీక్షలు జరిగాయి. ఈ నేపథ్యంలో మన దేశంలోని ఆసుపత్రులు మరింత చురుకుగా నిద్ర సమస్యలను గుర్తించాల్సిన అవసరం ఉందని నివేదిక తెలిపింది. 75% మంది భారతీయులకు తమ నిద్ర విధానాలను మరింత నిశితంగా గమనించడానికి స్మార్ట్‌వాచెస్, ఫిట్‌నెస్ బ్యాండ్స్ వంటి వేరబుల్ టెక్నాలజీ దోహదపడుతోంది. ఈ పరికరాలు నెగిటివ్ ఫలితాలు చూపితే.. 66% మంది వినియోగదారులు తమ దీర్ఘకాలిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి వైద్య సలహాను పొందుతామని చెబుతున్నారు.

### మానసిక ఆరోగ్యంపై..

నాణ్యమైన నిద్ర తక్కువగా ఉండటం వల్ల కేవలం అలసట మాత్రమే కాకుండా అంతకుమించిన తీవ్ర పరిణామాలు ఎదురవుతాయి. సరైన నిద్రలేని రాత్రి తర్వాత తాము మరింత చిరాకుగా, ఒత్తిడితో లేదా నిరాశతో ఉన్నట్లు అత్యధికులు తెలిపారు. ప్రత్యేకించి 30% మంది నిద్రలేమికి, కుంగుబాటు లక్షణాలకు మధ్య ప్రత్యక్ష సంబంధం ఉన్నట్లు గుర్తించారు.

# వచ్చేస్తోంది 'డూమ్స్ డే' క్షిపణి

## పరీక్షించిన అమెరికా

## ఇరాన్‌పై యుద్ధం నేపథ్యంలో కీలక పరిణామం

## అణు సామర్థ్యంతో కూడిన విధ్వంసక క్షిపణి



ఇరాన్‌పై యుద్ధం నానాటికీ భీకర స్థాయికి చేరుతున్న నేపథ్యంలో అమెరికా కీలక చర్యకు దిగింది. 'డూమ్స్‌డే'మిసైల్‌గా పేరొందిన మినట్‌మ్యాన్--3 ఖండాంతర క్షిపణిని పరీక్షించింది! అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం రాత్రి అమెరికా వైమానిక దళ గ్లోబల్ స్ట్రైక్ కమాండ్ కాలిఫోర్నియాలోని వాండెన్‌బర్గ్ స్పేస్ ఫోర్స్ బేస్ నుంచి ఈ క్షిపణిని ప్రయోగించింది. అది ఏకంగా 4,200 మైళ్లకు పైగా దూరం ప్రయాణించి పశ్చిమ మధ్య పసిఫిక్‌లోని మార్షల్ దీవుల సమీపంలో రోనాల్డ్ రీగన్ బాలిస్టిక్ మిసైల్ టెస్ట్ సైట్ వద్ద లక్ష్యాన్ని కచ్చితంగా ఛేదించినట్టు అమెరికా ప్రకటించింది. జీటీ 255గా పేర్కొంటున్న ఈ క్షిపణి ప్రయోగానికి ఇరాన్‌పై యుద్ధంతో సంబంధం లేదని స్పష్టం చేసింది. క్షిపణి వ్యవస్థ తాలూకు విడి భాగాల పనితీరు తదితరాలను పూర్తిస్థాయిలో మదింపు వేసేందుకే పరీక్ష జరిపినట్టు 576వ ఫ్లైట్ టెస్ట్ స్క్వాడ్రన్ కమాండర్ లెఫ్టినెంట్ కల్నల్ క్యారీ రే తెలిపారు. దీర్ఘకాలిక అవసరాల రీత్యా అమెరికా అణుపాటవం నిత్యం యుద్ధ సన్నద్ధంగా ఉండేందుకు ఈ పరీక్ష తోడ్పడుతుందని అభిప్రాయపడ్డారు.

### రేంజ్ 6,000 కి.మీ. పైనే

మినట్‌మ్యాన్--3 క్షిపణి సామర్థ్యం అంతా ఇంతా కాదు. అమెరికా వ్యూహాత్మక క్షిపణి వ్యవస్థకు ఇది గుండెకాయ వంటిదంటే అతిశయోక్తి కాదు! అణ్వస్త్ర సామర్థ్యంతో కూడిన దీని రేంజ్ ఏకంగా 6,000 కి.మీ. పై చిలుకే! గంటకు 24 వేల కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్తుంది. రెండో ప్రపంచయుద్ధ కాలంలో హిరోషిమాపై పడ్డ అణుబాంబు కంటే ఏకంగా 20 రెట్లు శక్తిమంతమైన అణు వార్‌హెడ్లను ఈ క్షిపణి మోసుకెళ్లగలదు! ఖండాలకు ఆవల ఉన్న లక్ష్యాలను కూడా నిమిషాల వ్యవధిలో తుత్తునియలు చేయగలదు. అమెరికా ఇప్పటికే దీన్ని పలుమార్లు పరీక్షించి చూసింది. చివరిసారి గత నవంబర్‌లో దీన్ని పరీక్షించింది. ఈ క్షిపణుల తయారీని 1979లో మొదలు పెట్టారు.

### ఆ పేరెందుకు?

అమెరికా అణ్వాయుధ సంపత్తిలో అత్యంత వినాశనకరమైన అస్త్రం మినట్‌మ్యాన్--3యే. అణుయుద్ధం అంటూ వస్తే ఇది సృష్టించే విధ్వంసం అంచనాలకు కూడా అందదు. అక్షరాలా ప్రళయం సృష్టిస్తుందనే అర్థంలో దీనికి డూమ్స్ డే అనే ముద్దుపేరు వచ్చింది. మినట్‌మ్యాన్--3 రేంజ్ 6,000 కి.మీ. అని అమెరికా చెబుతున్నా వాస్తవానికి అంతకంటే చాలా ఎక్కువగా ఉంటుందన్నది రక్షణ నిపుణుల మాట. భూమిపై ఏ లక్ష్యాన్నయినా ఛేదించగల సామర్థ్యం దీని సొంతమని చెబుతారు. పైగా ఈ క్షిపణి ఘన ఇంధనంతో నడుస్తుంది. దాంతో నిత్యం అప్రమత్తంగా ఉంటుంది. సమస్య తలెత్తితే క్షణాల వ్యవధిలో సిద్ధమై శత్రువు పని పట్టగలదు. పైగా మల్టిపుల్ ఇండిపెండెంట్లీ రీ ఎంట్రీ వెహికిల్స్ (ఎంఐఆర్‌వీ)లను మోహరించే సామర్థ్యం కూడా మినట్‌మ్యాన్--3 సొంతం. కనుక ఒకే ప్రయోగంతో ఏకకాలంలో బహుళ లక్ష్యాలను అలవోకగా ఛేదించగలదు. అమెరికా వద్ద ప్రస్తుతం ఈ క్షిపణులు 400కు పైగా ఉన్నట్టు అంచనా. వీటిని అమెరికా పశ్చిమ ప్రాంతంలో అత్యంత గోప్యంగా భూగర్భ కేంద్రంలో మోహరించి ఉంచారు. అండర్‌గ్రౌండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా వీటిని నిరంతరం పర్యవేక్షిస్తుంటారు. ఒకవేళ దానితో సంబంధం తెగిపోయినా ప్రత్యేకంగా రూపొందించిన ఈ--6బీ లాంచ్ కంట్రోల్ విమానం నుంచి ఈ క్షిపణులను ఆపరేట్ చేసే సౌలభ్యం కూడా ఉంది.

# ధరల మోత.. వంటనూనెలు మొదలు ఔషధాల దాకా




## యుద్ధం ఇలాగే కొనసాగితే భారతీయులపై పెనుభారం

## సాధారణ ప్రజానీకంపై ధరలమోత మోగే ప్రమాదం

ఇరాన్‌పై అమెరికా దాడిచేస్తే బదులుగా ఇరాన్.. సౌదీ, బహ్రెయిన్, ఖతార్ సహా పలు గల్ఫ్ దేశాలపై బాంబులేస్తోంది. సుదూరంగా ఉన్న భారత్‌పై బాంబులు పడకపోయినా ధరల బాంబులు పడొచ్చన్న విశ్లేషణలు ఇప్పుడు సగటు భారతీయుని గుండెల్లో భయాందోళనలను పెంచేస్తున్నాయి. సముద్రమార్గంలో చమురు కూడలిగా పేరొందిన హోర్మూజ్ జలసంధి గుండా నౌకల రాకపోకలు ఆగిపోవడంతో ముడిచమురు మొదలు పలురకాల వస్తూత్పత్తుల ధరలకు రెక్కలొచ్చే ఆస్కారముంది.

### తొలుత చమురు మంటలు

యుద్ధం ఇలాగే కొనసాగితే మిగతా వినిమయ వస్తువులతో పోలిస్తే మొట్టమొదట ముడిచమురు, చమురు ఉత్పత్తుల ధరలు పెరుగుతాయి. ఇప్పటికే ద్రవరూప సహజవాయువు(ఎల్ఎన్‌జీ) సరఫరా ఇరాన్ నుంచి ఆగిపోయింది. సౌదీ అరేబియాలోని రస్ తనూరా రిఫైనరీ నుంచి భారత్‌కు సరఫరా భారీగా తగ్గింది. దీంతో ఫిబ్రవరి నుంచి చమురు ధరలు ఏకంగా 20 శాతం పెరిగాయి. హోర్మూజ్ జలసంధికి బదులు ఆఫ్రికా ఖండంలోని 'కేప్ ఆఫ్ గుడ్‌హోప్'ను చుట్టేస్తూ చమురు ఉత్పత్తులను సరఫరా చేస్తే రవాణా ఖర్చులు కలుపుకుని భారత్‌లో ఆయిల్ ధరలు పెరగడం ఖాయం.

### వంటనూనె మరింత ధర..

భారత్ వంటనూనెల కోసం అధికంగా దిగుమతులపై ఆధారపడుతోంది. పామాయిల్ ఎక్కువగా ఇండోనేసియా, మలేసియా నుంచి వస్తోంది. అర్జెంటీనా, బ్రెజిల్, అమెరికా నుంచి సోయాబీన్ నూనె, రష్యా, ఉక్రెయిన్ నుంచి పొద్దుతిరుగుడు నూనె దిగుమతి అవుతున్నాయి. వీటిలో కొంత సరుకు హోర్మూజ్ జలసంధి గుండా వస్తోంది. రవాణా గొలుసు తెగిపోవడంతో ధరలు కట్టలు తెంచుకోవచ్చని 'సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా'ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీవీ మెహతా చెప్పారు. ఇప్పటికే వంటనూనెల ధరలు పెరగడం ఆరంభమైంది. కేంద్రప్రభుత్వంలోని వినియోగదారుల వ్యవహారాల శాఖ గణాంకాల ప్రకారం మార్చి రెండో తేదీ ధరలతో పోలిస్తే మార్చి మూడో తేదీన సన్‌ఫ్లవర్, సోయా, పామాయిల్ నూనెల రిటైల్ ధరలు ఒకటి నుంచి మూడు రూపాయలు పెరిగాయి.

### పప్పులూ మరింత ప్రియం..

పప్పుల ధరలు పెరిగే వీలుందని 'ఆల్ ఇండియా దాల్ మిల్ అసోసియేషన్'అధ్యక్షుడు సురేశ్ అగర్వాల్ చెప్పారు. మయన్మార్, కెనడా, ఆఫ్రికాల నుంచి భారత్ ఏటా దాదాపు 60 లక్షల టన్నుల కందులు, మినుములు సహా పలు రకాల పప్పులను దిగుమతిచేసుకుంటోంది. "ఇరాన్, అఫ్గానిస్తాన్ నుంచి భారత్ అత్తిపండు, బాదం, పిస్తా, ఖర్జూరా, ఎండు ద్రాక్ష, కుంకుమ పువ్వు, అప్రికాట్‌లను దిగుమతి చేసుకుంటోంది. పాకిస్తాన్‌తో ఘర్షణ వాతావరణం కారణంగా ఇప్పుడు ఇరాన్, అఫ్గాన్‌ల నుంచి పాక్‌కు, అక్కడి నుంచి వాఘా సరిహద్దు గుండా భారత్‌కు సరుకు రావట్లేదు. సముద్రమార్గంలో వస్తోంది. ఇప్పుడు పశ్చిమాసియా యుద్ధం దెబ్బకు సముద్రమార్గం మూసేయడంతో డ్రై ఫ్రూట్స్ సరుకు రావడం దాదాపు ఆగిపోయినట్లే. ధరలు పెరిగే వీలుంది"అని 'ముంబై డ్రై ఫ్రూట్, డేట్ మర్చంట్స్ అసోసియేషన్'అధ్యక్షుడు విజయ్ భూటా చెప్పారు. ఎరువులు, సాగు ఉత్పత్తుల రాక సైతం తగ్గిపోయిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. విమానాల రాకపోకలు తగ్గడంతో కార్గో రవాణా పరిమాణం కుచించుకుపోయింది. ఇతర దేశాల మీదుగా విమానాలు తిరిగి రావడంతో అంతర్జాతీయ ప్రయాణికులకు టికెట్ అధిక చార్జీల మోత మోగుతోంది.

### ప్లాస్టిక్ సైతం..

ముడిచమురు నుంచే ప్లాస్టిక్ గ్రాన్యూల్స్‌ను తయారుచేస్తారు. ముడిచమురు సరఫరా తగ్గడంతో గత రెండు రోజుల్లోనే ప్లాస్టిక్ గ్రాన్యూల్స్ ధర 12 శాతం ఎగసింది. దీంతో ప్లాస్టిక్ ఆధారిత ఉత్పత్తుల ధరలు సైతం పైపైకి పోవడం ఖాయంగా కని?పస్తోంది.

### ఔషధాలదీ అదే బాట...

ఔషధాల తయారీలో ఉపయోగించే ముడి సరుకులైన యాక్టివ్ ఫార్మా ఇంగ్రిడియంట్స్(ఏపీఐ) కోసం భారత్ ఎక్కువగా చైనాపై ఆధారపడుతోంది. కానీ అత్యంత ఖరీదైన కీ స్టార?టంగ్ మెటీరియల్స్(కేఎస్ఎం) కోసం ఎక్కువగా ఐరోపా దేశాలపై ఆధారపడుతోంది. యూరప్ నుంచి కేఎస్ఎం సరుకు హోర్మూజ్ ద్వారానే రావాల్సి ఉంది. ఇవి తగ్గిపోవడంతో భారత్‌లో సంక్లిష్ట జనరిక్ మందులతోపాటు సైడ్ ఎఫెక్ట్‌లను తగ్గించే 'విలువ జోడింపు ఔషధా(వీఏఎం)'ల తయారీ ఖర్చులు తడిసిమోపెడు కానున్నాయి. వీటికితోడు మారుతున్న అంతర్జాతీయ పరిణామాలతో రూపాయి మారకం విలువ పతనమవుతుండటంతో పెట్రోకెమికల్ ఉత్పత్తుల ధరలు మరింత ప్రియంకానున్నాయి. ఇవన్నీ కలసి సగటు భారతీయుని జేబుకు పెద్ద చిల్లు పెడతాయని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన సంప్రదాయ బియ్యం వెరైటీలు ఇవే.. ఎంతో రుచికరం, ఆరోగ్యకరం..

భారతీయుల ఆహార సంస్కృతిలో బియ్యానికి ప్రత్యేక స్థానం ఉంది. బియ్యంతో వండిన అన్నాన్ని చాలా మంది ఆహారంగా తీసుకుంటూ ఉంటారు. అయితే ప్రస్తుతం ఎక్కువమంది బాస్మతి లేదా పాలిష్ చేసిన తెల్ల బియ్యాన్నే ప్రధానంగా ఉపయోగిస్తున్నారు. కానీ శతాబ్దాల క్రితమే దేశంలోని వివిధ రాష్ట్రాల్లో వేల సంఖ్యలో స్వదేశీ బియ్యం రకాలు సాగు చేయబడేవి. వీటిలో కొన్ని సహజ సువాసనతో, మరికొన్ని ఎరుపు లేదా నలుపు రంగులతో ప్రత్యేకతను సంపాదించాయి. రుచులు, వాసనలు, పోషక విలువలు ఒక్కో రకానికి ఒక్కో విధంగా ఉండటం వీటి ప్రత్యేకత. వివిధ రాష్ట్రాల్లో పండే స్వదేశీ బియ్యం రకాల గురించి నిపుణులు వివరిస్తున్నారు. అస్సాంలో ప్రసిద్ధి చెందిన జోహా బియ్యం చిన్నగా, గుండ్రంగా ఉండే గింజలతో ప్రత్యేక గుర్తింపు పొందింది. ఇది ఉడుకుతున్నప్పుడు ఇల్లంతా తీయని పూల వాసనలా పరిమళిస్తుంది. వండిన తర్వాత మెత్తగా ఉండే ఈ బియ్యం అతుక్కుపోకుండా ఉంటుంది. పులావ్, పండుగల భోజనాలు, ఖీర్ వంటి తీపి వంటకాల్లో దీనిని విరివిగా ఉపయోగిస్తారు. అస్సాంలో శతాబ్దాలుగా సాగు చేస్తున్న ఈ బియ్యానికి జీఐ ట్యాగ్ కూడా లభించింది.



### పశ్చిమ బెంగాల్, మణిపూర్..

పశ్చిమ బెంగాల్‌కు చెందిన గోబిందోభోగ్ బియ్యం అక్కడి సంప్రదాయాలతో ముడిపడి ఉంది. చిన్న తెల్లని గింజలతో ఉండే ఈ బియ్యం వెన్నలాంటి మృదువైన వాసనను ఇస్తుంది. ఖిచిడి, పాయేష్, పులావ్ వంటి బెంగాలీ వంటకాల్లో దీన్ని ప్రధానంగా ఉపయోగిస్తారు. ముఖ్యంగా దుర్గాపూజ సమయంలో ఈ బియ్యం లేకుండా సంప్రదాయ వంటలు పూర్తి కావని భావిస్తారు. 2017లో ఈ బియ్యానికి జీఐ గుర్తింపు లభించింది. అలాగే మణిపూర్‌కు చెందిన చక్-హావో అనే నల్ల బియ్యం దేశంలో అత్యంత ప్రత్యేకమైన రకాలలో ఒకటి. వండకముందు నల్లగా కనిపించే గింజలు ఉడికిన తర్వాత గాఢ ఊదా రంగులోకి మారుతాయి. కొద్దిగా తీయని, నట్స్ రుచిని కలిగిన ఈ బియ్యం పురాతన కాలంలో రాజవంశీయులకే పరిమితమై ఉండేదని చెబుతారు. చక్-హావో ఖీర్ ఈ బియ్యంతో చేసే ప్రసిద్ధ వంటకం. యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండటంతో ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టేవారు కూడా దీనిని ఇష్టపడుతున్నారు.

### తమిళనాడు, ఉత్తర ప్రదేశ్..

తమిళనాడులో ప్రసిద్ధి చెందిన మప్పిళ్లై సంబా ఎర్ర బియ్యం వెనుక ఆసక్తికరమైన చరిత్ర ఉంది. వరుడి బియ్యం అని అర్థమయ్యే ఈ రకం శక్తి, స్టామినా పెంచుతుందని నమ్మకం. గట్టిగా ఉండే ఈ బియ్యాన్ని దోశలు, ఇడ్లీలు, గంజి వంటి సంప్రదాయ వంటల్లో ఉపయోగిస్తారు. ఒకప్పుడు కనుమరుగవుతున్న ఈ రకం ఇప్పుడు ఆరోగ్యకరమైన ధాన్యాలపై పెరుగుతున్న ఆసక్తితో మళ్లీ ప్రాచుర్యం పొందుతోంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన కాలానమక్ బియ్యానికి బౌద్ధకాలం నాటి చరిత్ర ఉందని చెబుతారు. దీని పేరుకు కారణం గింజలపై ఉండే నలుపు రంగు పొట్టు. ఉడికినప్పుడు పాప్‌కార్న్ వాసనలా ప్రత్యేకమైన పరిమళం వస్తుంది. కొద్దిగా తీపి రుచితో ఉండే ఈ బియ్యం పులావ్ వంటి వంటకాలకు ఎంతో అనుకూలంగా ఉంటుంది. సాగు తగ్గిపోవడంతో అంతరించిపోతున్న ఈ రకానికి ప్రభుత్వం జీఐ ట్యాగ్ ఇచ్చి ప్రోత్సాహం కల్పించింది.

### కేరళ, మహారాష్ట్ర..

కేరళలోని నజావర బియ్యం ఆయుర్వేదంలో ప్రత్యేక స్థానం సంపాదించింది. ఎర్రని గింజలతో ఉండే ఈ బియ్యం సాధారణ బియ్యంతో పోలిస్తే కొద్దిగా చేదు, మట్టి వాసన కలిగిన రుచిని ఇస్తుంది. ఆరోగ్య ప్రయోజనాల కోసం దీన్ని ఆయుర్వేద గంజి, ప్రత్యేక ఆహారాల్లో ఉపయోగిస్తారు. మధుమేహం, ఎముకల బలహీనత వంటి సమస్యల్లో ఇది ఉపయోగకరమని భావిస్తారు. మహారాష్ట్రకు చెందిన అంబెమోహర్ బియ్యం మామిడి పూల పరిమళాన్ని సూచిస్తుంది. వండినప్పుడు వచ్చే సువాసన మామిడి పూల వాసనను తలపిస్తుంది. మసాలే భాత్ వంటి మహారాష్ట్ర సంప్రదాయ వంటల్లో దీనిని ఎక్కువగా ఉపయోగిస్తారు. జీఐ ట్యాగ్ పొందిన ఈ బియ్యం అక్కడి ప్రజలకు ఎంతో ప్రీతిపాత్రమైనది. తమిళనాడులో ప్రసిద్ధి చెందిన కావుని బియ్యం కూడా ఒకప్పుడు రాజ కుటుంబాలకు మాత్రమే పరిమితమై ఉండేదని చెబుతారు. నల్లని రంగు, తీయని నట్స్ రుచి, నమిలే గుణం దీనికి ప్రత్యేకత. బెల్లం, కొబ్బరితో చేసే కావుని అరిసి స్వీట్ అనే తీపి వంటకం ఎంతో ప్రసిద్ధి చెందింది. సాధారణ బియ్యంలా తేలికగా కాకుండా గట్టిగా ఉండే ఈ బియ్యం ప్రత్యేక అనుభూతిని ఇస్తుంది. దేశంలోని ఈ స్వదేశీ బియ్యం రకాలు కేవలం ఆహారం మాత్రమే కాదు, ప్రాంతీయ సంస్కృతి, సంప్రదాయం, ఆరోగ్య జ్ఞానానికి కూడా ప్రతీకలుగా నిలుస్తున్నాయి.

# ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది ఇష్టపడే పానీయం టీ.. అసలు ఎక్కడ ఎవరు తయారు చేశారు..



ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది రోజును ఒక కప్పు టీతో ప్రారంభిస్తారు. భారతీయుల జీవితంలో చాయ్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ఉదయం నిద్రలేచింది మొదలు సాయంత్రపు చిట్‌చాట్‌ల వరకు టీ దైనందిన జీవితంలో భాగమైపోయింది. అయితే ఇప్పుడు భారతీయుల అభిమాన పానీయంగా మారిన టీ అసలు పుట్టింది మాత్రం భారత్‌లో కాదు. వేల సంవత్సరాల క్రితమే చైనాలో టీ చరిత్ర ప్రారంభమైంది. టీ ఆవిష్కరణకు సంబంధించిన కథ దాదాపు 5 వేల సంవత్సరాల క్రితం చైనాలోని యున్నాన్ ప్రాంతంతో ముడిపడి ఉంది. చారిత్రక కథనాల ప్రకారం చైనా చక్రవర్తి షెన్ నాంగ్ ఒక చెట్టు కింద కూర్చుని ఉండగా పక్కనే నీరు మరుగుతుండేది. ఆ సమయంలో చెట్టు ఆకులు కొన్ని ఆ వేడి నీటిలో పడిపోయాయి. ఆ నీటిని రుచి చూసిన చక్రవర్తి దాని ప్రత్యేక రుచి, ఉల్లాసాన్ని చూసి ఆశ్చర్యపోయాడట. దాన్నే ప్రపంచంలో తొలి టీ కప్పుగా భావిస్తారు.

### చైనాలో అలాగే తాగుతారు..

తర్వాత అనేక శతాబ్దాల పాటు చైనాలో టీని కేవలం పానీయంగా మాత్రమే కాకుండా ఔషధంగా కూడా భావించేవారు. టీ తాగితే మెదడు చురుకుగా పనిచేస్తుందని, జీర్ణక్రియ మెరుగుపడుతుందని, శరీరానికి శక్తి వస్తుందని అక్కడి ప్రజలు నమ్మేవారు. క్రమంగా టీ వారి దైనందిన జీవితంలో భాగమై, ఆ తర్వాత ప్రత్యేక కళారూపంగా కూడా మారింది. చైనాలో సాధారణంగా టీని పాలు, చక్కెర లేకుండా స్వచ్ఛమైన రూపంలోనే తాగుతారు. అలా తాగితే టీ ఆకుల సహజ రుచి పూర్తిగా ఆస్వాదించవచ్చని భావిస్తారు. చైనా వ్యాపారుల ద్వారా టీ యూరప్‌కు చేరింది. 17వ శతాబ్దానికి బ్రిటిష్ ప్రజలు టీకి బాగా అలవాటు పడ్డారు. అయితే టీ వ్యాపారంపై పూర్తిగా చైనాకే ఆధిపత్యం ఉండటంతో బ్రిటన్ కొత్త మార్గాలను వెతకడం ప్రారంభించింది. అదే సమయంలో భారత్‌లో టీ సాగు ప్రారంభమైంది.

### 20వ శతాబ్దంలో భారత్‌లోకి..

మొదట బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ చైనా టీ విత్తనాలను భారత్‌లో నాటే ప్రయత్నం చేసింది. కానీ అసలు మలుపు అస్సాంలో సహజంగా పెరుగుతున్న అడవి టీ మొక్కలను గుర్తించిన తర్వాత వచ్చింది. ఈ టీ రకం చైనా టీ మొక్కలకంటే భిన్నంగా ఉండేది. దీని ఆకులు పెద్దగా ఉండటంతో పాటు చక్కని రుచిని ఇస్తుండేవి. బ్లాక్ టీ తయారికి ఇది ఎంతో అనుకూలంగా మారింది. ఆ తర్వాత అస్సాం, డార్జిలింగ్, నీలగిరి వంటి ప్రాంతాల్లో భారీ స్థాయిలో టీ తోటలు ఏర్పడ్డాయి. అయితే ప్రారంభంలో భారత్‌లో పండించిన టీ ఆకులను ఎక్కువగా విదేశాలకు ఎగుమతి చేసేవారు. భారతీయులు అప్పట్లో పెద్దగా టీ తాగేవారు కాదు. 20వ శతాబ్దంలో జరిగిన ప్రచార కార్యక్రమాల తర్వాతే టీ భారతీయ ఇళ్లలో సాధారణ పానీయంగా మారింది. టీని భారత్ పూర్తిగా కొత్త రూపంలో మార్చింది. చైనాలో స్వచ్ఛమైన టీకి ప్రాధాన్యం ఇస్తే, భారతీయులు అందులో పాలు, చక్కెర, అల్లం, యాలకులు, లవంగాలు వంటి మసాలాలు కలిపారు. అలా మసాలా చాయ్ అనే ప్రత్యేక రుచికరమైన పానీయం రూపుదిద్దుకుంది.

### భిన్న రకాల రుచులు..

చైనా టీ సాధారణంగా మృదువైన, సున్నితమైన రుచితో ఉండి నెమ్మదిగా ఆస్వాదించేందుకు అనుకూలంగా ఉంటుంది. భారతీయ టీ మాత్రం ఘాటుగా, బలమైన రుచితో వెంటనే ఉత్సాహాన్ని ఇచ్చేలా ఉంటుంది. టీ తాగే విధానంలో కూడా రెండు దేశాల మధ్య తేడా కనిపిస్తుంది. చైనాలో టీ తాగడం ప్రశాంతత, ధ్యానంతో ముడిపడి ఉంటే, భారత్‌లో టీ అనేది సంభాషణలతో ముడిపడి ఉంటుంది. కుటుంబ చర్చలు, ఆఫీస్ విరామాలు, రైలు ప్రయాణాలు, స్నేహితుల కబుర్లు అన్నింటిలోనూ చాయ్ ప్రత్యేక భాగంగా మారిపోయింది. టీ చైనాలో పుట్టినా, దానికి కొత్త వ్యక్తిత్వాన్ని ఇచ్చింది మాత్రం భారత్ అనే చెప్పాలి. వేల సంవత్సరాల క్రితం చైనా పర్వతాల్లో ప్రారంభమైన ఈ ప్రయాణం నేడు భారతీయుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుంది.

# చర్మం, గోర్ల సమస్యలకు అనేక కారణాలు ఉంటాయి.. అందరూ అవగాహన కలిగి ఉండాల్సిందే..

చర్మం పొడిబారడం, గోర్లు త్వరగా విరిగిపోవడం వంటి సమస్యలను చాలా మంది సాధారణ సౌందర్య సమస్యలుగా తీసుకుంటారు. చలి వాతావరణం, ఎక్కువసార్లు చేతులు కడగడం, వయస్సు పెరగడం లేదా నీరు తక్కువగా తాగడం వల్ల ఇలా జరుగుతుందని భావిస్తారు. అయితే కొన్ని సందర్భాల్లో ఇవి శరీరంలో జరుగుతున్న హార్మోన్ల మార్పులకు సంకేతాలు అయ్యే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. చర్మం తేమ, చర్మంలోని ఆయిల్ ఉత్పత్తి, రక్తప్రసరణ, గోర్ల బలం వంటి అనేక అంశాలను హార్మోన్లు నియంత్రిస్తాయి. అందువల్ల హార్మోన్ల అసమతుల్యత వచ్చినప్పుడు దాని ప్రభావం బయటకు కూడా కనిపిస్తుంది.

### థైరాయిడ్ గ్రంథి ప్రభావం..



థైరాయిడ్ గ్రంథి పనితీరు తగ్గిపోవడం వల్ల వచ్చే హైపోథైరాయిడిజం ఈ సమస్యలకు ప్రధాన కారణాల్లో ఒకటిగా భావిస్తున్నారు. థైరాయిడ్ హార్మోన్లు తగ్గిపోతే శరీరంలోని సహజ ప్రక్రియలు మందగిస్తాయి. దీని ప్రభావంగా చర్మం పొడిగా, గరుకుగా, పొలుసులా మారుతుంది. గోర్లు పలుచగా మారి సులభంగా విరిగిపోతాయి. అలసట, అకస్మాత్తుగా బరువు పెరగడం, మలబద్ధకం, జుట్టు రాలడం, ముఖం ఉబ్బినట్టుగా కనిపించడం, చలికి ఎక్కువగా ఇబ్బంది పడటం వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. ఇవి నెమ్మదిగా అభివృద్ధి చెందడం వల్ల చాలామంది మొదట్లో గుర్తించలేకపోతారు. గర్భధారణ సమయంలో లేదా మెనోపాజ్ దశలో కూడా హార్మోన్ల మార్పులు చర్మం, గోర్లపై ప్రభావం చూపిస్తుంది. ఈ సమయంలో ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరోన్ స్థాయిల్లో మార్పుల వల్ల చర్మ తేమ తగ్గడం, గోర్లు బలహీనపడడం జరుగుతుంది. అయితే చాలా సందర్భాల్లో హార్మోన్లు మళ్లీ సమతుల్యంలోకి వచ్చిన తర్వాత ఈ సమస్యలు తగ్గిపోతాయి.

### పోషకాహార లోపాలు..

హార్మోన్ల సమస్యలతోపాటు పోషకాహార లోపాలు కూడా చర్మం, గోర్ల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. శరీరంలో ఐరన్, విటమిన్ బి12, జింక్ లేదా ప్రోటీన్ లోపం ఉంటే గోర్లు బలహీనపడటం, చర్మం నిర్జీవంగా మారటం జరుగుతాయి. ముఖ్యంగా పరిమిత ఆహారం తీసుకునే వారు లేదా సరైన ఆహారపు అలవాట్లు లేని వారిలో ఈ సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి. జీవనశైలి, పర్యావరణ పరిస్థితులు కూడా ప్రభావం చూపుతాయి. గట్టిగా ఉండే సబ్బులు, శానిటైజర్లు, డిటర్జెంట్లు ఎక్కువగా వాడటం, ఎక్కువసేపు నీటిలో పని చేయడం, డీహైడ్రేషన్, ఎగ్జిమా, సోరియాసిస్ వంటి చర్మవ్యాధులు చర్మ రక్షణ పొరను దెబ్బతీసి గోర్లను బలహీనపరుస్తాయి. ఎయిర్ కండిషనర్లు, వేడి నీటితో స్నానం, పొడి వాతావరణం సమస్యను మరింత పెంచుతాయి. చర్మం పొడిబారడం, గోర్లు విరిగిపోవడం వంటి లక్షణాలు ఎక్కువకాలం కొనసాగితే లేదా జుట్టు రాలడం, అలసట, నెలసరి సమస్యలు, బరువు మార్పులు, మూడ్ స్వింగ్స్ వంటి ఇతర లక్షణాలు కూడా కనిపిస్తే వైద్యులను సంప్రదించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. థైరాయిడ్ పరీక్షలు, ఐరన్ స్థాయిలు, విటమిన్ పరీక్షలు, హార్మోన్ టెస్టులు చేయించుకోవడం ద్వారా అసలు కారణాన్ని ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుంది.

### రోజువారీ జాగ్రత్తలు..

రోజువారీ జాగ్రత్తలు కూడా చర్మం, గోర్ల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. సెరామైడ్ ఆధారిత మాయిశ్చరైజర్లు వాడటం, తగినంత నీరు తాగటం, ప్రోటీన్ ఎక్కువగా ఉండే సమతుల ఆహారం తీసుకోవడం, చేతులను రసాయనాల నుంచి రక్షించుకోవడం, గోర్లకు అధిక ఒత్తిడి రాకుండా చూసుకోవడం వంటి అలవాట్లు ప్రయోజనకరంగా ఉంటాయి. ఆరోగ్యవంతమైన చర్మం, బలమైన గోర్లు కేవలం అందానికి సంబంధించినవి మాత్రమే కాకుండా శరీరంలోని అంతర్గత ఆరోగ్య పరిస్థితులను ప్రతిబింబించే సూచికలుగా కూడా భావించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

# క్యాన్సర్ అంతానికి నాంది.. సార్వజనీన వ్యూహాన్ని సిద్ధం చేసిన ఫ్లోరిడా వర్సిటీ పరిశోధకులు!




న్యూఢిల్లీ : క్యాన్సర్ చికిత్సకు సంబంధించిన అభివృద్ధి ఎంత జరుగుతున్నప్పటికీ, ఏటా లక్షలాది కొత్త కేసులు నమోదవుతున్నాయి. శాస్త్రవేత్తలు ఓ సార్వజనీన వ్యూహం కోసం ప్రయత్నిస్తున్నారు. ఫ్లోరిడా విశ్వవిద్యాలయ పరిశోధకులు నిర్వహించిన అధ్యయనం భరోసానిచ్చే అవకాశం కనిపిస్తున్నది. పరిశోధకులు డాక్టర్ ఎలియాస్ సాయౌర్, డాక్టర్ దువానే మిషెల్ నిర్వహించిన అధ్యయనంలో, ఒక కణితి రకాన్ని లక్ష్యంగా చేసుకోకుండా మెసెంజర్ ఆర్ఎన్ఏ ను ఏ విధంగా నియంత్రించాలో తెలుసుకున్నారు. ఇది ఒరిజినల్ ట్యూమర్ సైట్‌కు అతీతంగా విస్తరిస్తుంది. ఎలుకలపై చేసిన ప్రయోగాలను బట్టి రోగ నిరోధక వ్యవస్థ కొత్త ట్యూమర్ స్పెసిఫిక్ మార్కర్స్‌ను చికిత్స కొనసాగుతున్న కొద్దీ సమగ్రంగా గుర్తించడం నేర్చుకున్నట్లు స్పష్టమవుతున్నది. ఈ విధంగా యాంటీజెన్ రికగ్నిషన్ వ్యాపించడం దీర్ఘకాలంలో క్యాన్సర్ నియంత్రణకు చాలా ముఖ్యం. కణుతులు చికిత్సను నిరోధించడానికి జన్యుపరమైన పరివర్తనలు ఒకటే కారణం కాదని, లోపించిన డ్యామేజ్-రెస్పాన్స్ సిగ్నల్‌కు కూడా సంబంధం ఉంటుందని వెల్లడైంది. దీనిని ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్ పునరుద్ధరించగలదని తెలిసింది. ప్రారంభంలో కణాల నుంచి ప్రొటీన్లు విడుదలయ్యే ఇంటర్‌ఫెరాన్ చర్యలను పునరుద్ధరించడం ద్వారా, రోగనిరోధక చెక్‌పాయింట్ డ్రగ్స్ అంతకుముందు పైకి కనిపించకుండా దాక్కున్న క్యాన్సర్ సెల్స్‌ను చూసి, దాడి చేయడంలో మెరుగ్గా పని చేస్తాయి. ప్రతి రకం క్యాన్సర్‌కు ప్రత్యేకంగా వ్యాక్సిన్‌ను డిజైన్ చేయవలసిన అవసరం లేకుండా అన్నీ క్యాన్సర్లకు ఉపయోగపడే విధంగా జనరలైజ్డ్ ఎంఆర్ఎన్ఏ ఫార్ములేషన్‌ను స్టాండర్డ్ ఇమ్యునోథెరపీస్‌కు జోడించవచ్చునని పరిశోధకులు చెప్పారు.

# ఉచితంగా ఏఐ సర్వీసులు ఇస్తే లాభమేంటి?

భారతదేశ సాంకేతిక పర్యావరణ వ్యవస్థలో ఉచితంగా ఏఐ (కృత్రిమ మేధస్సు) సేవలు అందుబాటులో ఉండటం అనేది రెండు వైపులా పదునున్న కత్తితో సమానమని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఒకవైపు ఇది వినియోగదారులకు, సాంకేతిక అభివృద్ధికి గొప్ప అవకాశాలను అందిస్తుంది. మరోవైపు, దేశీయ జనరేటివ్ ఏఐ ఆవిష్కరణ, స్థానిక డెవలపర్‌ల దీర్ఘకాలిక పోటీతత్వానికి ఇది తీవ్రమైన సవాళ్లను సృష్టిస్తుంది.



### ఉచిత ఏఐ సర్వీసులు

ఖర్చు లేకుండా ఏఐ సాధనాలను ఉపయోగించే అవకాశం లభించడం వల్ల సామాన్య ప్రజలకు కూడా అత్యాధునిక సాంకేతికత అందుబాటులోకి వస్తుంది. చిన్న వ్యాపారాలు, విద్యార్థులు, కంటెంట్ సృష్టికర్తలు తమ పనులను మెరుగుపరచుకోవడానికి, సృజనాత్మకతను పెంచుకోవడానికి దీనిని ఉపయోగించుకుంటున్నారు. ఉచిత ప్లాట్‌ఫామ్‌లు విద్యార్థులకు, ఔత్సాహిక డెవలపర్‌లకు ఏఐ మోడల్‌లతో ప్రయోగాలు చేయడానికి, నేర్చుకోవడానికి, కొత్త పరిష్కారాలను ఆవిష్కరించడానికి ఒక పరీక్షా వేదికలా పనిచేస్తున్నాయి. ఉదాహరణకు, ఉచిత జనరేటివ్ ఏఐ టూల్స్ ద్వారా నివేదికలు రాయడం, ఈమెయిల్‌లకు సమాధానాలు ఇవ్వడం లేదా కోడింగ్‌లో సహాయం పొందడం వంటివి పనిలో వేగం, సామర్థ్యాన్ని పెంచుతాయి.

### లాభాలు ఉన్నప్పటికీ..

ఉచిత సేవలను ఉపయోగించేటప్పుడు వినియోగదారులు తమ వ్యక్తిగత, వృత్తిపరమైన డేటాను ఆయా కంపెనీలకు తెలియకుండానే ఏఐకి ఇస్తున్నారు. ఈ డేటాను ఏఐ మోడల్ శిక్షణకు లేదా ఇతర వాణిజ్య ప్రయోజనాలకు ఉపయోగించవచ్చు. ఉచిత సంస్కరణలు తరచుగా పరిమిత ఫీచర్‌లు, తక్కువ వేగాన్ని కలిగి ఉంటాయి. క్లిష్టమైన పనులకు లేదా మెరుగైన ఫలితాల కోసం వినియోగదారులు తరచుగా పెయిడ్ (చెల్లింపు) సేవలకు మారవలసి వస్తుంది. ఉచితంగా లభించే కొన్ని ఏఐ మోడళ్లు ట్రెయినింగ్ డేటాలోని అంశాలను కూడా యూజర్లకు అందించే అవకాశం ఉంది. దీని వల్ల వినియోగదారులు తప్పుడు ఫలితాలను పొందవచ్చు.

### కంపెనీలపై ప్రభావం

భారతదేశంలో కొత్తగా జనరేటివ్ ఏఐ మోడళ్లను లేదా ఉత్పత్తులను సృష్టిస్తున్న స్థానిక స్టార్టప్‌లు, డెవలపర్‌లకు ఇది సవాలుగా మారవచ్చు. గ్లోబల్ టెక్ దిగ్గజాలు (ఉదాహరణకు మైక్రోసాఫ్ట్, గూగుల్) తమ ఏఐ సేవలను ఉచితంగా లేదా చాలా తక్కువ ధరకు అందించినప్పుడు స్థానిక స్టార్టప్‌లు తమ సర్వీసులకు ధర నిర్ణయించలేవు. అధిక పెట్టుబడి, వనరులు, మెరుగైన మోడళ్లను కలిగి ఉన్న అంతర్జాతీయ సంస్థలతో పోటీపడటం అసాధ్యం. కొత్త కంపెనీ ఉత్పత్తుల ద్వారా లాభాలు సంపాదించడం కష్టమని పెట్టుబడిదారులు గ్రహించినప్పుడు స్థానిక ఏఐ స్టార్టప్‌లకు నిధులు సమకూర్చడం తగ్గిపోతుంది. లాభదాయకత లేకపోవడం వల్ల స్థానిక కంపెనీలు ఆర్ అండ్ డీపై తగినంత పెట్టుబడి పెట్టలేక దేశీయ ఆవిష్కరణకు, ప్రపంచ స్థాయి ఏఐ మోడళ్లను నిర్మించడానికి ఆటంకం ఏర్పడుతుంది.

### ఏఐ సేవలు వాడేటప్పుడు యూజర్లు అనుసరించాల్సినవి..

ఉచిత ఏఐ సాధనాలు తరచుగా వినియోగదారుల డేటాను శిక్షణ కోసం లేదా ఇతర ప్రయోజనాల కోసం ఉపయోగిస్తాయి. కాబట్టి బ్యాంక్ వివరాలు, పాస్‌వర్డ్‌లు, సున్నితమైన వ్యక్తిగత లేదా వృత్తిపరమైన సమాచారం వంటి అత్యంత గోప్యమైన డేటాను ఎప్పుడూ ఏఐ సిస్టమ్‌లలో నమోదు చేయకూడదు. ఏఐ సేవలను ఉపయోగించే ముందు ఆ టూల్స్ డేటా వినియోగ విధానాలు తెలుసుకోవాలి. వారు మీ డేటాను ఎలా నిల్వ చేస్తారు, ఎక్కడ ఉపయోగిస్తారు, ఎవరితో పంచుకుంటారు అనే దానిపై అవగాహన కలిగి ఉండాలి. కీలకమైన నిర్ణయాలు తీసుకునే ముందు లేదా ముఖ్యమైన పత్రాల్లో ఈ సమాచారాన్ని ఉపయోగించే ముందు ఏఐ డేటాను విశ్వసనీయ మూలాల ద్వారా ధ్రువీకరించాలి.



శ్రీ వార్త
జాతీయ తెలుగు దినపత్రిక
కొత్త ఆలోచన.. కొత్త వార్త



# రూటు మార్చిన మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా....





తమన్నా భాటియా. ముందు చిన్న హీరోయిన్ గా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన మిల్కీ బ్యూటీ చాలా తక్కువ టైమ్ లోనే స్టార్ హీరోలందరి సరసన జత కట్టి స్టార్ హీరోయిన్ గా ఓ వెలుగు వెలిగారు. అయితే గత కొన్నాళ్లుగా తమన్నా బాలీవుడ్ లో బాగా బిజీ అయిపోయిన సంగతి తెలిసిందే. బాలీవుడ్ బిగ్ బడ్జెట్ సినిమాల్లో ఎక్కువగా ఐటెం సాంగ్స్ చేస్తూ అలరిస్తున్నారు తమన్నా. బాలీవుడ్ బయోపిక్ లో తమన్నా గత కొన్నాళ్లుగా తమన్నాను ఎక్కువగా ఐటెం సాంగ్స్ లోనే ఆడియన్స్ చూస్తూ వచ్చారు. అలాంటి తమన్నా ఇప్పుడు తన రూట్ ను మార్చి ఓ బాలీవుడ్ బయోపిక్ లో కీలక పాత్ర చేస్తున్నారు. లెజండరీ డైరెక్టర్ వి. శాంతారామ్ జీవిత చరిత్ర ఆధారంగా బాలీవుడ్ లో ఓ సినిమా తెరకెక్కుతుండగా అందులో శాంతారామ్ రెండో భార్య, ఒకప్పటి నటి అయిన జయశ్రీ గద్కర్ పాత్రలో తమన్నా కనిపించనున్నారు. వింటేజ్ వైబ్ ను తీసుకొచ్చిన మిల్కీ బ్యూటీ రీసెంట్ గా మేకర్స్ ఆ సినిమా నుంచి తమన్నా ఫస్ట్ లుక్ పోస్టర్ ను రిలీజ్ చేయగా, అందులో తమన్నా వింటేజ్ సెటప్ లో చీర కట్టులో ఎంతో అందంగా మెరిశారు. ఇంకా చెప్పాలంటే తమన్నా ఆ పోస్టర్ లో ఒక వింటేజ్ నటి యొక్క వైబ్ ను తీసుకొచ్చారు. కెరీర్లో ఇప్పటివరకు ఎక్కువగా గ్లామరస్ రోల్స్ చేసిన తమన్నా రీసెంట్ గా ఎక్కువగా ఐటెం సాంగ్స్ చేస్తూ వచ్చి, ఇప్పుడు సడెన్ గా ఓ బయోపిక్ లో కీలక పాత్ర కు ఎంపికవడం విశేషమనే చెప్పాలి. మరి రెగ్యులర్ గా తమన్నాను గ్లామరస్ లుక్స్ లో చూడటం అలవాటు చేసుకున్న ఆడియన్స్ ను తమన్నా ఈ సినిమాతో ఏ మేరకు మెప్పిస్తుందో చూడాలి. అయితే నటిగా తమన్నా ఇప్పటివరకు ఎప్పుడూ ఫెయిలైంది లేదు. తన వద్దకు వచ్చిన పాత్రకు 100% న్యాయం చేసే తమన్నా మరి ఈ బయోపిక్ తో ఎలాంటి ఫలితాన్ని అందుకుంటారో చూడాలి. అభిజీత్ శిరీష్ దేశ్ పాండే దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో సిద్ధాంత్ చతుర్వేది ప్రధాన పాత్రలో నటిస్తున్నారు.

# దేశీ నైట్స్.. లుక్స్ తో చంపేస్తున్న బాలయ్య బ్యూటీ!



సమయం దొరికితే చాలు వెకేషన్స్ అంటూ ఎంజాయ్ చేస్తున్న హీరోయిన్స్ అటు డే టైం లోనే కాకుండా ఇటు నైట్ టైమ్స్ లో కూడా నగర అందాలను చూస్తూ.. ఆస్వాదిస్తూ గ్లామర్ తో అభిమానులను కూడా అలరిస్తున్నారు. ఈ క్రమంలోనే బాల్కనీలో పౌర్ణమి వెన్నెలలో చల్లని గాలులకు మరింత హీట్ పుట్టించేలా అందంగా ముస్తాబయి అందరి మనసులు దోచుకుంటోంది ప్రముఖ బ్యూటీ ప్రగ్యా జైస్వాల్. మెరూన్ రెడ్ కలర్ చీర కట్టి అందాలు ఆరబోస్తూ.. బాల్కనీలో నగర అందాలను ఆస్వాదిస్తూ షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. పైగా ఈ ఫోటోలకు దేశీ లుక్స్ అంటూ జోడించిన క్యాప్షన్ విపరీతంగా ఆకట్టుకుంటుంది. ఇక ఈ మధ్యకాలంలో ఎక్కువగా గ్లామర్ వలకబోస్తూ ప్రేక్షకులను అలరిస్తున్న ప్రగ్యా జైస్వాల్ మరొకసారి మేడ మీద నుంచి అందాలు ఆరబోయడంతో అభిమానులు ఈమె అందానికి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.. ప్రగ్యా జైస్వాల్ అందం చూసి అభిమానులు ఒక్కొక్కరు ఒక్కో విధంగా కామెంట్ చేస్తూ ఆమెపై తమ ప్రేమను పంచుకుంటున్నారు. మొత్తానికైతే ప్రగ్యా జైస్వాల్ షేర్ చేసిన ఈ ఫోటోషూట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ప్రగ్యా జైస్వాల్ మధ్యప్రదేశ్ లోని జబల్పూర్ లో జన్మించింది. పూణేలోని సింబయాసిస్ లా స్కూల్ లో చదివింది. అలాగే సింబయాసిస్ విశ్వవిద్యాలయంలో చదువుతున్న రోజుల్లోనే వివిధ రకాల అందాల పోటీలలో పాల్గొని విజయవంతమైన మోడల్గా ఎదిగింది. కళా, సంస్కృతి రంగంలో ఈమె సాధించిన విజయానికి గానూ 2014 జనవరి 22న సింబయాసిస్ సాంస్కృతిక్ పురస్కారం కూడా లభించింది. 2008లో సెమినా మిస్ ఇండియా అందాల పోటీల్లో పాల్గొని మిస్ ఫ్రెష్ ఫేస్, మిస్ ఫ్రెండ్ ఆఫ్ ఎర్త్ టైటిల్స్ ను సొంతం చేసుకుంది . అంతేకాదు డాబర్ వాటిక , మిలీనియం హైపర్ మార్కెట్ ఫర్ దుబాయ్, రిలయన్స్ డిజిటల్ ఎఫ్బిబి వంటి ఎన్నో పాపులర్ బ్రాండ్స్ కి అంబాసిడర్ గా కూడా చేసింది. అలా పాపులారిటీ సొంతం చేసుకున్న ప్రగ్యా జైస్వాల్ తొలిసారి 2014లో తెలుగు, తమిళ్ ద్విభాష చిత్రమైన దేగాలో అవకాశం అందుకుంది. ఆ తర్వాత టిట్టు ఎంబీఏ అనే హిందీ సినిమాతో బాలీవుడ్లోకి అడుగుపెట్టిన ఈమె 2015లో తెలుగులో వచ్చిన మిర్చి లాంటి కుర్రాడు సినిమాతో తెలుగు సినీ పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమాతో ప్రేక్షకులను పెద్దగా ఆకట్టుకోకపోయినా ఆ తర్వాత క్రిష్ దర్శకత్వంలో వచ్చిన కంచె సినిమాలో నటించింది. ఈ సినిమాతో మంచి పేరు కూడా సొంతం చేసుకుంది. నిజానికి క్రిష్ గతంలో తీసిన గబ్బర్ ఈజ్ బ్యాక్ అనే సినిమాలో పాత్ర కోసం ఆడిషన్ ఇచ్చింది. కానీ ఆ పాత్ర ఆమెకు లభించలేదు. అందుకే క్రిష్ తన తదుపరి చిత్రంలో ఈమెకు అవకాశం కల్పించారు. ఇక అఖండ, డాకు మహారాజ్ సినిమాలతో భారీ పాపులారిటీ అందుకున్న ఈమె.. ఇప్పుడు మళ్లీ స్టార్ హోదాను దక్కించుకోవడానికి ప్రయత్నాలు చేస్తోంది.

# అంతర్జాతీయ వేదికపై మరోసారి.. అరుదైన ఘనత సాధించిన రష్మిక!



పేరుకే కన్నడ బ్యూటీ.. నేడు టాలీవుడ్ స్టార్ హీరోయిన్గా భారీ పాపులారిటీ సొంతం చేసుకున్న రష్మిక మందన్న గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు.. అందం అభినయంతో కాదు నటనతో ఊహించని ఇమేజ్ సొంతం చేసుకుంది ఈ చిన్నది.. నేడు పాన్ ఇండియా స్టార్ హీరోయిన్గా చలామణి అవుతున్న ఈమె.. గత మూడు సంవత్సరాలుగా వరుస చిత్రాలతో.. ఊహించని విజయాలతో.. బాక్సాఫీస్ కలెక్షన్స్ తో స్టార్ హీరోల రికార్డులను కూడా బ్రేక్ చేస్తోంది అనడంలో సందేహం లేదు.

## అంతర్జాతీయ వేదికపై రెండవసారి..

పుష్ప, పుష్ప 2, యానిమల్, ఛావా, సికందర్ , ది గర్ల్ ఫ్రెండ్, కుబేర ఇలా వరుస పెట్టి సినిమాలు చేస్తూ బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్స్ వసూలు చేస్తూ.. బాక్సాఫీస్ క్వీన్ గా పేరు సొంతం చేసుకుంది రష్మిక మందన్న . ఇదిలా ఉండగా అటు కెరియర్ పరంగా బిజీగా మారిన ఈమె.. ఇటు వ్యక్తిగతంగా తన ప్రాణ స్నేహితుడైన విజయ్ దేవరకొండ తో ఏడడుగులు కూడా వేసింది. ఇక ఇప్పుడు వివాహితగా మారిన తర్వాత తన భర్త విజయ్ దేవరకొండ తో కలిసి చేస్తున్న తొలి చిత్రం రణబాలి. ఇప్పటికే ఈ సినిమాలోని రాయలసీమ ప్రాంతానికి సంబంధించి షూటింగ్ షెడ్యూల్ ను పూర్తి చేసుకున్నారు. మరొకవైపు మైసా అనే సినిమాలో కూడా నటిస్తోంది రష్మిక . ఇలా కెరియర్ పరంగా వరుస చిత్రాలతో బిజీగా మారిన ఈమె తాజాగా మరోసారి అంతర్జాతీయ వేదికపై కనిపించనుంది. అంతేకాదు ఈ అరుదైన అవకాశాన్ని అందుకున్న మొట్టమొదటి భారతీయ సినీ నటిగా పేరు కూడా సొంతం చేసుకుంది రష్మిక.

## ఇండియా స్వీట్ హార్ట్ గా రష్మిక..

పూర్తి వివరాల్లోకి వెళితే.. జపాన్ లోని టోక్యోలో మే 23వ తేదీన జరగనున్న " క్రంచీరోల్ యానిమే అవార్డ్స్ 2026"లో రష్మిక ప్రజెంటర్ గా వ్యవహరించబోతోంది. ఈ ప్రతిష్టాత్మక వేదికపై ఈమె రెండవసారి కనిపించడం గమనార్హం.. 2024 లోనే ఈమె ఈ అవార్డ్స్ వేడుకల్లో ప్రజెంటర్ గా సందడి చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు మరొకసారి ఈ అవకాశం అందుకోవడంతో అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు ఈ ప్రతిష్టాత్మక వేదికపై వరుసగా రెండుసార్లు అవార్డులు అందజేస్తున్న తొలి భారతీయ నటిగా రష్మిక చరిత్ర సృష్టించింది. పైగా పుష్ప సినిమాతో జపాన్ లో భారీ క్రేజ్ సంపాదించుకున్న ఈమెను క్రంచీరోల్ సంస్థ "ఇండియా స్వీట్ హార్ట్" గా అభివర్ణించింది.

## పుష్ప మూవీ తోనే సాధ్యం..

ఇకపోతే ఈ క్రెడిట్ మొత్తం పుష్ప సినిమాకే లభిస్తుందని అభిమానులు కూడా కామెంట్లు చేస్తున్నారు. ఎందుకంటే పుష్ప సినిమాలో శ్రీవల్లి పాత్రతో అందరినీ ఆకట్టుకుంది రష్మిక. జపాన్లో ఈ సినిమా విడుదల చేసినప్పుడు శ్రీవల్లి పాత్రకు అక్కడి జపాన్ ఆడియన్స్ ఫిదా అయిపోయారు. ఆమెకు విపరీతమైన ఫాలోయింగ్ కూడా వచ్చేసింది. ఈ నేపథ్యంలోనే అక్కడి సోషల్ మీడియా ఫాలోయింగ్ చూసి నిర్వాహకులు ఈమెను వరుసగా మళ్లీ ఆహ్వానించినట్లు తెలుస్తోంది . ఏది ఏమైనా భారతీయ నటీమణులు ఇలా గ్లోబల్ స్టార్లుగా ఎదుగుతున్నారు అనడానికి రష్మిక మరో ఉదాహరణగా నిలిచింది అని చెప్పవచ్చు. ఇప్పటికే ఆస్కార్ వేదికపై ప్రియాంక చోప్రా రెండవసారి కనిపించి సంచలనం సృష్టించింది.

# సమంత స్టన్నింగ్ లుక్‌కి ఫ్యాషన్ ప్రపంచం ఫిదా!





టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్ గా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి సమంత తాజాగా ఓ స్టన్నింగ్ లుక్‌తో సోషల్ మీడియాను షేక్ చేసింది. జీక్యూ పవర్ లిస్ట్ 2025 ఈవెంట్‌కు హాజరైన సందర్భంలో ఆమె ధరించిన నెట్ డిజైన్ హై స్లిట్ గౌన్ లుక్‌కి నెటిజన్లు పాజిటివ్ గా రియాక్ట్ అవుతున్నారు. బ్లాక్ కాంబినేషన్‌లో మెరిసిన ఈ డ్రెస్‌కు మ్యాచింగ్ మేకప్, స్ట్రెయిట్ హెయిర్ స్టైల్ తో తన యాటిట్యూడ్‌ను మరింతగా హైలైట్ చేసింది. ఈ ఫొటోషూట్‌లో సమంత అటిట్యూడ్, కాన్ఫిడెన్స్, స్టైల్ అన్నీ కలిపి ఫ్యాషన్ మ్యాగజైన్ కవర్‌కి సూట్ అయ్యేలా ఉన్నాయి. ఆమె ఈ లుక్‌లో కేవలం గ్లామర్‌తోనే కాదు, తనలో ఉన్న స్ట్రాంగ్ వైబ్ ని చూపించగలిగింది. నెట్ మెష్ డిజైన్‌తో ఉన్న ఈ డ్రస్సుకు స్లిట్ కట్ ఆకర్షణీయంగా ఉండి, సామంత యొక్క బోల్డ్ లుక్‌కు మరింత అందాన్ని తెచ్చిపెట్టింది. ఈ ఫొటోలు చూసిన అభిమానులు "ఈ లుక్‌తోనే మళ్లీ ట్రెండ్ లోకి వచ్చేసింది" అంటూ కామెంట్లు పెడుతున్నారు. కెరీర్ పరంగా చూస్తే... తాజాగా ఆమె 'బంగారం' అనే సినిమాలో నటిస్తోంది. ఇది ఆమె కమ్‌బ్యాక్ మూవీగా ట్రీట్ అవుతోంది. అంతేకాదు, ఓ ఇంటర్నేషనల్ వెబ్ సిరీస్ అయిన 'రక్త బ్రహ్మాండ'లో కూడా కీలక పాత్ర పోషిస్తోంది. ఇటీవల మయోసైటిస్ అనే అరుదైన వ్యాధితో బాధపడిన సామ్ కొంతకాలం విరామం తీసుకుని ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడంపై దృష్టి పెట్టింది. తన ఫిట్‌నెస్ ప్రయాణంలో భాగంగా వ్యాయామం, ధ్యానం, వైద్య చికిత్సలను పక్కాగా అనుసరిస్తూ, ఇప్పుడు మళ్లీ షూటింగ్‌కి సిద్ధమవుతోంది. "ఆరోగ్యం కోల్పోయినప్పుడే మన అసలు బలాన్ని గుర్తించగలం" అంటూ గతంలో చెప్పిన సామ్ ఇప్పుడు మళ్లీ తన పని పట్ల కమిట్‌మెంట్ చూపిస్తూ, అన్ని ఫ్రంట్‌లలో ముందుకు వెళ్తోంది. ఈ తాజా లుక్‌ద్వారా ఆమె ఇప్పటికీ ఫ్యాషన్ ఐకాన్‌గా నిలిచినట్టు మరోసారి ప్రూవ్ చేసుకుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ ఫొటోలు ఇప్పటికే లక్షల్లో లైక్స్ సంపాదించాయి. కామెంట్లలో అభిమానులు ఆమె స్టైల్, గ్లామర్, గ్రేస్‌పై పొగడ్తల వర్షం కురిపిస్తున్నారు.

# నభా నటేష్ అందాల తుఫాన్.. ఈసారి హాట్‌నెస్ పీక్‌లో!



తెలుగు తెరపై తనదైన ముద్ర వేసిన అందాల భామ నభా నటేష్, తాజాగా సోషల్ మీడియాలో సెగలు పుట్టిస్తోంది. బ్లాక్ కలర్ శారీలో తన హాట్ అందాలను ఆరబోస్తూ ఆమె ఇచ్చిన స్టిల్స్ ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. కొన్ని రోజుల తర్వాత రీ-ఎంట్రీ ఇచ్చిన ఈ 'ఇస్మార్ట్' పిల్లా, వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉండటమే కాకుండా.. గ్లామర్ డోస్ పెంచి అభిమానుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. అసలు ఆ ఫోటోల విశేషాలేంటో చూద్దాం.

## బ్లాక్ శారీలో నభా మెరుపులు.. వైరల్ అవుతున్న ఫోటోలు:

నభా నటేష్ అంటేనే ఒక ఎనర్జీ. సినిమాల్లోనే కాదు, సోషల్ మీడియాలో కూడా ఆమె చాలా యాక్టివ్‌గా ఉంటుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ బ్లాక్ కలర్ శారీలో అదిరిపోయే ఫోటోషూట్ చేసింది. తన నడుము ఒంపులు, ఎద అందాలు హైలెట్ అయ్యేలా ఆమె ఇచ్చిన బోల్డ్ స్టిల్స్ చూసి నెటిజన్లు ఫిదా అయిపోతున్నారు. "బ్లాక్ బ్యూటీ అంటే నీవే నభా" అంటూ కామెంట్స్ సెక్షన్‌ను నింపేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోలు ఇన్‌స్టాగ్రామ్‌లో విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి.

## నన్ను దోచుకుందువటే నుండి ఇస్మార్ట్ శంకర్ వరకు:

కన్నడ సోయగం అయిన నభా, 2018లో 'నన్ను దోచుకుందువటే' సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. ఆ సినిమా ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోయినా, పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్' ఆమె దశను మార్చేసింది. ఆ సినిమాలో తెలంగాణ యాసలో మాట్లాడుతూ, మాస్ లుక్‌లో నభా చేసిన హంగామా అంతా ఇంతా కాదు. ఇక ఆ ఒక్క సినిమాతో ఓవర్‌నైట్ స్టార్ అయిపోయిన ఈ బ్యూటీ, వరుసగా క్రేజీ ఆఫర్లను దక్కించుకుని తెలుగు ప్రేక్షకుల ఫేవరెట్ హీరోయిన్‌గా మారిపోయింది.

## ప్రమాదం నుంచి కోలుకుని.. అదిరిపోయే రీ-ఎంట్రీ:

కెరీర్ ఫుల్ స్వింగ్‌లో ఉన్న సమయంలోనే నభాకు ఒక చిన్న యాక్సిడెంట్ జరిగింది. దీనివల్ల ఆమె కొంతకాలం పాటు సినిమాలకు బ్రేక్ ఇచ్చి బెడ్ రెస్ట్ తీసుకోవాల్సి వచ్చింది. ఆ గ్యాప్ తర్వాత మళ్ళీ ఫుల్ ఎనర్జీతో రీ-ఎంట్రీ ఇచ్చింది. ఇక ఇటీవల ప్రియదర్శి సరసన 'డార్లింగ్' చిత్రంతో పలకరించినప్పటికీ, ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద నిలబడలేకపోయింది. అయినప్పటికీ నభా క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. ప్రస్తుతం ఆమె చేతిలో మూడు భారీ ప్రాజెక్టులు ఉండటం విశేషం.

## స్వయంభు, నాగబంధంతో మళ్ళీ ఫామ్‌లోకి:



ప్రస్తుతం నభా నటేష్ 'స్వయంభు', 'నాగబంధం' మరియు 'ట్రైసన్ నాయుడు' వంటి విభిన్నమైన చిత్రాల్లో నటిస్తోంది. ఈ సినిమాలు ఆమె కెరీర్‌కు చాలా కీలకం కానున్నాయి. ముఖ్యంగా పీరియాడిక్ డ్రామాగా వస్తున్న స్వయంభుపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇక ఈ సినిమాల్లో కనీసం రెండు హిట్టయినా నభా రేంజ్ మళ్ళీ టాప్ ప్లేస్‌కు వెళ్లడం ఖాయం. అటు గ్లామర్ పరంగా, ఇటు నటన పరంగా తనను తాను నిరూపించుకోవడానికి నభా గట్టిగానే ప్రయత్నిస్తోంది.

## ముగింపు: ఇస్మార్ట్ పిల్లా ఈజ్ బ్యాక్:



యాక్సిడెంట్ వంటి కష్టాలను దాటుకుని మళ్ళీ వెండితెరపై మెరవడానికి నభా చేస్తున్న కృషిని అభినందించాల్సిందే. తన గ్లామర్‌తో కుర్రాళ్ల మనసు గెలుచుకుంటూనే, మరోవైపు వైవిధ్యమైన పాత్రలతో మెప్పించడానికి సిద్ధమవుతోంది. మరి రాబోయే సినిమాలతో ఈ అందాల భామ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో వేచి చూడాలి. ఏది ఏమైనా, తన హాట్ ఫోటోలతో నభా మరోసారి సోషల్ మీడియా క్వీన్ అని నిరూపించుకుంది.

## వైసీపీ హయాంలో లేని భరోసా కూటమి ప్రభుత్వంలో ఉంది .. గొర్రెపాటి గోపీచంద్, కుంచె నాని



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్: గత వైసీపీ ప్రభుత్వంలో ఏ కుటుంబానికి భరోసా లేదని, చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజలకు ఆర్థిక, సామాజిక భరోసా కల్పిస్తోందని టీడీపీ సీనియర్ నాయకుడు, ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ అన్నారు.మచిలీపట్నం నగర కార్పొరేషన్ 45వ డివిజన్ లో సోమవారం జరిగిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ సీహెచ్ వివిఎస్ బాపిరాజు, మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచే నాని, బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, 45వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ పి.వి. ఫణి కుమార్ తో కలిసి ఆయన పాల్గొని పెన్షన్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా గోపీచంద్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాల పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచే నాని మాట్లాడుతూ, గత వైసీపీ పాలకులు యువతను గంజాయికి బానిసలుగా మార్చి భవిష్యత్తు నాశనం చేశారని విమర్శించారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి సారథ్యంలో పోర్టు పనులు వేగంగా జరుగుతున్నాయని, అనుబంధ పరిశ్రమల ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు.కమిషనర్ బాపిరాజు మాట్లాడుతూ, త్వరలో కొత్త పెన్షన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. డివిజన్ ప్రజల సమస్యలు విని వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ వారధిగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బత్తిన అగస్తీశ్వరరావు, గంజాల రవికుమార్, డివిజన్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బందరుకోట ఏకాంబరేశ్వర ఆలయంలో 106 మంది మహిళలతో ఘనంగా రుద్రాక్షార్చన -- సిందూరార్చన



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్: బందరుకోట శ్రీ కంచి కామాక్షి సమేత ఏకాంబరేశ్వర స్వామి ఆలయంలో విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా ఆధ్వర్యంలో రుద్రాక్షార్చన సిందూరార్చన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. మంగళవారం ఉదయం 10.30 గంటలకు జరిగిన ఈ పూజా కార్యక్రమంలో 106 మంది మహిళా భక్తులు పాల్గొన్నారు. వేద మంత్రోచ్చారణలు, శివనామస్మరణ మధ్య ఆలయం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ దైవభక్తితో పాటు దేశభక్తిని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. దైవభక్తి మనిషిలో సద్గుణాలు, నైతిక విలువలు పెంపొందిస్తే, దేశభక్తి సమాజం పట్ల బాధ్యతను పెంచుతుందని అన్నారు. దేవాలయాలు కేవలం పూజా స్థలాలుగానే కాకుండా సనాతన ధర్మం, సామాజిక ఐక్యత, దేశభక్తిని పెంపొందించే చైతన్య కేంద్రాలుగా మారాలని పేర్కొన్నారు. యువతలో ఈ రెండు విలువలు పెంపొందితే బాధ్యతాయుత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. భక్తులు దేశ ఐక్యత, సమగ్రత కోసం ప్రార్థించారు. కార్యక్రమంలో కూనపురెడ్డి శ్రీనివాసరావు, దూళిపాల రాము, హరికృష్ణ, జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం, ఆలయ చైర్మన్ బచ్చుల హరీష్, ఈఓ కొండవీటి మురళీకృష్ణ, ధర్మకర్త బచ్చుల శ్రీనివాసరావు, ఆలయ పూజారి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మహిళా భక్తులకు వి హెచ్ పీ జిల్లా అధ్యక్షులు డా. బురగడ్డ శ్రీనాథ్, జిల్లా ప్రభారి పీవీఎస్ నాయుడు ధన్యవాదాలు తెలిపారు.

## కూటమి ప్రభుత్వ రెండేళ్ల అభివృద్ధిపై ఇంటింటి ప్రచారం

### గోకవరంలో పర్యటించిన టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్: కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై టీడీపీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. బందరు మండలం గోకవరం-శిరివెళ్లపాలెం పంచాయతీలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ పర్యటించారు.ఆగస్టు 31న బూత్ నంబర్లు 12, 15లో ఆయన ప్రజలను నేరుగా కలిసి రెండేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, గ్రామీణ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనను వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ ఫలాలు అర్హులందరికీ చేరేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని, ప్రభుత్వ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత:అనంతరం శిరివెళ్లపాలెంలో శిరివెళ్ల కోటేశ్వరరావుకు రూ.18,520 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును అందజేశారు. అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి లంకె శేషగిరిరావు, యూనిట్ ఇన్‌చార్జి మెండు భానుమూర్తి, గుండుబోయిన సుబ్బారెడ్డి, గుండుబోయిన వెంకటేశ్వరరెడ్డి, కొమట్ల రమణారెడ్డి, తుమ్మ అంజనేయులు, పరసా రమేష్, శిరివెళ్ల సాంబశివరావు, శిరివెళ్ల వెంకటేశ్వరరావు, లంకె హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గోల్డ్ మెడల్ సాధించిన కలెక్టర్ డీకే బాలాజీకి ఘన సన్మానం



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో అత్యుత్తమ సేవలు అందించినందుకు గోల్డ్ మెడల్ కు ఎంపికైన కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీని మచిలీపట్నంలో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఈ గోల్డ్ మెడల్ ను ప్రకటించారు. రేపు ఉదయం 11 గంటలకు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే ×=జూ రాష్ట్ర వార్షిక సర్వసభ్య సమావేశంలో గవర్నర్ చేతుల మీదుగా కలెక్టర్ ఈ అవార్డు అందుకోనున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం గాంధీనగర్ లోని వాకర్స్ అసోసియేషన్ హాలులో నిత్య యోగా సాధన అనంతరం కలెక్టర్ బాలాజీని, ఆయన తండ్రి కృష్ణయ్య శెట్టిని యోగా గురువులు, సభ్యులు సన్మానించారు. యోగా గురువు ఘంటసాల గురునాథబాబు మాట్లాడుతూ, చిన్న వయస్సులోనే అనేక అవార్డులు సాధించిన బాలాజీ కృష్ణా జిల్లాకు కలెక్టర్ గా రావడం జిల్లా ప్రజల అదృష్టమని, అవార్డుల కలెక్టర్ గా రికార్డు సృష్టించారని కొనియాడారు. ఇలాంటి ఉత్తమ వ్యక్తిని సమాజానికి అందించిన తల్లిదండ్రులకు నమస్కారాలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టీ యారా జగన్ మోహన్ రావు, యోగా గురువులు చింతయ్య, వడ్డి శ్రీనివాస్, సభ్యులు అశోక్ మాస్టారు, ఆర్.డి ప్రసాద్, నారాయణరావు, సత్యనారాయణ, ప్రసాద్, నాగేంద్ర, రాజకుమారి, రేఖా రంజిత, గిరి కుమారి, కొల్లి శారద తదితరులు పాల్గొన్నారు.



## పేదలకు ఎన్టీఆర్ భరోసా ఆర్థిక అండ ....

### టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్: పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ వారి కుటుంబాలకు ఆర్థిక అండగా నిలుస్తోందని కృష్ణా జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ అన్నారు. సోమవారం మచిలీపట్నం మండలం సారంగిపల్లెం గ్రామంలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లు అందజేశారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా, ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే లక్ష్యంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తామని, ప్రజల కష్టాల్లో అండగా నిలవడం టీడీపీ నాయకుల బాధ్యత అన్నారు.కూటమి ప్రభుత్వం వచ్చాక పింఛన్ల పంపిణీ వేగంగా జరుగుతోందని, పింఛనుదారుడు మరణిస్తే అదే నెలలో వారి భార్యకు పింఛను అందించి కుటుంబానికి అండగా ఉంటున్నామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి ఎన్టీఆర్ భరోసా పథకాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని, ప్రభుత్వం ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉందని అన్నారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వర ప్రసాద్, మోకా శ్రీను, మోకా నాగరాజు, కొక్కిలిగడ్డ గోపాలకృష్ణ, కొక్కిలిగడ్డ వాకలయ్య, పెదసింగు వెంకటరమణ, బోట్ల రాజేష్, గోకపై విజయ్, పెదసింగు నాగార్జున, బోట్ల సాయి స్వర్ణ, గ్రామ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజికి వరుసగా రెండోసారి 'రెడ్ క్రాస్ సేవా స్వర్ణ పథకం'

### రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు, ఆర్థిక వనరుల సమీకరణ, సేవా కార్యక్రమాల విస్తరణకు విశేష కృషికి గుర్తింపు






మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ : కృష్ణా జిల్లా కలెక్టర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కృష్ణా జిల్లా శాఖ అధ్యక్షులు డీకే బాలాజి ప్రతిష్టాత్మకమైన 'రెడ్ క్రాస్ సేవా స్వర్ణ పథకం' పురస్కారాన్ని వరుసగా రెండోసారి అందుకున్నారు. కృష్ణా జిల్లాలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీని బలోపేతం చేయడంలో భాగంగా పూర్తి స్థాయిలో సభ్యత్వ నమోదు చేపట్టడం, సంస్థకు ఆర్థిక వనరులను సమకూర్చడం, సేవా కార్యక్రమాలను విస్తరించడం, సంస్థ అభివృద్ధికి అవసరమైన దిశా నిర్దేశం చేయడంలో కలెక్టర్ డీకే బాలాజి అందిస్తున్న విశేష సహకారాన్ని గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు.విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం నిర్వహించిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వార్షిక సాధారణ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా కలెక్టర్ డీకే బాలాజీ ఈ పురస్కారాన్ని అందుకున్నారు.రెడ్ క్రాస్ సంస్థను జిల్లాలో మరింత పటిష్టం చేయడంతో పాటు, ప్రజలకు మానవతా సేవలను విస్తృతంగా అందించేందుకు కలెక్టర్ అందిస్తున్న ప్రోత్సాహం, మార్గదర్శకత్వం, సహకారాన్ని గుర్తిస్తూ ఈ గౌరవాన్ని అందజేశారు. కాగా, గత సంవత్సరం కూడా రెడ్ క్రాస్ సేవా స్వర్ణ పథకాన్ని అందుకున్న కలెక్టర్ డీకే బాలాజీ, ఈ సంవత్సరం కూడా ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందుకోవడం విశేషం. వరుసగా రెండోసారి ఈ పురస్కారం అందుకోవడం ద్వారా రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాల పట్ల ఆయన చూపుతున్న నిబద్ధతకు గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డి.ఆర్.కె. ప్రసాద్, సెక్రటరీ శంకర్‌నాథ్, కార్యవర్గ సభ్యులు, రెడ్ క్రాస్ ప్రతినిధులు కలెక్టర్ డీకే బాలాజీని అభినందించారు.జిల్లాలో రెడ్ క్రాస్ సేవలను మరింత విస్తృతం చేసి, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సహాయం అందించడం, రక్తదాన కార్యక్రమాలను ప్రోత్సహించడం, విపత్తుల సమయంలో సహాయక చర్యలు చేపట్టడం, ఆరోగ్య, సామాజిక సేవా కార్యక్రమాలను విస్తరించడం వంటి అంశాలకు మరింత ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు వారు తెలిపారు.

## జనసేనాని జన్మదిన వేడుకలకు మచిలీపట్నం ముస్తాబు

### కొట్టే వెంకట్రావు ఆధ్వర్యంలో లక్ష్మీ టాకీస్ సెంటర్ లో భారీ ఏర్పాట్లు



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్: జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలకు మచిలీపట్నం నగరం ముస్తాబవుతోంది. జనసేన నాయకుడు కొట్టే వెంకట్రావు ఆధ్వర్యంలో లక్ష్మీ టాకీస్ సెంటర్ వద్ద వినూత్నంగా, ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి.

సేవా కార్యక్రమాలతో వేడుకలు:

జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా సేవా కార్యక్రమాలతో నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా రేపు ఉదయం మచిలీపట్నంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులను సందర్శించి రోగులకు పండ్లను పంపిణీ చేయనున్నారు.

ట్రాక్టర్లతో రైతుల సందడి.. బైకులు, కార్లతో భారీ ర్యాలీ:

పవన్ కళ్యాణ్ పై ఉన్న అభిమానంతో రైతులు తమ ట్రాక్టర్లతో ర్యాలీలో పాల్గొననున్నారు. యువత, జనసేన కార్యకర్తలు, నాయకులు, వీర మహిళలు బైకులు, కార్లతో ర్యాలీలో పాల్గొని సందడి చేయనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా పరిషత్ సెంటర్ నుంచి ర్యాలీ ప్రారంభమై చీరలపూడి, పరాస్ పేట, చిన్నాపురం, హాస్పిటల్ సెంటర్, కోనేరు సెంటర్, రేవతి సెంటర్ మీదుగా తిరిగి లక్ష్మీ టాకీస్ సెంటర్ వరకు కొనసాగనుంది. ర్యాలీని క్రమశిక్షణతో నిర్వహిస్తూ ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పారిశుద్ధ్య కార్మికులకు గౌరవం:

ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న మచిలీపట్నం మున్సిపాలిటీ పారిశుద్ధ్య మహిళా కార్మికులకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇది వారి సేవలకు గుర్తింపుగా చేపట్టిన కార్యక్రమమని తెలిపారు.

సాయంత్రం కేక్ కటింగ్.. 5 వేల మందికి విందు:

సాయంత్రం 6 గంటలకు లక్ష్మీ టాకీస్ సెంటర్ వద్ద భారీ కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం సుమారు 5 వేల మందికి భారీ విందు భోజనం ఏర్పాటు చేశారు. సేవ, రైతులు-యువత భాగస్వామ్యంతో కూడిన ర్యాలీ, కార్మికులకు గౌరవం, సామూహిక విందుతో ఈ వేడుకలు మచిలీపట్నంలో పండుగ వాతావరణాన్ని తీసుకురానున్నాయి. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శాయన శివయ్య, వాలిశెట్టి మల్లి, చిలంకుర్తి పృధ్వి ప్రసన్న, డాక్టర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

## గౌ॥ లోకాయుక్త ఆదేశాలు బేఖాతర్?

### పత్తేలంక మసీదు మాన్యం భూముల పట్టాదారు పాస్ పుస్తకాల రద్దులో జాప్యం ...జంపాన శ్రీనివాస గౌడ్, బేతపూడి జోగేశ్వరరావు



ఉయ్యూరు శ్రీవార్త న్యూస్: కృష్ణాజిల్లా పమిడిముక్కల మండలం పత్తేలంకలోని 32 ఎకరాల 69 సెంట్ల మసీదు మాన్యం భూములకు మంజూరు చేసిన పట్టాదారు పాస్ పుస్తకాలను రద్దు చేయాలని గౌ॥ లోకాయుక్త ఇచ్చిన ఆదేశాలను అధికారులు అమలు చేయడం లేదని ఆర్టీఐ కార్యకర్తలు జంపాన శ్రీనివాస గౌడ్, బేతపూడి జోగేశ్వరరావు ఆరోపించారు.యునైటెడ్ ఫోరమ్ ఫర్ ఆర్టీఐ క్యాంపెయిన్ పేరిట వారు ఒక ప్రకటన విడుదల చేశారు.గౌ॥ లోకాయుక్త కేసు నెం. 2346/2021/బి1/లోక్, 985/2024/బి2 మేరకు ఏపీ స్టేట్ వక్ఫ్ బోర్డు సీఈఓ ఎల్. అబ్దుల్ ఖాదిర్ లెటర్ ఎఫ్ ఎన్ నెంబర్.04/ఆతీశీ/కె ఎస్/2021 సఫ్ల్ .03.05.2024 ద్వారా ఉయ్యూరు ఆర్.డి.ఓ ను ఆదేశించారని తెలిపారు. పత్తేలంక రెవెన్యూ గ్రామంలో సర్వే నెంబర్లు 21, 22/1, 22/2, 22/3, 22/4, 26 లోని 32.68 సెంట్ల మసీదు మాన్యానికి పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేసి, వెట్ ల్యాండ్ లో రైతుల పేర్లు నమోదు చేసిన తహశీల్దార్, వీఆర్వో, రెవెన్యూ ఇన్స్పెక్టర్ పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, గతంలో మంజూరు చేసిన పాస్ పుస్తకాలు రద్దు చేయాలని వక్ఫ్ బోర్డు సీఈఓ ఉత్తర్వులను అమలు చేయాలని కోరుతూ కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీకి గ్రీవెన్స్ సెల్ లో ది.08.07.2024న, ఉయ్యూరు ఆర్.డి.ఓకి ది.02.12.2024న ఫిర్యాదు చేశామని తెలిపారు. ది.28.06.1962న ఏపీ గెజిట్ నెం.26, సీరియల్ నెం.510 ప్రకారం పత్తేలంక మసీదు మాన్యం భూములుగా నమోదు అయి ఉన్నాయని, జీవో ఎంఎస్ నెం.18, తేది.13.10.2014 ప్రకారం ఈ మసీదు మాన్యం భూములను ఏపీ వక్ఫ్ బోర్డు యాక్టు-1954 ప్రకారం స్వాధీనం చేసుకోవాలని 2021 నుండి కలెక్టర్ ను కోరుతున్నామని వారు పేర్కొన్నారు.లోకాయుక్త ఆదేశాలు, వక్ఫ్ బోర్డు సీఈఓ ఉత్తర్వులు ఉన్నా పట్టాదారు పాస్ పుస్తకాలు రద్దు కాకపోవడం వెనుక కారణం ఏమిటని ప్రశ్నించారు.

## అభేంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ : మచిలీపట్నం చిలకలపూడి గౌడన్స్ దగ్గర గల శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానం నందు ఈరోజు మొదటి మంగళవారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు పూజలు అలంకరణలు నిర్వహించారు.అనంతరం ఆలయ భక్తబృందంచే 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. మధ్యాహ్నం వెంట్రప్రగడ షణ్ముఖ ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన అన్న సమారాధనలో వందలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి దర్శించి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

## అయోధ్యలో అక్టోబర్ 4, 5 తేదీల్లో ఎన్‌యూజే (ఇండియా) జాతీయ కార్యవర్గ సమావేశాలు

### ఆంధ్రప్రదేశ్ నుంచి సభ్యులు పేర్లు నమోదు చేసుకోవాలి....ఎన్‌యూజే (ఐ) జాతీయ ఉపాధ్యక్షుడు బడే ప్రభాకర్



విజయవాడ శ్రీవార్త న్యూస్ : నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా) (ఎన్‌యూజే--ఐ) జాతీయ కార్యవర్గ సమావేశాలు అక్టోబర్ 4, 5 తేదీల్లో ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో రెండు రోజులపాటు నిర్వహించనున్నట్లు ఎన్‌యూజే (ఐ) జాతీయ ఉపాధ్యక్షుడు బడే ప్రభాకర్ తెలిపారు.ఈ సమావేశాలకు ఆంధ్రప్రదేశ్ నుంచి హాజరుకానున్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ న్యూస్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (పెన్) సభ్యులు వెంటనే స్పందించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. సమావేశాల అనంతరం కాశీ, ప్రయాగ్‌రాజ్ తదితర ప్రముఖ పుణ్యక్షేత్రాలు, దర్శనీయ ప్రదేశాలను సందర్శించే కార్యక్రమం కూడా ఉంటుందని తెలిపారు. సభ్యుల ప్రయాణ ఏర్పాట్లను ముందుగానే చేసుకోవాల్సి ఉన్నందున ఆసక్తి ఉన్న సభ్యులు తమ పేర్లను వెంటనే నమోదు చేసుకోవాలని సూచించారు.మరిన్ని వివరాల కోసం పెన్ సంఘం ప్రధాన కార్యదర్శి గరికిపాటి శివను సంప్రదించాలని బడే ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

## కృషి విజ్ఞాన కేంద్రంలో ఎల్‌నినో పై అవగాహన

### -రైతులు శాస్త్రవేత్తలతో ముఖాముఖి -

### -యాజమాన్య పద్ధతులపై యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన



ఘంటసాల, ఈవార్త న్యూస్ : కృష్ణాజిల్లాలో ఎల్‌నినో ప్రభావం వల్ల పంటలపై కలిగే ప్రభావాలు రైతులు చేపట్టాల్సిన ముందస్తు జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించేందుకు 4న శుక్రవారం ఘంటసాలలోని కృషి విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో ఎల్‌నినో పై అవగాహన నిర్వహించనున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డా. డి. సుధారాణి తెలిపారు. ప్రజా ప్రతినిధులు, ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి, డా. పి. వి. సత్యనారాయణ , విశ్వవిద్యాలయ అధికారులు, ప్రధాన శాస్త్రవేత్తలు, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు పాల్గొంటారని తెలిపారు. రైతులు శాస్త్రవేత్తల ముఖాముఖి నిర్వహించి, రైతుల సందేహాలకు శాస్త్రవేత్తలు సంబంధిత శాఖల అధికారులు నివృత్తి చేస్తారని ఆమె తెలిపారు.. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని డాక్టర్ సుధారాణి కోరారు

## ఎల్పీజీ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలి

### ... జిల్లా పౌర సరఫరాల టీ శివరామ ప్రసాద్



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్: ఎల్పీజీ సిలిండర్లలో ఎటువంటి అంతరాయం లేకుండా బుక్ చేసిన సిలిండర్లను హోమ్ డెలివరీ చేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారి టీ శివరామ ప్రసాద్ ఆదేశించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి సోమవారం సీఎస్ డీటీస్ మరియు ఎల్పీజీలి డీలర్లతో సమావేశం నిర్వహించి, వినియోగదారులకు మెరుగైన ఎల్పీజీ సేవలు అందించేందుకు పలు కీలక సూచనలు మరియు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎల్పీజీ సిలిండర్లను ఎటువంటి అంతరాయం లేకుండా బుక్ చేసిన సిలిండర్లను హోమ్ డెలివరీ చేయాలని జిల్లా పౌర సరఫరాల అధికారి ప్రభుత్వం మరియు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు నిర్ణయించిన ధరలకు మించి వినియోగదారుల నుంచి ఎటువంటి అదనపు మొత్తాన్ని వసూలు చేయరాదని, బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వ, అక్రమ తరలింపు మరియు ఎల్పీజీ సిలిండర్ల మళ్లింపును పూర్తిగా నివారించాలని స్పష్టం చేశారు.వినియోగదారుల అవసరాలకు తగినంత స్టాక్ ను అందుబాటులో ఉంచాలని, బుకింగ్, స్టాక్ మరియు డెలివరీ వివరాలను డిజిటల్ సిస్టమ్ లో సక్రమంగా నమోదు చేయాలని,వినియోగదారుల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. అలాగే ఎల్పీజీ సిలిండర్ల నిల్వ, రవాణా మరియు డెలివరీలో భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. సీఎస్ డీటీస్ తమ పరిధిలోని ఎల్పీజీ డీలర్ల పనితీరును నిరంతరం పర్యవేక్షించి,ఎల్పీజీ సరఫరాలో కొరత, అక్రమ నిల్వ, మళ్లింపు లేదా ఇతర అవకతవకలు గుర్తించిన వెంటనే సంబంధిత అధికారులకు నివేదించాలని జిల్లా పౌర సరఫరాల అధికారి టీ. శివరామ ప్రసాద్ సూచించారు.వినియోగదారుల సంతృప్తి, సకాలంలో హోమ్ డెలివరీ, పారదర్శక సేవలు మరియు భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

Pulisher,Owner and Editor kureti satish, printed by Teja cards and stationery ground floor 26-25-2durgi vari veedhi,opp Inox theater Gandhi nagar Vijayawada ,Andra Pradesh 520003.PRGS Nembar: APTEL/26/A4813, Editor: kureti satish,cell number:9866640784,H. No:21-651a,near Suvarna Kalyana mandapam,parasupeta machilipatnam Krishna Distric, Andra Pradesh.521001